


www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
విజయవాడ సిటీ

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 60
సంచిక (Issue) : 328




శుక్రవారం | 13-3-2020 | పేజీలు: 12 + 16

శ్రీవికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: చవితి ఉ. 8.51 తదుపరి పంచమి తె. 6.16 వరకు; నక్షత్రం: స్వాతి మ. 2.00 తదుపరి విశాఖ; వర్జ్యం: రా. 7.12-8.42; దుర్ముహూర్తం: ఉ. 8.51-9.39, మ. 12.49-1.36; అమృతఘడియలు: శే. ఉ. 7.52, తె. 4.09-5.38; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.29; సూర్యాస్తమయం: 6.22

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore

## ఇది రాష్ట్రమేనా? ఇక్కడ చట్టం అమలవుతోందా?



**సూటి ప్రశ్నలు... ఘాటు హెచ్చరికలు... తీవ్ర వ్యాఖ్యలు!**

రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర పోలీసులు, రెవెన్యూ శాఖల తీరుపై హైకోర్టు విరుచుకుపడింది. అసలు ఇది రాష్ట్రమా... మరొకటా! అని విస్మయం వ్యక్తం చేసింది. చట్ట నిబంధనలు అమలవుతున్నాయా అని సందేహించింది. విశాఖపట్నంలో విపక్ష నేతను సీఆర్పీసీ 151 సెక్షన్ కింద నోటీసు ఇచ్చి అరెస్టు చేయడంపై స్వయంగా హాజరైన డీజీపీపై ప్రశ్నల వర్షం కురిపించింది. ఇక... పేదలకు ఇళ్ల స్థలాల కోసం జరుగుతున్న భూసేకరణ తీరునూ తప్పుపట్టింది. పోలీసులు హద్దు మీరి ప్రవర్తిస్తున్నారని... అసైన్డ్ భూముల్లో వారికేం పని అని ప్రశ్నించింది. రాజధాని కోసం రైతులు ఇచ్చిన పొలాలను ఇళ్ల స్థలాలకు ఇవ్వడం కుదరదని తేల్చి చెప్పింది.

# ఇదేం పద్ధతి!

● ఆర్డర్.. ఆర్డర్..

## పోలీస్ బాస్‌కు హైకోర్టు సూటి ప్రశ్నలు | నోటీస్‌పై క్లాస్

### చట్టం పాటించండి

- ప్రభుత్వాలు వస్తాయి, పోతాయి
- అధికారులు నిష్పాక్షికంగా ఉండాలి
- డీజీపీగా ఉండి మాతో చెప్పించుకుంటే ఎలా?
- 151 సెక్షన్ కింద విపక్ష నేత అరెస్టు సరైనదేనా?
- అక్కడ తీవ్ర నేరం ఎవరు చేయబోయారు?
- న్యాయ పాలన చేయాల్సింది ఇలాగేనా?
- రాష్ట్రంలో నిబంధనల అమలు సరిగా లేదు
- రాజధాని గ్రామంలో అంతమంది పోలీసులా?
- కశ్మీర్‌లో 500 మందితో కవాతు చేస్తే సరే!
- ఇక్కడ చేయించాల్సిన అవసరం ఏమిటి?
- ఇలాగైతే జోక్యం చేసుకోక తప్పదు: హైకోర్టు
- బాబుకు ఆ నోటీసు తప్పే.. డీజీపీ అంగీకారం
- సెక్షన్‌ను ఆయనతో చదివించిన ధర్మాసనం

అమరావతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): పోలీస్ బాస్ గౌతం సవాంగ్‌పై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ప్రశ్నల వర్షం కురిపించింది. 'ఇదేనా పద్ధతి' అని నిలదీసింది. అటు విశాఖపట్నంలో సీఆర్పీసీ సెక్షన్ 151 కింద విపక్షనేత చంద్రబాబును అరెస్టు చేయడం... ఇటు రాజధాని గ్రామాల్లో 144 సెక్షన్ విధింపుపై ప్రశ్నల మీద ప్రశ్నలు వేసి డీజీపీని

మిగతా 2వ పేజీలో...

మీరు ఈ రాష్ట్రానికే డీజీపీ. రాష్ట్రంలో చట్టాలు సక్రమంగా అమలయ్యేలా చూడడం మీ బాధ్యత. హైకోర్టు కల్పించుకుని చెప్పించుకునే పరిస్థితి తెచ్చుకోకూడదు. భవిష్యత్తులోనూ ఇదే కొనసాగితే మేం జోక్యం చేసుకుని తగిన ఆదేశాలు ఇవ్వాల్సిన తప్పని సరి పరిస్థితులు ఏర్పడతాయి.

రాష్ట్రంలో చట్ట నిబంధనలు సరిగ్గా అమలు కావడం లేదు. ఈ కేసు ఒక ఉదాహరణ మాత్రమే. ఇలాంటి ఘటనలపై చాలా కేసులు మా ముందున్నాయి.

ప్రభుత్వాలు వస్తాయి, పోతాయి. కానీ, అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించకుంటే ఎలా? నిబంధనల మేరకు నడచుకోవాల్సిందే. అది ఈ రోజు నుంచే ప్రారంభం కావాలి!

\- హైకోర్టు ధర్మాసనం



గురువారం హైకోర్టుకు హాజరైన డీజీపీ గౌతమ్ సవాంగ్

### అవి రాజధాని కోసం రైతులిచ్చిన భూములు!

- ఇళ్ల స్థలాల కోసం మీ జేబులోంచి ఇవ్వండి
- రాజధాని భూములిచ్చే అధికారం మీకు లేదు
- అభివృద్ధి పనులు మరిచి... పంపిణీయా?
- చట్ట నిబంధనల అతిక్రమణను అనుమతించం

2

## అసైన్డ్ భూముల్లో పోలీసులకేం పని?

- ఒకరి భూమి తీసుకుని మరొకరికా?.. భూములివ్వని ఎస్సీ, ఎస్టీలపై కేసులా?
- ఇలాగైతే కేంద్ర హోం శాఖకు లేఖ రాస్తాం.. రికార్డుల్లో పేర్లు తారుమారు
- బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోక తప్పదు
- ఇంటి స్థలాలకోసం భూసేక'రణం'పై హైకోర్టు ధర్మాసనం తీవ్ర ఆగ్రహం

అమరావతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): 'ఇళ్ల స్థలాల పంపిణీ' పేరుతో ఒకరి భూమిని తీసుకుని మరొకరికి ఎలా ఇస్తారని ప్రభుత్వాన్ని రాష్ట్ర హైకోర్టు ప్రశ్నించింది. గతంలో పంపిణీ చేసిన భూములకు పరిహారం చెల్లించి వెనక్కి తీసుకోవడం... వాటిని మళ్లీ వేరొకరికి ఇవ్వడమంటే

మిగతా 2వ పేజీలో...

# కరోనా కంపం

## ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లు విలవిల

## సెన్సెక్స్ 2,919 పాయింట్లు పతనం

అదో పిపీలకం! కంటికి కనిపించని సూక్ష్మ జీవి! కానీ, అది ఇప్పుడు మొత్తం ప్రపంచాన్నే గజగజ వణికిస్తోంది! ప్రపంచాన్నే శాసించే కుబేరుల కంటికి నిద్రను దూరం చేసింది! సామాన్య మదుపరి గుండెల్లో గునపాలు దించుతోంది! కోట్లాది మందిని ఇళ్లల్లోనే కట్టిపారేసింది! ఒక్క మాటలో చెప్పాలంటే.. ప్రపంచాన్ని స్తంభింపజేసింది! గురువారం మరోసారి ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లను షేక్ చేసింది! అమెరికా నుంచి ఆస్ట్రేలియా వరకూ.. సౌత్ ఆఫ్రికా నుంచి స్వీడన్ వరకూ.. షేర్ మార్కెట్లన్నీ భూకంపం వచ్చినట్లు కంపించాయి! మన స్టాక్ మార్కెట్ మాటలకందని పతనాన్ని చవిచూసింది! స్టాక్ మార్కెట్ చరిత్రలో తొలిసారిగా ఒక్కరోజులోనే సెన్సెక్స్ ఏకంగా 2,919 పాయింట్లు; నిఫ్టీ 868 పాయింట్లు నష్టపోయింది!

**11,00,000 కోట్ల**
**'ఇన్వెస్టర్ల' సంపద ఆవిరి**

- మార్కెట్ చరిత్రలోనే అతి పెద్ద నష్టం
- 2 నెలల్లో పదివేల పాయింట్లు డౌన్
- అమెరికా, యూరప్ సూచీలూ పది శాతానికి పైనే పతనం

8

## ఆ భయమే నిజమైంది

### నెల్లూరు వాసికి కరోనా పాజిటివ్

- నిర్ధారించిన పుణె వైరాలజీ ల్యాబ్
- అప్రమత్తమైన వైద్య అధికారులు
- మరిన్ని పటిష్ఠ చర్యలకు ఏర్పాట్లు
- సినిమా హాళ్ల మూతకు కలెక్టర్ ఆదేశం
- రాష్ట్రంలో మరో 6 అనుమానిత కేసులు



నెల్లూరులోని జీజీహెచ్‌లో కరోనా ఐసోలేషన్ వార్డు

9

## రాష్ట్రం హై అలర్ట్!

9

- అవసరమైతే 1897 చట్టం అమలుకు సన్నాహాలు
- కరోనా బాధితులకు నిర్బంధ వైద్యం!
- జిల్లాలను అప్రమత్తం చేసిన అధికారులు

## దేశంలో తొలి కరోనా మరణం

- కొవిడ్-19తోనే కలబుర్గివాసి మృతి
- 125 దేశాల్లో కల్లోలం
- ఐరోపాతో నెలపాటు కటీఫ్
- కరోనాపై ట్రంప్ ఆకస్మిక ప్రకటన

9

## కోడికి కరోనా పోటు!

- కొవిడ్-19 దెబ్బకు ధరలు పతనం
- దివాలా దిశగా పౌల్ట్రీ పరిశ్రమ
- ఫిబ్రవరిలోనే రూ.200 కోట్ల నష్టం
- కేజీ కోడిమాంసం ఉత్పత్తి ధర 75
- అమ్మితే వచ్చేది 10 రూపాయలు
- 20 రోజుల్లో రూ.2 తగ్గిన గుడ్డు



నరసన్నపేట సమీపంలో వ్యాన్‌లో తెచ్చి కోళ్లు విక్రయిస్తున్న దృశ్యం

9






## అధికారికంగా వైసీపీలో చేరని బలరాం

- అనర్హత వేటు తప్పించుకొనే యత్నం!
- కుమారుడి చేరికతో సరి

10

## వైసీపీ ఉన్నతికి ప్రతినబూనుదాం

ఐఏఎస్ పీవీ రమేశ్ ట్వీట్




# నరహంతక పాలన



గవర్నర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చంద్రబాబు

- సీఎం నియోజకవర్గంలో విపక్షాలు నామినేషన్లు వేయకూడదా?
- పూతలపట్టు, పుంగనూరు, పీలేరు, మాచర్లలోనూ ఇంతే
- వచ్చినోళ్లను పోలీసులే తరిమేశారు
- స్ర్కూటినీలోనూ విపక్షాలకు అన్యాయం
- వివిధ సాకులతో నామినేషన్ల తిరస్కరణ
- ఇన్ని ఘోరాలు జరుగుతున్నా.. ఎన్నికల సంఘంలో స్పందన లేదు
- ఈ దుర్మార్గాలను చూస్తూ ఊరుకోం
- సుప్రీంకోర్టు వరకైనా వెళ్తాం: చంద్రబాబు

10

## నామినేషన్ల గడువు పెంచండి!

- వైసీపీ దౌర్జన్యాలతో 6 జడ్పీటీసీ, 154 ఎంపీటీసీ సీట్లకు వేయలేకపోయాం
- ఎన్నికల సంఘానికి చంద్రబాబు లేఖ.. ఎక్కడేం జరిగిందో సవివర నివేదిక

ఆమెకు మరో అవకాశం.. గుంటూరు జిల్లా ఘర్షణలపై కీలక నిర్ణయం

## ఇంజనీరింగ్ ఫీజుల్లో భారీ కోత



- రూ.35,000 - రూ.75,000 మధ్యలోనే ఫిక్స్
- టాప్ కాలేజీలకు సైతం రూ.75 వేలతోనే సరి
- రూ.35 వేల కనిష్ఠంలో మెజారిటీ కాలేజీలు
- మేనేజ్‌మెంట్ కోటాలోనూ ఇవే ఫీజులు
- ప్రతిపాదనలకు సీఎం సూత్రప్రాయ ఆమోదం

12




epaper.andhrajyothy.com



# సంపదయే ధర్మానికి, కామానికి ఆలంబన



అర్థ ఇత్యేవ సర్వేషాం కర్మణామవ్యతిక్రమః
న హ్యాతేర్థేన వర్తేతే ధర్మకామావితి శ్రుతిః

'సంపద వల్లనే అన్ని కార్యాలూ నెరవేరుతాయి. సంపద లేకపోతే ధర్మమూ కామమూ సిద్ధించవు' అని భారతంలోని శాంతిపర్వం చెబుతోంది. నిజానికి ఐహిక ఆధ్యాత్మిక సాధనకు సంపదయే మూలం. సంపద ఉంటేనే ధర్మాచరణ సాధ్యమవుతుంది, కామము అనుభవింపబడుతుంది. భారతీయ సనాతన సంప్రదాయం ప్రకారం ప్రతి వ్యక్తీ ధర్మబద్ధంగా సంపదను ఆర్జించి, కామ్యాలను అనుభవించి, మోక్షాన్ని సాధించాలి. ఈ ధర్మ, అర్థ, కామ, మోక్షాలనే.. నాలుగు పురుషార్థాలుగా

పరంజ్యోతి

చెప్పారు. భౌతిక జీవితంలో వర్ణభేదం, వయోభేదం, లింగభేదం లేకుండా అందరూ సంపదను, ఆ సంపదతో వచ్చే భోగాలను అపేక్షిస్తారు. అందుకే 'ధనం మూలం ఇదం జగత్' అన్నారు. అభ్యుదయ కారకమైన సంపదను ధర్మబద్ధంగా అపారంగా సంపాదించి, సద్వినియోగం చేయాలని సనాతన ధర్మం సూచిస్తుంది. సంపదను తాననుభవించడం, అర్హత ప్రాతిపదికగా అవసరార్థులకు దానం చేయడం వల్ల అది సద్వినియోగం అవుతుంది. అర్హతలేని వారికి ఇవ్వడం, అప్రయోజన కార్యక్రమాలకు వెచ్చించడం వల్ల దుర్వినియోగం అవుతుంది. ఒకరికి పెట్టక, తాను తినక, లోభత్వంతో దాచడం వల్ల నిరుపయోగం అవుతుంది. పర్వత శిఖరాల నుండి జలజలా పారే జీవనదులు పంటలను సుభిక్షం చేస్తున్నట్లుగా.. సంపద ఉంటే అన్ని కార్యాలూ సుసంపన్నమవుతాయి. సంపద లేకపోతే ఎండాకాలంలో ఎండిపోయిన చిన్న జలాశయాలవలె కార్యభంగం అవుతుందని రామాయణంలోని యుద్ధకాండ చెబుతోంది.

సంపద ఉన్నచోటే మిత్రులు ఉంటారు, బంధువులు ఉంటారు. ఐశ్వర్యం కలవాడినే లోకం కీర్తిస్తుందని.. సంపదను పొందడంలో మాత్రమే ఆసక్తి కలిగి మానవతను మరిచే వారిని ద్వేషిస్తుందని రామాయణం చెబుతోంది. భూమి, బంగారం, వెండి, అధికారం ఇవి కలహాలకు కారణా లవుతాయని రామునితో వాలి అంటాడు. భారతీయ సంప్రదాయం ప్రకారం వ్యక్తి కర్తవ్యాలు నాలుగు. అవేంటంటే.. బ్రహ్మచర్యాశ్రమంలో విద్యాధనాన్ని సాధించడం. గృహస్థాశ్రమంలో సంతానాన్ని కనిపెంచడం, సంపదను సృష్టించడం, పెంచడం, రక్షించుకోవడం, దానధర్మాలు చేయడం. అలా సంపాదించిన సొమ్మును వానప్రస్థంలో వారసులకు అందజేసి అంతర్ముఖులై యోగ సంపదను సాధించడం. సన్యాసాశ్రమంలో భౌతిక జగత్తును విడిచి ముముక్షత్వ సంపదను సాధించడం. అర్థసాధన ధర్మాభిముఖమైతే శ్రేయస్సు.. కామాభిముఖమైతే దుర్గతులు ప్రాప్తిస్తాయని భారతీయ ఆధ్యాత్మిక ధర్మం బోధిస్తోంది.

- పాలకుర్తి రామమూర్తి, 9441666943

# ఇదేం పద్ధతి!



హైకోర్టు విచారణకు హాజరై బయటకు వస్తున్న డీజీపీ గౌతమ్ సవాంగ్

(మొదటిపేజీ తరువాయి)

ఉక్కిరి బిక్కిరి చేసింది. విశాఖ ఉదంతం అనంతరం... చంద్రబాబుకు తగిన భద్రత కల్పించాలని, ఆయన పర్యటనలు, శాంతియుత నిరసనలు, సమావేశాలకు అనుమతి ఇచ్చేలా పోలీసుల్ని ఆదేశించాలని టీడీపీ మాజీ ఎమ్మెల్యే టి.శ్రావణ్ కుమార్ హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. దీనిపై వివరణ ఇచ్చేందుకు హైకోర్టు ఆదేశాల మేరకు డీజీపీ గౌతం సవాంగ్ గురువారం త్రిసభ్య ధర్మాసనం ముందు హాజరయ్యారు. ప్రతిపక్ష నేతకు సీఆర్పీసీ సెక్షన్ 151 కింద నోటీసు ఇచ్చి అరెస్టు చేయడాన్ని హైకోర్టు తీవ్రంగా తప్పు బట్టింది. ఎందుకిలా జరిగింది? దీనికి బాధ్యులెవరు? చట్ట నిబంధనలు/న్యాయపాలన అమలు తీరు ఇదేనా అని ప్రశ్నించింది. చట్టాల అమలుపై సాక్షాత్తు డీజీపీయే కోర్టుతో చెప్పించుకుంటే ఎలా? అని ఆశ్చర్యం వ్యక్తం చేసింది. మున్ముందు పరిస్థితులు ఇలాగే కొనసాగితే తమ జోక్యం తప్పదని, ఈ వ్యవహారాలపై తగు ఆదేశాలు జారీ చేస్తామని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, న్యాయమూర్తులు జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తిలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఇక... ప్రశాంతంగా నిరసనలు తెలుపుతున్న రాజధాని గ్రామాల్లో 144 సెక్షన్ విధించడం, వందలాదిమంది పోలీసుల్ని మోహరించడం, మహిళలు చిన్నారుల పట్ల అనుచితంగా ప్రవర్తించడం పట్ల మరోమారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

## ఏముందో చదవండి!

విశాఖలో చంద్రబాబుకు సీఆర్పీసీ సెక్షన్ 151 కింద నోటీసు ఇచ్చి అరెస్టు చేసిన నేపథ్యంలో... ఆ సెక్షన్‌లో ఏముందో చదవండి అని డీజీపీని ధర్మాసనం ఆదేశించింది. ఆయన చదివి వినిపించారు. ఆ తర్వాత... ఆ సెక్షన్ కింద విశాఖ డీసీపీ ఇచ్చిన నోటీసును కూడా డీజీపీతో చదివించింది. అనంతరం, విచారణ ఇలా జరిగింది...

**ధర్మాసనం:** మీరు (పోలీసులు) ప్రతిపక్ష నేతకు సీఆర్పీసీ సెక్షన్ 151 కింద నోటీసు జారీ చేయవచ్చా? ఆ సెక్షన్ కింద ఆయనను అరెస్టు చేయవచ్చా? కాగ్నిజబుల్ (తీవ్ర) నేరాలకు పాల్పడే అవకాశముంటే, వాటిని అడ్డుకునేందుకు 151 నోటీసు ఇస్తారని మీరే చదివారు. ప్రతిపక్షనేత విశాఖ వచ్చినప్పుడు ఎవరు తీవ్ర నేరం చేయబోయారు? ఆ నేరానికి రూపకల్పన చేసిందెవరు? మీరెవరిని అరెస్టు చేశారు? దీనిని ఎలా సమర్థించుకుంటారు? చంద్రబాబు పర్యటనకు మీరే అనుమతి ఇచ్చారు కదా?!

**డీజీపీ:** అక్కడ నెలకొన్న శాంతి భద్రతల పరిస్థితుల కారణంగా 151 కింద నోటీసు ఇవ్వాల్సి వచ్చింది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగానే అక్కడ నెలకొన్న ఉద్రిక్తలను అదుపు చేసేందుకు, మాజీ ముఖ్యమంత్రిని రక్షించేందుకు ఆ చర్యలు తీసుకున్నాం.

**ధర్మాసనం:** పరిస్థితుల్ని చక్కదిద్దే చర్యలను కాదనడం లేదు. అది పోలీసుల బాధ్యత కూడా! పరిస్థితులు చేయి దాటిపోతున్నాయనుకున్నప్పుడు నివారణ చర్యలు చేపట్టాల్సిందే. కానీ... ప్రతిపక్ష నేతపై సీఆర్పీసీ సెక్షన్ 151ని ఎలా ప్రయోగిస్తారు? ముందు జాగ్రత్త కోసం అరెస్టు చేసే విధానం ఇదేనా? మీ కింది ఉద్యోగి న్యాయంగా నడుచుకోలేదు. 151 కింద నోటీసు ఇచ్చిన ఏసీపీ వైఖరిని విశాఖ సీపీ కూడా సమర్థించారు. అందుకే మిమ్మల్ని పిలవాల్సి వచ్చింది. మీ కింది ఉద్యోగి తప్పు చేయడం వల్లనే మిమ్మల్ని పిలిచాం!

**డీజీపీ:** 151 కింద నోటీసు ఇవ్వాల్సింది కాదు. అది ఆ పరిస్థితులకు అనుగుణంగా లేదు.

**ధర్మాసనం:** మీ విశాఖ సీపీ సమాధానంలో అలా లేదు. ఆ నోటీసును ఆయన సమర్థించుకున్నారు. చట్ట నియమాలను ఉల్లంఘించారు.

**డీజీపీ:** ఆ నోటీసు అప్పటి పరిస్థితులకు అనుగుణంగా లేదు.

**ధర్మాసనం:** ప్రతిపక్షనేత విశాఖ వచ్చినప్పుడు ఎవరు తీవ్ర నేరం చేయబోయారు? ఆ నేరానికి రూపకల్పన చేసిందెవరు? మీరెవరిని అరెస్టు చేశారు? మీరు ఈ రాష్ట్రానికే డీజీపీ. రాష్ట్రంలో చట్టాలు సక్రమంగా అమలయ్యేలా చూడడం మీ బాధ్యత. హైకోర్టు కల్పించుకుని చెప్పించుకునే పరిస్థితి తెచ్చుకోకూడదు. భవిష్యత్తులోనూ ఇదే కొనసాగితే మేం జోక్యం చేసుకుని తగిన ఆదేశాలు ఇవ్వాల్సిన తప్పనిసరి పరిస్థితులు ఏర్పడతాయి. రాష్ట్రంలో చట్ట నిబంధనలు సరిగ్గా అమలు కావడం లేదు. ఈ కేసు ఒక ఉదాహరణ మాత్రమే. ఇలాంటి ఘటనలపై చాలా కేసులు మా ముందున్నాయి. అందుకే మిమ్మల్ని వ్యక్తిగతంగా నేరుగా రమ్మని పిలిపించాం.

**డీజీపీ:** మీరు జారీ చేసే మార్గదర్శకాలను అనుసరించి నడచుకుంటాం. వాటిని అమలు చేస్తాం.

**ధర్మాసనం:** సీఆర్పీసీ 151 కింద నోటీసు ఇవ్వడం తప్పిదమేనని మీరు అంగీకరించారు. అందుకు బాధ్యులైన అధికారులపై ఏం చర్యలు తీసుకున్నారు?

**డీజీపీ:** ఈ వ్యవహారం కోర్టులో ఉంది కాబట్టి చర్యలు తీసుకోలేదు. కోర్టు ఆదేశాల కోసం చూస్తున్నాం.

**ధర్మాసనం:** కోర్టులో ఉన్నదానికి, మీరు చర్యలు తీసుకోవడానికి సంబంధం లేదు. మీ కింది స్థాయి అధికారి తప్పు చేసినప్పుడు చర్యలు తీసుకునే అధికారం మీకుంది. బాధ్యులపై తగిన చర్యలు తీసుకోండి.

**డీజీపీ:** బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

**ధర్మాసనం:** విశాఖ ఏసీపీ తప్పు చేసినందున ఆయనపై చర్యలు తప్పవు. ఏసీపీ చర్యల్ని సమర్థించిన విశాఖ సీపీపై ఏం చర్యలు తీసుకోబోతున్నారు?

**డీజీపీ:** ఇద్దరిపైనా శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం!

**ధర్మాసనం:** ఆ పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయండి.

## 'రాజధాని'పై ఇలా...

విశాఖ అంశం ముగిసిన వెంటనే రాజధాని గ్రామాల్లో 144 సెక్షన్ విధింపును సవాల్ చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ ప్రారంభమైంది.

**ధర్మాసనం:** మీరు పెన్‌డ్రైవ్‌లో ఉన్న వీడియోను చూశారా?

**డీజీపీ:** చూశాను.

**ధర్మాసనం:** ఆ గ్రామంలో 500 మంది పోలీసులు ఎందుకున్నారు? అక్కడ అంతమంది అవసరమా? ఆ వీడియోలోని పోలీసు హెచ్చరికలు అభ్యంతరకరంగా ఉన్నాయి. అంత అవసరం ఏం వచ్చింది?

**డీజీపీ:** అది జనవరి 10 తేదీన... రాజధాని ఆందోళనలు మొదలైన 22 రోజుల తరువాత మందడంలో జరిగింది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగానే పోలీసులు ఫ్లాగ్ మార్చ్ చేశారు.

**ధర్మాసనం:** నిరసన ప్రశాంతంగా జరుగుతున్నప్పుడు అంతమంది పోలీసులతో ఫ్లాగ్ మార్చ్ జరపాల్సిన అవసరం ఏమొచ్చింది? పోలీసులు వ్యవహరించిన తీరు, వారి ప్రకటన మనం ప్రజాస్వామ్య దేశంలో లేమన్న భావన కలిగించేలా ఉంది. 500 మంది పోలీసులు కశ్మీర్‌లో ఫ్లాగ్‌మార్చ్ చేస్తే పెద్దగా పట్టించుకోవాల్సిన పని లేదు. కానీ ఇక్కడంత అవసరమేమొచ్చింది?

**డీజీపీ:** ఆ ఒక్కరోజే అలా జరిగింది.

**ధర్మాసనం:** ఒక్కరోజు కాదు. వరుసగా జరుగుతూనే ఉంది. మీరు రాష్ట్ర పోలీస్ శాఖకు అధిపతి. చట్టప్రకారం నడుచుకోనివారిపై చర్యలు తీసుకోండి. దీనిపై మళ్లీ మళ్లీ చెప్పబోం. 'ప్రభుత్వాలు వస్తాయి, పోతాయి. కానీ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించకుంటే ఎలా? నిబంధనల మేరకు నడుచుకోవాల్సిందే. అది ఈ రోజు నుంచే ప్రారంభం కావాలి. మా ఆదేశాలు అమలు చేస్తారని ఆశిస్తున్నాం.

**డీజీపీ:** థ్యాంక్యూ సర్. చట్టాల్ని సక్రమంగా అమలు చేసే బాధ్యత తీసుకుంటాను. అది నా కర్తవ్యం. మీ ఆదేశాలను పాటిస్తాను.

### సాయంత్రం దాకా కోర్టులోనే!

డీజీపీ గౌతం సవాంగ్ గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు హైకోర్టులోనే గడిపారు. ఉదయం 10.25 గంటలకు కోర్టుకు వచ్చిన డీజీపీ సాయంత్రం 4 గంటల వరకు అక్కడే ఉన్నారు. ఆయనతోపాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు సైతం కోర్టుకు వచ్చారు.

# ఏపీలో 'మద్రాస్' చట్టం!

ఎక్కడ ఆంధ్రప్రదేశ్...ఎక్కడ మద్రాస్ ప్రెసిడెన్సీ? మద్రాస్ ప్రెసిడెన్సీ నుంచి విడిపోయి ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. ఆ తర్వాత హైదరాబాద్ ప్రాంతంతో కలిపి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అవతరించింది. ఇటీవల రాష్ట్ర విభజన జరిగి 13 జిల్లాలతో కూడిన ఏపీగా మిగిలింది. ఈ మధ్యకాలంలో భూముల కేటాయింపు, స్వాధీనంపై అనేక చట్టాలు తీసుకొచ్చారు. అయినా.. ఏపీలో తాజాగా మద్రాస్ ప్రెసిడెన్సీ చట్టాన్ని రెవెన్యూ అధికారులు అమలు చేసి అడ్డంగా దొరికిపోయారు.

- భూముల స్వాధీనానికి 'ప్రెసిడెన్సీ' కింద నోటీసులు
- ఒకే రోజు నోటీసు.. స్వాధీనం
- అడ్డంగా దొరికిపోయిన రెవెన్యూశాఖ
- కోర్టు అక్షింతలతో దిద్దుబాటు చర్యలు

అమరావతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో మద్రాస్ ప్రెసిడెన్సీ చట్టం అమలు చేస్తే ఎలా ఉంటుంది? భూములను స్వాధీనం చేసుకోవడానికి సొంతంగా అనేక చట్టాలు ఉన్నా..మద్రాస్ ప్రెసిడెన్సీ చట్టం కింద నోటీసులు ఇస్తే చెల్లుబాటవుతుందా? ఒకే రోజు నోటీసు ఇచ్చి...అదే రోజు మధ్యాహ్నానికి పంటను తొలగించి భూమిని స్వాధీనం చేసుకుంటే చట్టం అనుమతిస్తుందా? ఇవన్నీ రెవెన్యూశాఖకు తెలియనివి కావు. చట్టాలను తయారు చేసి అమలు చేయడం, వాటిని పాటించాలని ప్రజలకు గుర్తుచేయడంలో ఆ శాఖకు ఎనలేని ఘనకీర్తి ఉంది. అలాంటి శాఖే ఏపీలో ఇళ్లస్థలాలకు భూముల స్వాధీనానికి మద్రాస్ ప్రెసిడెన్సీ చట్టాన్ని వర్తింపజేసింది. ప్రభుత్వ, పోరంబోకు, కాలువ గట్లు తదితర భూములు ఆక్రమణకు గురైతే, వాటిని స్వాధీనం చేసుకునేందుకు ఆంధ్రప్రదేశ్ భూ ఆక్రమణ చట్టం-1905ను తీసుకొచ్చారు. ఏపీ ఆవిర్భావం నుంచి ఇదే చట్టాన్ని అమలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అభ్యంతరకరమైన భూములను పేదలు ఆక్రమించుకొని సాగుచేసుకుంటుంటే వాటిని స్వాధీనం చేసుకోవడానికి ఈ చట్టంలోని నిబంధనల ఆధారంగానే నోటీసులు ఇవ్వాలి. కానీ ఏ చట్టం కింద ఏ నోటీసు ఇచ్చినా ఎవరు పట్టించుకుంటారులే! అన్న ధీమాతో పేదల ఆక్రమణలో ఉన్న భూముల స్వాధీనానికి మద్రాస్ ప్రెసిడెన్సీ చట్టం కింద కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారు. గుంటూరు, ఉభయ గోదావరి, కృష్ణా తదితర జిల్లాల్లో ఈ తరహా నోటీసులు ఇచ్చినట్లు రైతులు హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

### రెండు రకాల భూములు..

ఆక్రమణ భూముల్లో రెండు రకాలు ఉంటాయి. అభ్యంతరకరమైనవి అంటే చెరువు, వాగు, కుంట భూములు. వీటిని కొంతమంది కాలాన్ని బట్టి సాగుకు వినియోగిస్తుంటారు. అభ్యంతరం లేనివి అంటే పోరంబోకు, కొండ భూములు. సుదీర్ఘకాలం అవి పేదల ఆక్రమణలో ఉంటే అభ్యంతరం లేని కేటగిరీ కింద ఆ భూములను పేదల పేరిట క్రమబద్ధీకరిస్తుంటారు. గత కొంతకాలంగా క్రమబద్ధీకరణ చేయడం లేదు. ఇప్పుడు ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వానికి భూమి కావాల్సి వచ్చింది. దీంతో పేదల సాగులో ఉన్న పోరంబోకు భూములను స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలిచ్చారు. దీని ప్రకారం భూ ఆక్రమణ చట్టంలోని సెక్షన్-7 కింద నోటీసు ఇవ్వాలి. 15 రోజుల్లోగా రైతు ఆ నోటీసుపై స్పందించాలి. సహేతుక కారణాలను చూపిస్తూ బదులివ్వడానికి తనకు ఇంకా సమయం కావాలని కోరవచ్చు. దీనికి అనుమతించాలి. ఆ తర్వాత గడువు ముగిశాక, రైతు సమాధానంపై సంతృప్తి చెందకపోతే సెక్షన్-6 ఆధారంగా భూమిని స్వాధీనం చేసుకోవాలి. ఇంటిస్థలాల విషయంలో ఈ నిబంధన అమలు కావడం లేదు. అత్యధిక కేసుల్లో నోటీసులతో సంబంధం లేకుండానే భూములను స్వాధీనం చేసుకుంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో రైతుల నిరసన తీవ్రంగా ఎదురవుతున్న చోట నోటీసులు ఇస్తున్నారు. 4జిల్లాల్లో మాత్రం మద్రాస్ ప్రెసిడెన్సీ చట్టంలోని సెక్షన్ 7 కింద నోటీసులు ఇచ్చారు. దీన్ని రైతులు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే ఇలాంటి కేసులపై అనేక ప్రజాప్రయోజన వాజ్యాలు దాఖలయ్యాయి. వీటిపై హైకోర్టు విచారణ జరిపినప్పుడు మద్రాస్ ప్రెసిడెన్సీ చట్టం కింద నోటీసులు ఇచ్చిన విషయం వెలుగు చూసింది. అంతేకాదు, ఒకే రోజు సెక్షన్ 7 కింద నోటీసు ఇవ్వడం, అదే రోజు సెక్షన్ 6 కింద భూమిని స్వాధీనం చేసుకున్నట్టు ఆర్డర్ ఇచ్చిన విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో ఈ చర్యను హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది.

### కోర్టు విచారణతో వెలుగులోకి..

కోర్టు విచారణ సందర్భంగా భూముల స్వాధీనం, సేకరణలో రెవెన్యూశాఖ నుంచి జరిగిన అనేక తప్పులు చర్చకొచ్చాయి. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్(ఏజీ) హాజరై వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా న్యాయస్థానం లేవనెత్తిన సందేహాలు, ప్రశ్నలకు సర్కారు ఇచ్చిన సమాధానం కొత్త అంశాలను తెరపైకి తెచ్చింది. దీంతో క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగాన్ని, కలెక్టర్లను అప్రమత్తం చేస్తూ, తదుపరిగా న్యాయ చిక్కులు తలెత్తకుండా పనిచేయాలని రెవెన్యూశాఖ అత్యవసర సందేశం పంపించింది. అనేక ప్రాంతాల్లో కుంట పోరంబోకు, బండి దారి కాలువపోరంబోకు, కొండ పోరంబోకు, శ్మశానాల భూములను నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల స్థలాల కోసం తీసుకున్నారు. అసైన్డ్ భూముల స్వాధీనానికి ఏపీ అసైన్‌మెంట్ చట్టం కింద నోటీసు ఇవ్వాలి. కానీ పలు ప్రాంతాల్లో ఇతర చట్టాల కింద నోటీసులు ఇచ్చారు. అనేక కేసుల్లో కౌంటర్ దాఖలు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. భూముల స్వాధీనం, సేకరణలో నిబంధనలు పాటించాలంటూ కలెక్టర్లను ఆదేశించారు.

#### ఉగాదికి ఇళ్ల స్థలాల టార్గెట్ కోసమే!

ప్రైవేటు వ్యక్తుల ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడానికి కూడా ఒక చట్టం ఉంది. దాంట్లోని నిబంధనల ప్రకారం నోటీసులు ఇవ్వాలని అది స్పష్టంగా చెబుతోంది. అయినా, ఉగాదిలోగా ఇంటిస్థలాలకు భూములను సిద్ధం చేయాలని సర్కారు టార్గెట్ ఇవ్వడం, ప్రభుత్వ కోటాలోనే భూములను ఎక్కువగా గుర్తించాలన్న లక్ష్యం పెద్దగా ఉండటంతో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించినట్లు అనేక కేసుల్లో స్పష్టమవుతోంది.

అసైన్డ్ భూముల్లో

# పోలీసులకేం పని?



(మొదటిపేజీ తరువాయి)

ట్యాక్స్ పేయర్ల సొమ్ము (ప్రజాధనం)ను దుర్వినియోగం చేయడమేనని అభిప్రాయపడింది. సుదీర్ఘకాలంగా సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూముల్ని బలవంతంగా తీసుకుని వేరొకరికి ఎలా కేటాయిస్తారని నిలదీసింది. పేదలకు ఇంటి స్థలాలకోసం జరుగుతున్న భూసేకరణపై దాఖలైన వ్యాజ్యాల్లో గురువారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, న్యాయమూర్తులు జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తిలతో కూడిన త్రిసభ ధర్మాసనం విచారణ జరిపింది. "తమ అసైన్డ్ భూముల్ని అప్పగించేందుకు అంగీకరించని ఎస్సీ, ఎస్టీలపై కేసులు పెడతారా? ఇది సరైనా చర్యేనా?' అని నిలదీసింది. కొందరు రెవెన్యూ అధికారులు భూరికార్డుల్లో పేర్లను తారుమారు చేస్తున్నారని, ఇందుకు బాధ్యులైన అధికారులపైనా చర్యలు తప్పవని... అలాంటి వారిపై 467, 468 సెక్షన్ల కింద చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. "అసలు రాష్ట్రంలో చట్ట నిబంధనలు అమలవుతున్నాయా? ఇది రాష్ట్రమా మరేమైనానా? అసైన్డ్ భూముల్లోకి పోలీసులు వెళ్లి బలవంతంగా ఖాళీ చేయిస్తున్నారు. వారికి అక్కడేం పని" అని నిలదీసింది. పోలీసుల చర్యలు హద్దు మీరుతున్నాయని, ఇలాగైతే కేంద్ర హోంశాఖకు లేఖ రాస్తామని మిగతాది కేంద్ర ప్రభుత్వం చూసుకుంటుందని హెచ్చరించింది. గురువారం హైకోర్టుకు హాజరైన డీజీపీని ఉద్దేశించి... "ఆయన తగు చర్యలకు ఉపక్రమించాలి. ఇలాంటి సంఘటనల వల్లే ఆయనను హైకోర్టుకు పిలిపించాల్సి వచ్చింది" అని వ్యాఖ్యానించింది. అలాగే... ఇళ్ల స్థలాల కోసం ఆయా భూముల్లో ఉన్న చెట్లను నరకడం నేరమని, సుప్రీంకోర్టు సైతం దీనిని తీవ్రంగా పరిగణించిందని ధర్మాసనం గుర్తు చేసింది. చెట్ల నరికివేతకు బాధ్యులైన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించింది.

### కోడ్ వేళ.. ఇళ్ల స్థలాల పంపిణీ వద్దు

స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటన వచ్చినందున ఇళ్ల స్థలాల పంపిణీ చేపట్టరాదని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. కేంద్రం నుంచి రావాల్సిన నిధుల కోసం మార్చిలోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తున్నారని, మరోవైపు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు హడావుడిగా భూములు సమీకరిస్తున్నారని త్రిసభ్య ధర్మాసనం వ్యాఖ్యానించింది.

### వీటిపైనే విచారణ...

రాష్ట్రవ్యాప్తంగా లక్షలాదిమంది దళితులు, గిరిజనులకు చెందిన అసైన్డ్ భూములను ప్రభుత్వం బలవంతంగా స్వాధీనం చేసుకుంటోందని... కనీస హెచ్చరికలు లేకుండానే భూములు లాక్కుంటోందని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి రాసిన లేఖను హైకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించిన విషయం తెలిసిందే. విశాఖ జిల్లాలో ఇళ్ల స్థలాల పంపిణీ కోసం నిబంధనలకు విరుద్ధంగా 6 వేల ఎకరాలకు పైగా అసైన్డ్ భూముల్ని సమీకరిస్తున్నారంటూ 'భూసేకరణ ల్యాండ్ పూలింగ్ రైతు కూలీ నిర్వాసితుల సంక్షేమ సంఘం' దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంతోపాటు ఇదే జిల్లా దొండపూడిలో తమ వ్యవసాయ భూముల్లో తహసీల్దార్ జోక్యాన్ని సవాలు చేస్తూ 74 మంది దాఖలు చేసిన పిటిషన్‌పైనా ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా గర్హించింది. గత ఏడాది నుంచి తీసుకున్న భూముల ఆర్ఎస్ఆర్, అడంగల్ రికార్డులను తమ ముందుంచాలని ఆదేశించింది. భూముల స్వాధీనానికి 30 రోజుల ముందుగా నోటీసులు ఇవ్వాల్సి ఉందని... కానీ, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని రైతు కూలీల నిర్వాసితుల సంఘం తరపు న్యాయవాది ధర్మాసనానికి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ ఎస్.శ్రీరాం వాదనలు వినిపిస్తూ.. విశాఖలో చాలా వరకు యజమానుల అంగీకారంతోనే భూములు తీసుకుంటున్నామన్నారు. ప్రజా ప్రయోజనం కోసం భూములు తీసుకోవచ్చని తెలిపారు. భూములిస్తున్న వారికి తగిన పరిహారం చెల్లిస్తున్నామన్నారు.

## అవి రాజధాని కోసం రైతులిచ్చిన భూములు!

- ఇళ్ల స్థలాల కోసం మీ జేబులోంచి ఇవ్వండి
- రాజధాని భూములిచ్చే అధికారం మీకు లేదు
- అభివృద్ధి పనులు మరిచి... పంపిణీయా?
- చట్ట నిబంధనల అతిక్రమణను అనుమతించం

అమరావతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): 'పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలనుకుంటే మీ (ప్రభుత్వం) జేబు నుంచి ఇవ్వండి. అంతే తప్ప రాజధాని కోసం రైతులు ఇచ్చిన భూముల్లో ఇవ్వడం సరి కాదు. ఆ భూముల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చే అధికారం ప్రభుత్వానికి లేదు" అని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టం చేసింది. సీఆర్‌డీఏ ముందస్తు ప్రణాళిక ప్రకారం రాజధాని అభివృద్ధి పనులు చేయాల్సి ఉండగా... ఆ విషయాన్ని వదిలేసిన ప్రభుత్వం, సమీకరించిన భూమిలో 5 శాతాన్ని ఇళ్ల స్థలాలకు ఇస్తామనడం ఎంత వరకు భావ్యమని ప్రశ్నించింది. రాజధానిలో ఇళ్ల స్థలాలు పొందే లబ్ధిదారులు ఐదేళ్ల తరువాత ప్రైవేటు వ్యక్తులకు విక్రయిస్తే ఏం చేస్తారని ప్రశ్నించింది. రాష్ట్ర ప్రభుత్వం కొన్ని నిబంధనలను దాటవేస్తోందని... దీనిని అనుమతించలేమని ఉత్తర్వులు జారీ చేసింది. రాజధాని కోసం సమీకరించిన భూమిలో 1251 ఎకరాలను పేదలకు ఇళ్ల స్థలాల కోసం కేటాయిస్తూ గత 25వ తేదీన జారీ చేసిన జీవో 107ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి, న్యాయమూర్తులు జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తిలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు దమ్మాలపాటి శ్రీనివాస్, అశోక్ భాన్, న్యాయవాది కారుమంచి ఇంద్రనీల్ బాబు వాదనలు వినిపించారు.

## లోకం తీరు




## ఎండాకాలం

| కేంద్రం | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| హైదరాబాద్ | 21.9 | 33.1 |
| విశాఖపట్నం | 23.0 | 33.2 |
| విజయవాడ | 23.4 | 35.8 |
| నెల్లూరు | 24.3 | 34.5 |
| కడప | 24.0 | 39.0 |
| రాజమండ్రి | 18.0 | 31.0 |



### మీ వ్యూహమేమిటో చెప్పండి

కరోనా వైరస్‌తో తలెత్తిన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు తన వ్యూహమేంటో ప్రధాని మోదీ చెప్పాలి. ఆర్థిక రంగానికి గడ్డుకాలం మొదలైంది. నష్ట నివారణ చర్యలు తీసుకోవడంలో ఇప్పటికే ఆలస్యమైంది. 2008లోనూ ఇటువంటి పరిస్థితే ఏర్పడింది. అప్పట్లో మా విధానాలతో దేశ ఆర్థిక రంగాన్ని కాపాడాం. మోదీకి మాత్రం అవగాహన లేదు. ఆర్థిక మంత్రికి ఏమీ తెలియదు.

- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేత



### మహిళలకు వ్యతిరేకంగా ఇంటర్నెట్

మహిళల కోసం ఇంటర్నెట్ పనిచేయడం లేదు. పైపెచ్చు వారిపై విషం చిమ్మేందుకు ఊతమిస్తోంది. లింగసమానత్వం విషయంలో ప్రపంచం పురోగమిస్తోంది. కానీ ఆన్‌లైన్‌లో మహిళలు, బాలికలు వివక్ష, హింసను ఎదుర్కోవడం ఆవేదన కలిగిస్తోంది.

- బెర్నర్స్ లీ, వరల్డ్ వైడ్ వెబ్ సృష్టికర్త



### ఆ గ్రహంపై ఇనుము కురుస్తుంది!

లండన్, మార్చి 12: భూమిపై మంచు కురిసినట్లే.. మనకు 640 కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న ఓ భారీ గ్రహంలో ఇనుము కురుస్తుందని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఆ గ్రహంపై ఉన్న భారీ ఉష్ణోగ్రతలే ఇందుకు కారణమని స్విట్జర్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ జెనీవా శాస్త్రవేత్తలు వెల్లడించారు. తాజా పరిశోధనలు సౌర వ్యవస్థ వెలుపలి గ్రహాల అధ్యయనానికి దోహదపడతాయని చెప్పారు. పిస్సెస్ అనే పాలపుంతలో ఉన్న ఈ గ్రహానికి వాస్ప్-76బీ అని పేరు పెట్టారు. ఇది భూమి వలెనే నక్షత్రం చుట్టూ తిరుగుతుందని, అక్కడ పగటి పూట 2,400 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత ఉంటుందన్నారు. ఇంతటి ఉష్ణోగ్రత వల్ల అక్కడ ఇనుము కరిగి బలమైన గాలుల వల్ల అదే గ్రహంపై చీకటి ప్రాంతంలో చినుకుల్లా కురుస్తుందని చెప్పారు. ఈ వివరాలను నేచర్ అనే జర్నల్ ప్రచురించారు.



### ఒంటరితనానికి వయసుతో సంబంధం లేదు

లండన్, మార్చి 12: ఒంటరితనంతో బాధపడటం అనేది కేవలం వృద్ధుల్లోనే కాదని, అన్ని వయసులవారిలో ఈ సమస్య ఉంటుందని శాస్త్రవేత్తలు చెప్పారు. ఒక్కో వయసులో ఒక్కో కారణం చేత అనేక మంది తాము ఒంటరిగా ఉన్నట్లు భావిస్తారన్నారు. అయితే మానసిక స్థిరత్వం ఉన్నవారిలో ఈ సమస్య తక్కువని చెప్పారు. బ్రిటన్‌లోని ఎడిన్‌బర్గ్ వర్సిటీ శాస్త్రవేత్తలు తమ అధ్యయనంలో భాగంగా.. 45 ఏళ్ల వయసు నిండిన 4 వేల మందిపై పరిశోధనలు నిర్వహించారు. వృద్ధులు ఒంటరిగా ఉంటూ ఒంటరితనంలో బాధపడుతుంటే.. మధ్య వయస్కుల్లో చాలా మంది తమ చుట్టుపక్కల వారితో కలవలేకపోవడం, తమ భావాలను వెల్లడించలేకపోవడం వల్ల ఒంటరితనాన్ని అనుభవిస్తున్నారని చెప్పారు.

# పక్క రాష్ట్రంలో పండిన పాపం!

అతనో దొంగబాబా. అనేక మందిని మోసం చేశాడు. వేలూ లక్షలూ డబ్బులు గుంజాడు! బాధితులు పోలీసులను ఆశ్రయించడం.... ఒక మంత్రిగారి రంగ ప్రవేశంతో కేసుల దాకా వెళ్లకుండానే విషయం 'క్లోజ్' చేయడం! పదేపదే ఇదే జరిగింది! ఆంధ్రప్రదేశ్‌లో తన రాజకీయ పలుకుబడి అలా పని చేసింది. కానీ.... తెలంగాణ పోలీసుల వద్ద ఈ పప్పులు ఉడకలేదు. అక్కడ కేసు నమోదైంది. దెబ్బకు దొంగబాబా అజ్ఞాతంలోకి జారుకున్నాడు. ఇన్నాళ్లు అండగా నిలిచిన మంత్రి 'ష్ గప్‌చుప్'! ఆ బురిడీ బాబా పేరు... కోనాల అచ్చిరెడ్డి. ఆయనకు అండగా ఉన్నది దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్. ఇద్దరికీ మధ్య ఉన్న లింక్ ఏమిటంటారా? అచ్చిరెడ్డి కుమారుడు వంశీ కృష్ణారెడ్డి విజయవాడ నగర వైసీపీ కార్యదర్శి. మంత్రికి సహచరుడు! ఈ బురిడీ బాబా లీలలు 'అంతులేని కథ'లా వరుసగా బయటపడుతూనే ఉన్నాయి!

- బురిడీ బాబాపై తెలంగాణలో కేసు
- వైసీపీలో ఉన్న ఆయన కొడుకుపైనా!
- ఏపీలో బాధితులకు జరగని న్యాయం
- మంత్రి వెలంపల్లి అండదండలు
- ఫిర్యాదులను పట్టించుకోని పోలీసులు


అచ్చిరెడ్డి


మంత్రి వెలంపల్లి శ్రీనివాస్‌తో వంశీకృష్ణారెడ్డి

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

విజయవాడ భవానీపురంలోని త్రిశక్తి జ్యోతిషాలయం అధినేత కోనాల అచ్చిరెడ్డి! సమస్యలు చెప్పుకొందామని తన దగ్గరకు వచ్చేవారిని జాతకాల్లో దోషాలున్నాయంటూ హడలెత్తిస్తాడు. పూజల పేరుతో రూ.లక్షలు దోచేస్తాడు. ఇక మహిళలైతే ఏకంగా నగ్నపూజలంటూ ఒత్తిడి చేస్తాడు. వారి ఫొటోలు తీసి వేధిస్తాడు. ఎవరైనా ఎదురు తిరిగితే మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు పేరు చెప్పి బెదిరిస్తాడు. ఆయనపై ఫిర్యాదు చేసినా ఒక్క కేసు కూడా నమోదు చేయనివ్వకుండా మంత్రి వెలంపల్లి ఒత్తిడి తీసుకొచ్చారని బాధితులు తెలిపారు. దొంగబాబా బాగోతాలపై 'ఆంధ్రజ్యోతి' పలు కథనాలు ప్రచురితం చేసింది. తాజాగా అచ్చిరెడ్డి మరో లీల వెలుగులోకి వచ్చింది. విజయవాడలో ఉన్నత కుటుంబానికి చెందిన ఓ మహిళ కుటుంబ సమస్యలతో అచ్చిరెడ్డిని ఆశ్రయించింది. జాతకంలో దోషం ఉందని, పరిహార పూజలు చేయాలని చెప్పి విడతల వారీగా సుమారు రూ.18లక్షలు వసూలు చేశాడు. నగ్నంగా పూజలు చేస్తే మంచి ఫలితం ఉంటుందని చెప్పడంతో బాధితురాలు నిరాకరించింది. చివరికి... మోసపోయానని గుర్తించి, డబ్బు తిరిగివ్వాలని కోరింది. దీంతో మంత్రి వెలంపల్లి తమకు సన్నిహితుడని, పూజల కోసం ఇచ్చిన డబ్బులు వెనక్కు ఇవ్వడం కుదరదని అచ్చిరెడ్డి, ఆయన కుమారుడు విజయవాడ సిటీ వైసీపీ కార్యదర్శి వంశీకృష్ణారెడ్డి బెదిరించారని బాధితురాలు పేర్కొంది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే తన అంతు చూస్తామన్నారని వాపోయింది. కాగా, ఆర్థిక ఇబ్బందులతో తమను ఆశ్రయించిన హైదరాబాద్‌కు చెందిన ఓ బడా బిల్డర్‌ను కూడా తండ్రీ కొడుకులు పూజల పేరుతో మోసగించి పెద్దమొత్తంలో గుంజినట్లు సమాచారం. గతంలో విజయవాడకు చెందిన ఆనం మోహన్‌రెడ్డి, చెంచులక్ష్మికి చెందిన ఫ్లాట్ కబ్జా చేసేందుకు అచ్చిరెడ్డి ప్రయత్నించారు. అదేమని ప్రశ్నిస్తే మంత్రి అనుచరులమంటూ పలువురు ఫోన్ చేసి బెదిరించారు. ఈ విషయాన్ని కూడా 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చింది. మంత్రి అనుచరుల బెదిరింపులు, అచ్చిరెడ్డి వేధింపులపై ఆ దంపతులు ఫిర్యాదు చేయడంతో అచ్చిరెడ్డితో పాటు ఆ దంపతులపైనా పోలీసులు కేసులు నమోదుచేశారు.

### మంత్రిపైనా చర్యలు తీసుకోవాలి

జాతకాలు, పూజల పేరుతో అమాయక మహిళలను మోసం చేసిన అచ్చిరెడ్డిలాంటి దొంగబాబాలను వెంటనే అరెస్ట్‌చేయాలి. ఆయనకు సహకరిస్తున్న మంత్రిపైనా సీఎం జగన్ తగిన చర్యలు తీసుకోవాలి. బాబా అనుచరుడు సుబ్రహ్మణ్యాన్ని తెలంగాణ పోలీసులు అరెస్టుచేసి విచారించగా అతను బాబా బాగోతం మొత్తం బయటపెట్టాడు. దీంతో అచ్చిరెడ్డి కుటుంబంతో సహా పరారయ్యాడు. అచ్చిరెడ్డిని అరెస్టు చేసి విచారించాలని డిమాండ్ చేస్తున్నాం.

\- నార్నె వెంకట సుబ్బయ్య, హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

### ఖమ్మంలో కేసు నమోదు

దొంగబాబా చేతిలో మోసపోయిన తెలంగాణకు చెందిన మహిళ తొలుత విజయవాడ పోలీసులను ఆశ్రయించింది. తాను అచ్చిరెడ్డి చేతిలో మోసపోయానని, రూ.50లక్షల నగదు, కారు తీసుకుని వేధిస్తున్నాడని ఫిర్యాదు చేసింది. పూజల పేరుతో తనను నగ్నంగా చిత్రీకరించి బెదిరింపులకు పాల్పడుతూ లైంగికంగా వేధిస్తున్నారని పేర్కొంది. కానీ... ఆమె ఫిర్యాదును స్వీకరించి కేసు నమోదు చేసేందుకు పోలీసులు సుముఖత చూపలేదు. తాజాగా అచ్చిరెడ్డి, ఆయన కుమారుడి వేధింపులు తీవ్రం కావడంతో ఆ మహిళ సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు ఖమ్మం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సెక్షన్ 420, 354(ఎ), 406, 506, 509 కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayIndia
www.scr.indianrailways.gov.in

బహిరంగ ఇ-టెండరు ప్రకటన నం. B/E. EGS/21/2019-20 తేది:11-03-2020

భారత రాష్ట్రపతి తరఫున దిగువ సంతకందారు దిగువ తెలిపిన తేది మరియు 15-00 గంటల వరకు, దిగువ పనుల కొరకు ఇ-టెండరు కోరుచున్నారు.

టెండరు నం. B/E.29/1/EGS/77/2019-20
పని పేరు : విజయవాడ మరియు గుంటూరు డివిజన్స్ : మూడు సంవత్సరాల కాలానికి AC కోచ్‌లలో RMPU ల ఫిట్టిడ్ కాంట్రాక్ట్ సమగ్ర నిర్వహణ.
పూర్తి చెయ్యాల్సిన కాలం : 3 సంవత్సరాలు
టెండరు విలువ : (రూ.) 4,80,77,920/-
బయానా : (రూ.) 3,90,400/-
టెండరు డాక్యుమెంట్ ధర: (రూ.) 10,000/-
ముగింపు తేది : 03-04-2020

కాగోరు టెండరుదారులు ఏదేని టెండరు యొక్క ఏదేని మార్పులు/సవరణలు గమనించుటకు టెండరు ముగింపు తేదీలోగా వెబ్‌సైట్ : 'www.ireps.gov.in' దర్శించవలెను.

డివిజనల్ రైల్వే మేనేజర్, (ఎలక్ట్రికల్), విజయవాడ
A0404/20

తదుపరి టెండరు నిబంధనలు/ వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు వెబ్‌సైట్ : http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వద్ద దర్శించండి.


## ఐఎన్‌టీఎస్‌వో ఒలింపియాడ్‌లో నం.1గా శ్రీచైతన్య

హైదరాబాద్, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 3-10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఐఎన్‌టీఎస్‌వో(ఇన్‌ట్సో) ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య విద్యార్థులు నం.1గా నిలిచారని ఆ పాఠశాలల అకడమిక్ డైరెక్టర్ సీమ తెలిపారు. ఈ ఒలింపియాడ్‌లో ఆలిండియా లెవెల్‌లో అత్యధికంగా 86(69%) మంది విద్యార్థులు ల్యాప్‌ట్యాప్‌లను గ్రాండ్ ప్రైజులుగా సాధించారు. 342 మంది విద్యార్థులు ట్యాబ్స్‌ను గెలుపొందారని తెలిపారు. 1251 మంది ప్రోత్సాహక బహుమతులు గెలుపొందారని, 18,421 మంది మెడల్స్‌ను సాధించారన్నారు. విద్యార్థులను ఆమె అభినందించారు.

## ఐఎంవో, ఎన్ఎస్‌వో ఫలితాల్లో నారాయణ హవా



హైదరాబాద్, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్(ఐఎంవో), నేషనల్ సైన్స్ ఒలింపియాడ్(ఎన్ఎస్‌వో) రెండవ దశ ఫలితాల్లో నారాయణ విద్యార్థులు విజేతలుగా నిలిచారని ఆ సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ సింధూర తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో 10లోపు ర్యాంకుల్లో 1, 5వ ర్యాంకులను నారాయణ విద్యార్థులే కైవసం చేసుకున్నారన్నారు. టాప్ 50లో ఏడు ఇంటర్నేషనల్ ర్యాంకులు సాధించి చరిత్ర సృష్టించారని తెలిపారు. రెండోదశకు ఎంపికైన నారాయణ విద్యార్థుల్లో 500లోపు 62 మంది అంతర్జాతీయ స్థాయి ర్యాంకులు సాధించగా, 150 మంది 100లోపు జోనల్ స్థాయి ర్యాంకులు సాధించారని తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

## మండలిని రద్దు చేయొచ్చు: కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి):భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 169 ప్రకారం రాష్ట్రాలలో విధాన మండలి (కౌన్సిల్)ని రద్దు చేయొచ్చు లేదా పునరుద్ధరించవచ్చని కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవిశంకర్‌ప్రసాద్ తెలిపారు. అయితే రాష్ట్ర అసెంబ్లీలో 2/3 మెజార్టీకి తక్కువ కాకుండా సభ్యుల ఆమోదంతో తీర్మానం చేయాల్సి ఉంటుందని తెలిపారు. టీడీపీ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి గురువారం ఈమేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

## చాటింగ్.. చీటింగ్!

- యువతులకు వల.. ఫొటోలతో బ్లాక్ మెయిలింగ్
- ప్రకాశంలో యువకుడి అరెస్టు
- కారు, నాలుగు కిలోల గంజాయి స్వాధీనం

ఒంగోలు క్రైం, మార్చి 12 : మహిళలు, యువతులతో చాటింగ్! వారిని ట్రాప్‌లోకి దించి లొంగదీసుకొని చీటింగ్! ఏకాంతంగా ఉన్న సమయంలో ఫొటోలు చూపి బ్లాక్ మెయిల్! ఇలా అనేక మందిని మోసం చేసిన ఓ యువకుడిని ప్రకాశం పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద ఒక కారు, నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలను ఒంగోలు డీఎస్పీ ప్రసాద్ గురువారం వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. నాగులుప్పలపాడు మండలం చీర్వానుప్పలపాడుకు చెందిన కొల్లూరి చైతన్య దుబాయ్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేశాడు. ఏడాది క్రితం స్వగ్రామం చేరుకున్నాడు. అప్పటి నుంచి మహిళలు, యువతులను మోసగించడం, బ్లాక్ మెయిల్ చేయడం ప్రారంభించాడు. ఒంగోల్లోని ఒక షాపింగ్ మాల్‌లో ఓ విద్యార్థిని పర్సుపోగొట్టుకుంది. అక్కడే ఉన్న చైతన్య ఆమెకు పర్సు వెతికి పెట్టాడు. ఆ పరిచయంతో వెంటనే ఆమె ఫోన్ నంబర్ తీసుకున్నాడు. కొద్దిరోజుల పాటు చాటింగ్ చేసి.. తర్వాత బెదిరింపులకు దిగాడు. ఆమె నాగులుప్పలపాడు పోలీసులకు ఫిర్యాదు చేయగా చైతన్యను పట్టుకున్నారు. చైతన్య కారులో నాలుగు కిలోల గంజాయి దొరికింది. అతనిని విచారించగా విశాఖ నుంచి కొనుగోలు చేసి తెచ్చి ఇక్కడ ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నట్లు అంగీకరించాడని డీఎస్పీ చెప్పారు. విచారణలో అతను అమ్మాయిలను మోసం చేసిన విషయం కూడా బయటపడిందని తెలిపారు. అతనిపై రౌడీషీట్ తెరిచారు.

## ఎవడబ్బ సొమ్మూ కాదు!

- పన్నుల వాటా రాష్ట్రాల రాజ్యాంగ హక్కు
- దేశానికి అన్నం పెట్టే రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి
- మిగతా రాష్ట్రాలు అడుక్కు తింటున్నాయి
- అసెంబ్లీలో తెలంగాణ సీఎం కేసీఆర్

హైదరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): "పన్నుల వాటా పొందడమనేది రాష్ట్రాలకు రాజ్యాంగం కల్పించిన హక్కు! మీరిచ్చేదేమిటి? కిసీ బాప్‌కా నహీ. పన్నుల వాటా సొమ్ము చెల్లించాల్సిందే. సెంట్రల్ డివల్యూషన్ అని అంటుంటారు. నిజానికి, అది సెంట్రల్ డివల్యూషన్ కాదు. కేంద్రం వసూలు చేసిన పన్నుల్లో రాష్ట్రాల వాటా. రాష్ట్రాల నుంచి ఆదాయ పన్ను, కస్టమ్స్ తదితరాలను కేంద్రం వసూలు చేసి, రాష్ట్రాలకు పంచుతుంది" అని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. శాసనసభలో గురువారం బడ్జెట్‌పై జరిగిన చర్చకు ఆర్థిక మంత్రి హరీశ్ రావు సమాధానమిచ్చే సందర్భంలో కేసీఆర్ మాట్లాడారు. "గతంలో చిదంబరం సెంట్రల్ సేల్స్ టాక్స్ (సీఎస్టీ) తెచ్చి రాష్ట్రాలకు వేల కోట్ల రూపాయలు ఎగబెట్టాడు. ఇప్పుడు బీజేపీ జీఎస్టీ తెచ్చి ఎగబెడుతోంది. దేశానికి అన్నం పెట్టే రాష్ట్రాలు ఐదారే. ఈ ఐదారు రాష్ట్రాల్లో రెండు మూడు స్థానాల్లో తెలంగాణ ఉంది. మిగతా రాష్ట్రాలు అడుక్కు తింటున్నాయి. తెలంగాణ నుంచి అన్ని రకాల పన్నుల ద్వారా రాష్ట్రం నుంచి కేంద్రానికి ఏడాదికి రూ.50 వేల కోట్ల వరకు వెళుతుంటే.. అక్కడి నుంచి రూ.24 వేల కోట్లు దాటి రావడం లేదు" అని ధ్వజమెత్తారు. బీజేపీ తన నీచ బుద్ధిని మానుకుంటే మంచిదని హితవు పలికారు.


STATE OFFICE
KHADI AND VILLAGE INDUSTRIES COMMISSION
Ministry of MSME, Govt. of India
Raminenivari Street, 1& 2ND Floor, Bldg. No.56-3-10A, Patamata, VIJAYAWADA-520 010 A.P. Ph.No.0866-2974125, e-mail : sohyderabad.kvic@gov.in

INVITING EXPRESSION OF INTEREST FOR CONDUCTING PHYSICAL VERIFICATION OF PMEGP UNITS

Khadi and Village Industries Commission, Ministry of MSME, Govt. of India inviting expression of interest from the Central/State Government Agencies /Autonomous organizations funded by Central/State Government having proven track record in conducting Evaluation Studies/Surveys etc., for carrying out the physical verification of about 2,946 number of PMEGP Units sanctioned under Prime Minister's Employment Generation Programme (PMEGP) during the year 2016-17 & 2017-18 in Andhra Pradesh State. Interested Agencies may send their detailed profile with similar work done for physical verification of PMEGP Units by 31.03.2020. The Pre-bid meeting of the agencies for giving an idea about the scope of work will be held on 08.04.2020 at 3.00 pm at State Office, KVIC. Vijayawada A.P. Tender documents will be issued to eligible agencies from 08.04.2020 to 17.04.2020 till 5.30 pm. Tenders will be opened on 21.04.2020 at 11.00 am.

ELIGIBILITY OF AGENCY :
1) The agency will be identified state wise for this activity of physical verification
2) The agency may belong to any of the following categories
a) National/State Level Govt. agencies dealing in evaluation studies, technical consultancy, surveys etc., having infrastructure and capacity for physical verification in rural and urban areas including remote and inaccessible areas in the States.
b) Autonomous or statutory organization funded by State/Central Govt. having requisite experience and capacity for physical verification in rural areas in the state including institute/organizations promoted by public sector banks like NABARD etc.
c) The above organizations should have at least 5 years of existence and should have experience at grass root level in survey and evaluation on study in rural and urban areas.
However, the agency having local field office or head office having technical staff with infra-structure with good track record in the State may be given preference and decision of the KVIC is the final. It may please be noted that the State Office, KVIC, Vijayawada is sole authority to cancel the tender without assigning any reason totally or partially.

Place : Vijayawada
Date : 13-03-2020
Dy.Chief Executive Officer (AP)





Honda Motorcycle and Scooter India Pvt. Ltd., Registered Office: Commercial Complex II, Sector - 49-50, Golf Course Extension Road, Gurugram - 122018 (Haryana), India; Website: www.honda2wheelersindia.com; Customer Care: customercare@honda2wheelersindia.com

Honda Exclusive Authorized Dealerships: VIJAYAWADA: Mithra Honda - 8297235235, 0866 -2442149; Sri Santosh Honda - 9703123445, 8019669955; Anvita Honda - 9225922599, 0866-6628333; Vihari Honda- 9703247365, 9703218817; GUDIVADA: Pruthvi Honda - 8977185999, 8977803888; JAGGAIAHPET: Mithra Honda - 08297557149/50; MYLAVARAM: Mithra Honda - 8297568888; KAANURU: Sri Santosh Honda - 08666452666, 9618909494; GANNAVARAM: Sri Santosh Honda - 9912195558, 9391935558; VISSANNAPETA: Aishwarya Honda - 08673-272722, 9000866319; TIRUVURU: Sri VenkataSatya Honda - 08673-253446, 8977836666; KAIKALURU: Pruthvi Honda - 08677-225555, 9642854888; MACHILIPATNAM: Nagasai Honda - 9676945616; KANCHIKACHERLA: Sri Spandana Honda - 08678-273066, 8523034242; NANDIGAMA: Apple Honda - 07660867711, 08678-279001; CHALLAPALLI: Annapurna Honda - 8499900065; NUZIVIDU: Srishivani Honda - 7893194444; VUYYURU: Pruthvi Honda - 08676236236, 8142026888; IBRAHIMPATNAM: Leo Honda - 9348686966; KANKIPADU: Sri Santosh Honda - 7901097975; HANUMAN JUNCTION: Anvita Honda - 9492225959, 08656-245959.
For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com

# దృఢ సంకల్పం

ఇంతలోనే ఎంత మార్పు! కరోనా విస్తరణ వేగం పెరుగుతున్నది. వారం క్రితం దాకా ధైర్యంగా కనిపించిన దేశాలు ఇప్పుడు చుట్టూ గోడలు కట్టేసుకుంటున్నాయి. ఎవరూ రావద్దనీ, తమవారిని పోవద్దనీ అంటున్నాయి. ఆ గోడల్లోపల కూడా జనం ధైర్యంగా లేని స్థితి. ప్రజల మధ్య పలుకరింపులు పోయి, తలుపులు మూసుకొని, కిటికీలు మాత్రమే తెరుచుకున్న దేశాలు అనేకం. నిర్మానుష్యమైన వీధులు, మూతబడిన విద్యా వాణిజ్య కేంద్రాలు, పిట్టకాకిలేని క్రీడామైదానాలు దర్శనమిస్తున్నాయి. మరో పక్క రోగానపడుతున్న రాజకీయ నాయకులు, హాలీవుడ్ నటులు, క్రీడాకారుల సంఖ్య కూడా పెరుగుతున్నది. ఇంతకాలం ఊగిసలాడిన ప్రపంచ ఆరోగ్య సంస్థ కరోనాను 'మహమ్మారి'గా నిర్ధారించింది. పదిహేనువందలకు చేరిన కేసులతో, పెరుగుతున్న మరణాలతో, చేజారిపోతున్న పరిస్థితుల మధ్య అగ్రరాజ్యం అమెరికా తన ఆగ్రహాన్ని యూరప్‌మీద ప్రదర్శించింది. ఆ ఇరవైఆరు దేశాలతో రాకపోకలు నిషేధించింది. చైనావారిని యూరోపియన్ దేశాలు స్వేచ్ఛగా రానివ్వడంతో ఈ సమస్య అమెరికా నెత్తినచుట్టుకున్నదని ట్రంప్ నిప్పులు చెరుగుతున్నారు. కానీ, కరోనాను ప్రపంచానికి అంటించిన చైనా మాత్రం కోలుకుంటోంది.

అలసత్వం కూడదు, చేతులెత్తేయవద్దు అని ప్రపంచదేశాలకు ఆరోగ్య సంస్థ హితవు చెబుతున్నది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా తగు జాగ్రత్తలతో కలసికట్టుగా కరోనాను తరిమేద్దామంటూ ప్రజలకు ధైర్యవచనాలు చెప్పారు. మిగతా దేశాల మాదిరిగానే భారత్ సైతం వీసాల రద్దుతో ఆత్మరక్షణకు ఉపక్రమించింది. పదిహేనవ తేదీ తరువాత కొన్ని దేశాలనుంచి లేదా ఆ దేశాల మీదుగా భారత్‌లో కాలూనివారిని కచ్చితంగా పద్నాలుగురోజులు క్వారంటైన్ చేయాలని కూడా నిర్ణయించుకుంది. తన దేశ పౌరులను విదేశీప్రయాణాలు వాయిదావేసుకోమని హితవు చెప్పింది. కచ్చితమైన మందు కొరవడిన స్థితిలో ఏ దేశమైనా తన పౌరులను రక్షించుకొనేందుకు ఇంతకంటే చేయగలిగేదేమీ లేదు. కరోనా వ్యాప్తి ఎంత భయపెడుతున్నప్పటికీ, కోలుకుంటున్నవారి సంఖ్య చూసినప్పుడు మాత్రం ధైర్యం చిక్కుతుంది. మిగతా ప్రపంచమంతా పెరుగుతున్న బాధితులను లెక్కపెట్టుకుంటున్న తరుణంలో, చైనాలో కొత్త కేసుల నమోదు వేగంగా పడిపోతున్నది. 80వేలమంది రోగుల్లో 60వేలమంది, అంటే దాదాపు డెబ్బయ్‌శాతం రోగం బారినుంచి బయటపడ్డారు. అలాగే, మిగతా దేశాల్లో కూడా దాదాపు యాభైశాతం ఆరోగ్యవంతులైనారు. కరోనా కేసుల్లో కనీసం ఎనభైశాతానికి ఏ ముప్పూ రాబోదనీ, వైరల్ లోడ్ అధికంగా ఉన్నవారికి, అందునా వృద్ధులకు మాత్రమే సమస్య ఉండవచ్చునని ఎప్పటినుంచో చెబుతున్నదే. రోగానికి భయపడటం కంటే జాగ్రత్త పడటం ముఖ్యమని అంటున్నదీ అందుకే. మోదీనుంచి ఇజ్రాయెల్ ప్రధాని నేర్చుకున్న నమస్కారం ఇప్పుడు ప్రపంచదేశాధినేతలందరికీ ఉపకరిస్తున్నది. ప్రిన్స్‌చార్లీ కూడా కరచాలనానికి స్వస్తిపలికారు.

కరోనా ప్రపంచాన్ని విడదీసినా కలసి ఆలోచించేట్టు చేస్తున్నది. అన్నిదేశాలూ ఒక సమస్య గురించి ఉమ్మడిగా మధనపడటం ఇదే ప్రథమం కావచ్చు. కానీ, వ్యాధికంటే అది తెచ్చిన ఆర్థికవిపత్తు మరింత భయానకంగా ఉన్నది. గ్లోబల్‌స్థాయిలో జరిగిన ఆర్థికనష్టాన్ని పూడ్చడం సమీపకాలంలో అసాధ్యం. అసలే ఆర్థిక రంగం కుదేలైన స్థితిలో ఇది మనకు మరో పెద్దదెబ్బ. కరోనా వైరస్ కనీసం ఏడాది పాటు ప్రపంచంమీద పెత్తనం చేయవచ్చునంటూ సింగపూర్ ప్రధాని గురువారం చేసిన ప్రకటన కచ్చితంగా ఆందోళన కలిగించేదే. చాలా దేశాల మాదిరిగా సింగపూర్ విదేశీయుల రాకపోకలను నిషేధించలేదు కానీ, వ్యాప్తి నిరోధానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. సామాజిక మాధ్యమాల యుగంలో ప్రజలకు సమాచారాన్ని చేరవేయడం, వారిని కర్తవ్యోన్ముఖులుగా మార్చడం ప్రభుత్వాలకు కష్టమేమీ కాదు. రోగలక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు, సామూహిక బాధ్యతలను తెలియచెప్పడం నిరంతరం జరుగుతూండవలసిందే. దానితో పాటు అసత్యప్రచారాలకు, గాలివార్తలకు కత్తెరవేయడమూ అవసరం. భారత్‌లో కూడా కేసుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ చేజారిపోతున్న పరిస్థితులైతే ప్రస్తుతానికి లేవు. అయినప్పటికీ, ఎంతటి విపత్తుకైనా సిద్ధపడి పరీక్షాకేంద్రాలు, ఆసుపత్రులను సిద్ధం చేసుకోవాల్సిందే. కరోనాను ఎదుర్కొంటున్న ప్రతీ దేశమూ తన అనుభవాన్ని మనకు అందిస్తున్నది. వ్యాప్తినిరోధం నుంచి రోగనిదానం వరకూ ఆ అవగాహనలన్నీ మనకు అక్కరకువస్తాయి.

నార్లమాట

## మహా పండితుడు కాణే



పూనాలో తన 92వ యేట నిర్యాణం చెందిన డాక్టర్ పాండురంగ వామన్ కాణే ప్రపంచ ప్రసిద్ధికెక్కిన సంస్కృత పండితుడు. న్యాయశాస్త్రంలో కూడా ఆయన మహా పండితుడే. 1947 నుంచి 1949 వరకు రెండేళ్ల పాటు బొంబాయి యూనివర్శిటీకి ఆయన వైస్ ఛాన్సలర్ కూడా. ఇట్టి పదవులను పెక్కింటిని డాక్టర్ కాణే అధిష్ఠించారు. ఇట్టి గౌరవాలను పెక్కింటిని ఆయన పొందారు. ఈ పదవులలో చిట్ట చివరిది 'నేషనల్ ప్రొఫెసర్ షిప్'; ఆ గౌరవాలన్నింటిలో గొప్పది 'భారతరత్న'.

**డాక్టర్ కాణే కీర్తిని శాశ్వతంగా నిలపగలిగినట్టిది ఆయన వ్రాసిన 'హిస్టరీ ఆఫ్ ధర్మ శాస్త్ర' అనే బృహత్తర గ్రంథం. కొన్ని వేల పుటలకు విస్తరిస్తున్న ఈ గ్రంథం హిందూ ధర్మ శాస్త్రాలకు సంబంధించినంతవరకు ఒక ప్రామాణిక రచన మాత్రమే కాక 'ఎన్‌సైక్లోపీడియా'. దీని చివరి సంపుటిని ఆయన 1963లో ప్రచురించిన సందర్భంలోనే నాటి రాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణన్ స్వయంగా పూనా వెళ్ళి, డాక్టర్ కాణేను 'భారతరత్న'గా సన్మానించారు.**

ఈ పదవుల కంటె, ఈ గౌరవాల కంటె డాక్టర్ కాణే కీర్తిని శాశ్వతంగా నిలపగలిగినట్టిది ఆయన వ్రాసిన 'హిస్టరీ ఆఫ్ ధర్మ శాస్త్ర' అనే బృహత్తర గ్రంథం. కొన్ని వేల పుటలకు విస్తరిస్తున్న ఈ గ్రంథం హిందూ ధర్మ శాస్త్రాలకు సంబంధించినంతవరకు ఒక ప్రామాణిక రచన మాత్రమే కాక 'ఎన్‌సైక్లోపీడియా'. దీన్ని రచించడానికి ఆయన 35 సంవత్సరాలు పరిశోధన చేయవలసి వచ్చింది. దీని చివరి సంపుటిని ఆయన 1963లో ప్రచురించిన సందర్భంలోనే నాటి రాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణన్ పూనా స్వయంగా వెళ్ళి, డాక్టర్ కాణేను 'భారతరత్న'గా సన్మానించారు. సంస్కృత భాషా పాండిత్యానికి ఛాందసత్వంతో సన్నిహిత బంధుత్వం సర్వ సాధారణం. కాని, డాక్టర్ కాణే దృష్టి, ఆయన చింతన ఆధునిక మైనట్టివి. ఆయన సంస్కరణను అభిమానించారు. ప్రగతిని కాంక్షించారు. తన భౌతిక కాయాన్ని మంత్రతంత్రాలతో చితిమీద పెట్ట వలదని, దాన్ని 'ఎలక్ట్రిక్ క్రిమెటోరియమ్'లో దహనం చేయవలసిందిగా డాక్టర్ కాణే చెప్పి పోవడం ఆయన సంస్కరణ దృష్టికి ఒక నిదర్శనం.

*1972 ఏప్రిల్ 21 ఆంధ్రజ్యోతి సంపాదకీయం 'డాక్టర్ పాండురంగ వామన్ కాణే' నుంచి*

# కాంగ్రెస్ కింకర్తవ్యం?



**రాజ్‌దీప్ సర్దేశాయి**



దీపశిఖ

ఆశాజనకంగా కన్పించని భవిష్యత్తుకు సంసిద్ధమవ్వడం ఎలా? ఆత్మశోధనే తొలి అడుగు. 2019 సార్వత్రిక ఎన్నికలలో పరాజయం అనంతరం కాంగ్రెస్ కార్యనిర్వాహక వర్గం (సిడబ్ల్యుసి) సమావేశంలో జ్యోతిరాదిత్య సింధియా ఇదే విషయాన్ని నొక్కి చెప్పారు. బీజేపీ లాంటి 21వ శతాబ్ది రాజకీయ మహాశక్తిని ఢీ కొని దిగ్విజయం సాధించేందుకు కాంగ్రెస్ తొలుత ఆత్మశోధన చేసుకోవలసివుందని సింధియా స్పష్టంచేశారు. పార్టీని రక్షించుకోవడంలో ఈ యువనేత తాపత్రయాన్ని కాంగ్రెస్ అధిష్ఠాన వర్గం పట్టించుకోలేదు. మూకీ భావం వహించింది. తొమ్మిది నెలల అనంతరం ఆ మౌనానికి దిగ్భ్రాంతికరమైన అంతరాయం కలిగింది. పార్టీ నుంచి సింధియా నిష్క్రమించారు. బీజేపీలో చేరారు. మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొట్టడానికి ఉద్దేశించిన ఒక పకడ్బందీ పథకంలో భాగంగానే గ్వాలియర్ యువ మహారాజా తన విధేయతను మార్చుకున్నారని ప్రజలు భావించడంలో ఆశ్చర్యమేముంది?

భావజాల నిబద్ధతను నిమజ్జనం చేసిన వర్తమాన రాజకీయాల తీరుతెన్నులకు మరొక ఉదాహరణగా సింధియా పరిణామాన్ని పరిగణించడం సులువే. ఎందుకంటే ఈ రోజు హిందూత్వ ఎజెండాను వ్యతిరేకిస్తున్న 'లౌకిక' యోధులే మరుసటి రోజు బీజేపీ మద్దతుదారులై అధికార తాయిలాలు అందుకుంటున్నారు! మనం ఇప్పటికే మహారాష్ట్రలో ఒక విచిత్ర అధికార సంకీర్ణాన్ని చూస్తున్నాం. సైద్ధాంతికంగా పొసగని కాంగ్రెస్, శివసేనలు ఒకే పక్షాన ఉండడాన్ని సాధ్యం చేసిన రాజకీయ ఏర్పాటు విచిత్రమైనదిగాక మరేమవుతుంది? అధికార వైభోగాల ఆరాటంలో 'మత ప్రమేయం లేని' రాజకీయాలూ కళంకితమవుతున్నాయి. ఆదర్శాలు అస్పష్టమవుతున్నప్పుడు జీవిత వాస్తవాలు వెలుగులు విరజిమ్ముతాయా? ఇంకా ఐదు పదుల వయస్సుకు చేరని యువ రాజకీయ వేత్త, రాష్ట్ర, జాతీయ రాజకీయాలలో తనకు సముచిత స్థానాన్ని కల్పించడానికి, నమ్ముకున్న పార్టీ ఎంతకూ నిరాకరిస్తున్నప్పుడు, ఆహ్వానిస్తున్న అవకాశాలను ఎలా తిరస్కరిస్తాడు? 2019 లోక్‌సభ ఎన్నికలలో జ్యోతిరాదిత్య జయకేతనం ఎగురవేయలేక పోయారు. అంతకు ముందటి సంవత్సరం మధ్య ప్రదేశ్ ముఖ్యమంత్రి పదవి ఆయనకు రాకుండా చేశారు. తస్మదీయులతో చేరితే కేంద్ర మంత్రిపదవి ఖాయంగా దక్కనున్నప్పుడు దురాకర్షణకు లోను కాకుండా ఎవరు ఉండగలరు?

కాంగ్రెస్‌లోని ఆగామి తరం నేతలలో అగ్రగణ్యుడు ఆకస్మికంగా పార్టీ మారాలనే నిర్ణయాన్ని తీసుకోవడానికి అతని అధికార లాలసే కారణమా? సత్యమేమిటంటే, అంతర్గతంగా కూలిపోతున్న కాంగ్రెస్ పార్టీ క్లిష్ట పరిస్థితిని సింధియా నిష్క్రమణ ప్రతిబింబించింది. 2014 సార్వత్రక సమరంలో కాంగ్రెస్ ఓటమి ఊహించినదే. 2019 లోక్‌సభ ఎన్నికలలో ఘోర పరాజయం ఒక ప్రభావశీల రాజకీయ శక్తిగా కాంగ్రెస్ పతనానికి తార్కాణమయింది. గత సార్వత్రక ఎన్నికలలో కాంగ్రెస్, బీజేపీ మధ్య 192 నియోజక వర్గాలలో ముఖాముఖి పోటీ జరగగా కమలనాథులు దాదాపు 175 నియోజకవర్గాలలో 23 శాతం సగటు మెజారిటీ ఓట్లతో విజయం సాధించారు. ఇటీవల ఢిల్లీ విధాన సభ ఎన్నికలలో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన 66 మంది అభ్యర్థులలో కేవలం ముగ్గురు మాత్రమే తమ డిపాజిట్‌ను కాపాడుకోగలిగారు. దీన్ని బట్టి కాంగ్రెస్ పరిస్థితి ఎంతగా దిగజారిపోయిందో అర్థం చేసుకోవచ్చు.

ఈ పరాభవాలకు కాంగ్రెస్ ఎలా ప్రతిస్పందించింది? పరిస్థితులను చక్కదిద్దుకునేందుకు ప్రయత్నించిందా? లేదు. సైద్ధాంతిక స్పష్టతను సాధించేందుకు పూనుకున్నదా? అసలే లేదు. కొత్త ఆలోచనలను స్వాగతించిందా? యువ శ్రేణుల ప్రతిభా పాటవాలను ఉపయోగించుకునేందుకు ఉద్యుక్తమయిందా? ఈ ప్రశ్నలు అడిగి ప్రయోజనం లేదు కదా. 2014 ఓటమి అనంతరం పార్టీని సంస్థాగతంగా సంస్కరించేందుకు చిత్తశుద్ధితో ఒక్క ప్రయత్నమూ జరగలేదు. 'నామినేషన్' సంస్కృతిని అంతమొందించలేదు. మరి పార్టీ అధినేతలతో సాన్నిహిత్యమే పదవీ భాగ్యానికి అర్హతగా కొనసాగుతున్నప్పుడు యువనేతలలో అసంతృప్తి నెలకొనడం అనివార్యం కాకుండా ఎలా వుంటుంది? కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకి చివరిసారి ఎన్నికలు జరిగిందెప్పుడు? రెండు దశాబ్దాల క్రితమే కాదూ? ఫలితంగానే నాయకులకు పదవీ విరమణ వయస్సు నిబంధన అనేది లేకుండా పోయింది. కాబట్టే 92 ఏళ్ళ వృద్ధుడు మోతీలాల్ వోరా సైతం మళ్ళీ రాజ్యసభ సభ్యత్వాన్ని ఆశిస్తున్నారు! ఆయన రాజభక్తి అచంచలమైనది. నిజమే. అయితే మారుతున్న రాజకీయ వాస్తవాలలో ఆయన ఉపయుక్తత ఏమిటి?

ఉన్న మాట చెప్పాలంటే పార్టీ ప్రస్తుత నాయకత్వమే కాంగ్రెస్ సమస్య. 2019 మేలో రాహుల్ గాంధీ ఆగ్రహంతోనో లేదా అలసిపోయో కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా సమర్పించారు. 2019 ఆగస్టులో రాహుల్ స్థానంలో సోనియా తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. ఇది విశదం చేస్తున్నదేమిటి? సంవత్సరాలుగా పార్టీలో పాదుకుపోయిన వారు, ప్రథమ కుటుంబ సభ్యులు మినహా మరెవ్వరినీ నాయకులుగా అంగీకరించేందుకు సిద్ధంగా లేరన్న సత్యాన్నే కాదూ? వేరేవారు ఎవరైనా కాంగ్రెస్ అధ్యక్షులయితే పార్టీలో తమకుగానీ, అసలు పార్టీకిగానీ జీవితమే లేదని వారు విశ్వసిస్తున్నారు మరి. ప్రశాంత పరిస్థితులు ఉన్న కాలంలో పార్టీని సమైక్యంగా నడపడంలో నెహ్రూ–గాంధీ కుటుంబం ప్రశంసనీయంగా వ్యవహరించిందనడంలో సందేహం లేదు. అయితే ప్రస్తుత పరిస్థితులు అలా లేవు. సంక్లిష్టతల నడుమ పార్టీకి సమర్థ సారథ్యం వహించగల రాజకీయ దక్షత, నైతిక అర్హత ఆ ప్రథమ కుటుంబానికి కొరవడ్డాయి. తత్ఫలితంగానే కాంగ్రెస్ కృశించిపోతోంది. 'సర్వాంతర్యామి'అయిన పార్టీ అధిష్ఠాన వర్గానికి కింది స్థాయి కార్యకర్తలతోనే కాదు, పై స్థాయి నాయకత్వ శ్రేణులతో కూడా ఉండవలసిన సంబంధాలు లేకుండా పోయాయి!

**సార్వత్రక, శాసనసభా ఎన్నికలలో ఘన విజయాలు, కీలక వైఫల్యాలతో రాటు దేలిన బీజేపీతో సమర్థంగా పోటీ పడేలా పార్టీని సంపూర్ణంగా పునర్నిర్మించడం కాంగ్రెస్ ముందున్న తక్షణ కర్తవ్యం. కాంగ్రెస్ పునర్వైభవానికి అవశ్యకమైన నాయకత్వ పటిమ ఉన్న జ్యోతిరాదిత్య సింధియా లాంటి నేతలు ప్రత్యర్థి పార్టీ పంచన చేరవలసి రావడానికి బాధ్యులు ఎవరో స్పష్టమే. జరిగిన తప్పును సరిదిద్దుకోకపోతే, యుద్ధం చేయవచ్చే వేళ యోధులు ఎవరైనా కాంగ్రెస్‌లో మిగులుతారా?**

మధ్యప్రదేశ్ వ్యవహారాలే ఇందుకొక ఉదాహరణ. ఆ రాష్ట్రంలో కమల్‌నాథ్ ముఖ్యమంత్రేకాదు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కూడా. గతంలో రెండు మార్లు ముఖ్యమంత్రిగా వున్న దిగ్విజయ్ సింగ్ అభిజాత్యం చూపకుండా ఎలా వుంటారు? మొత్తం మీద రాష్ట్రంలో అధికార పీఠాలన్నిటినీ పాతతరం నాయకులే స్వాయత్తం చేసుకున్నారు. మరి మధ్యప్రదేశ్‌లో పదిహేనేళ్ళ అనంతరం కాంగ్రెస్ మళ్ళీ అధికారానికి రావడంలో కీలక పాత్ర వహించిన జ్యోతిరాదిత్య ఈ పరిస్థితుల పట్ల తీవ్ర అసంతృప్తితో నలిగిపోయారు. యువనేతలకు ప్రభుత్వంలో సముచిత స్థానం కల్పించడంలో కాంగ్రెస్ అధిష్ఠానం ఉపేక్ష వహించింది. వృద్ధనాయకులకే అన్ని బాధ్యతలూ అప్పగించింది. తన 'స్నేహితుడు' రాహుల్ గాంధీ తన పక్షాన నిలబడతారని జ్యోతిరాదిత్య ఆశించారు. ఆయన ఆశలు వమ్మయ్యాయి. పార్టీ కేంద్ర స్థాయిలో నాయకత్వ శూన్యంతో వ్యవహారాలు గతి తప్పాయి. వృద్ధ, యువనేతల మధ్య రాజీ అసాధ్యమైపోయింది. తత్ఫలితమే జ్యోతిరాదిత్య నిష్క్రమణ. కాంగ్రెస్ అధికారంలో వున్న రాజస్థాన్‌లో వ్యవహారాలూ మధ్య ప్రదేశ్‌కు భిన్నంగా లేవు. అక్కడ కూడా ఆగామి తరం నేత సచిన్ పైలట్‌కు ప్రాధాన్యం ఇవ్వక, వృద్ధనేత అశోక్ గెహ్లాట్‌కే ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టారు.

గతతరాల కాంగ్రెస్ నాయకులకు కింది స్థాయి కార్యకర్తలతో గట్టి సంబంధాలు వుండేవి. ప్రజలతో మమేకత వుండేది. సింధియా, పైలట్ లాంటి నేటి యువ నేతలకు ప్రజలతో గానీ, పార్టీ శ్రేణులతో గానీ అటువంటి అనుబంధాలు ఉన్న వారు కాదనే అభిప్రాయం ఒకటి వున్నది. వ్యక్తిగత ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజల ఓట్లను సాధించగల సామర్థ్యం వారికిలేదనే వాదన కూడా వున్నది. కుటుంబ వారసత్వం కారణంగానే ఇరువురూ చిన్నవయస్సులోనే ఉన్నతస్థాయికి వచ్చారు. కేంద్ర మంత్రులయ్యారు. వారి తరంలో ఎవరికీ లభించని అవకాశాలు వారికి దక్కాయి. అయితే వర్తమాన రాజకీయాలకు అవసరమైన విశిష్ట గుణాలు వారికి వున్నాయి. ఇరువురూ యువకులు, విద్యాధికులు. శక్తిమంతులు. దీక్షా దక్షతలు వున్నవారు. చెప్పవలసిన విషయాన్ని సూటిగా, స్పష్టంగా చెప్పగల సమర్థులు. ఒక్కమాటలో చెప్పాలంటే యువ ఓటర్లను ఆకట్టుకునేందుకు అవసరమైన అన్ని అర్హతలూ వారికి వున్నాయి. ఇటువంటి జనాకర్షక యువ నేతలు కాంగ్రెస్ పార్టీకి ఎంతైనా అవసరం. ఎందుకంటే సార్వత్రక, శాసనసభా ఎన్నికలలో ఘన విజయాలు, కీలక వైఫల్యాలతో రాటు దేలిన బీజేపీతో సమర్థంగా పోటీపడేలా పార్టీని సంపూర్ణంగా పునర్నిర్మించడం కాంగ్రెస్ తక్షణ కర్తవ్యం. కాంగ్రెస్ పునర్వైభవానికి ఆవశ్యకమైన నాయకత్వ పటిమ ఉన్న జ్యోతిరాదిత్య సింధియా లాంటి నేతలు ప్రత్యర్థి పార్టీ పంచన చేరవలసి రావడానికి బాధ్యులు ఎవరు? సమాధానం స్పష్టమే. ఇప్పటికైనా జరిగిన తప్పును సరిదిద్దుకోకపోతే యుద్ధం చేయవచ్చే వేళ యోధులు ఎవరైనా కాంగ్రెస్‌లో మిగులుతారా?

**తాజా కలం:** చరిత్ర గతిలో కొన్ని అప్రధాన విషయాలకూ ప్రాధాన్యం లభిస్తుంది. విజయరాజె సింధియా 1967లో భారతీయ జనసంఘ్‌లో చేరే ముందు భారత జాతీయ కాంగ్రెస్‌లో వుండేవారు. జనసంఘ్‌లో చేరి మధ్య ప్రదేశ్‌లో ద్వారకా ప్రసాద్ మిశ్రా నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చి వేసేందుకు తోడ్పడ్డారు. యాభై మూడు సంవత్సరాల అనంతరం ఆమె మనుమడి రూపంలో చరిత్ర తనను తాను పునరావృతం చేసుకొంటోంది!

*(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)*

## సందేహం

ఎవరు నీవు? నీ జన్మ వృత్తాంతమెట్టిది? నీ ముత్తాత ముత్తాత తాత ముత్తాత ముత్తాతలెవరు? ఏ వానరం నుంచి వారు నరావతారం ఎత్తారో! ఉనికి కోసం ఏ మతాన్ని ఎవరు సృష్టించారో! వారికసలు మతం అంటే తెలుసో లేదో నీకు తెలుసా? నీకసలు మానవ సమూహాల సమిష్టి జీవితాల కాలం తెలుసా? సంచార జీవన వేదం తెలుసా? ఏ స్వేద బిందువులు నదీ తీరాల వెంట నాగరికతా పరిమళాలను అద్దాయో.. పుడమికి పురుడు పోసిన తొలి అవ్వ ఎవరో తెలుసుకునే ప్రయత్నం ఎపుడైనా చేశావా?

ఓయీ ఆర్యపుత్రా! చదువుకుంటేనే కదా చరిత్ర తెలిసేది. పురాతన చరిత్ర నీకు తెలియదు. పైపై చదువులూ చదవలేదు. పోనీ నీ తాత తండ్రుల జీవితాల్లోకి తొంగిచూసే ప్రయత్నం ఎప్పుడైనా చేశావా? అమ్మ ఒడిలో పెరగనివాడికి అన్ని కథలు ఎలా తెలుస్తాయిలే. మేము చేసిన తప్పు ఒక్కటే. నీ బర్త్ సర్టిఫికెట్ ఎప్పుడూ అడగలేదు. నువ్వు కూడా మాలో ఒకడివనుకున్నాం. నీ తీయని మాటలు విని మోసపోయాం. ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఇక్కడ స్థిరపడిన బహుళజాతుల సమ్మిళితం ఈ దేశం. నువ్వూ నేనూ అందరం ఈ దేశ పౌరులమే. ఇప్పుడు మా జన్మ వృత్తాంతాలను అడుగుతున్నావు కదా. నీ చరిత్రను మేం ప్రశ్నిస్తున్నాం. నీ బర్త్ సర్టిఫికెట్టే కాదు.. నీ స్ట్రగుల్ సర్టిఫికెట్ కూడా కావాలి. ఈ దేశ స్వాతంత్ర్య పోరాటంలో నీ స్థానమెట్టిది? నీ నేతల రాతలేమిటి? ఆంగ్లేయులను ఈ గడ్డపై నుంచి తరిమేసిన త్యాగధనుల జాబితాలో వారే వరసలో ఉన్నారు? ఇవైనా తెలుసా నీకు? దాచేస్తే దాగని సత్యాలిప్పుడు కావాలి మాకు.

ఈ దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రాణాలను పణమొడ్డిన తొలి ముస్లిం, హిందూ వీరులెవరో మాకు తెలుసు. ఉరికంబానికి ఊయలలూగిన విప్లవ వీరులు తెలుసు. ఆంగ్లేయుల తుపాకీ గుండ్లకు గుండెను చూపిన మన్యం వీరుడూ తెలుసు. ఆజాద్ హింద్ ఫౌజ్ పేరిట దేశభక్త సైన్యాన్ని తయారు చేసిన భారతీయుడు కూడా తెలుసు. ప్రాణాలకు తెగించి ఉద్యమించిన సామాన్యుల వీర చరితమే కాదు. ప్రాణభయంతో వెన్ను చూపిన పిరికిపందల హీన చరిత్రను కూడా పుటలు పుటలుగా చదువుకున్నాం. ఎవరు దేశభక్తులో.. ఎవరు దేశద్రోహులో అమ్మ ఒడి నుంచి వింటూ పెరిగాం.

గాంధీ విగ్రహానికి దండలేసి.. కళ్లద్దాలను స్వచ్ఛ భారత్‌కు బ్రాండ్‌ను చేసినంత మాత్రాన గాంధేయవాది కాలేవు. అయినా గాడ్సేని పూజించే మనసుతో గాంధీని ఎలా స్మరిస్తావ్? ఇన్ని మాటలెందుకుగానీ, ఈ భూమ్మీద కోట్ల మంది ఆర్యులుండగా, హిట్లర్ డీఎన్‌ఏ నీకు మాత్రమే ఎలా సంక్రమించిందన్నది ఇప్పుడు మా సందేహం. నివృత్తి చేయవూ!

– సధ్మ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు 70, జుబిలీ హిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

## రాజ నీతిజ్ఞుడు, సామాజిక వేత్త



హైదరాబాద్ సంస్థాన జాతీయోద్యమానికి, తెలంగాణ ప్రజల విజ్ఞాన వికాసాలకు చిరస్మరణీయమైన కృషి సల్పి నవ్యాంధ్ర నిర్మాతగా గణుతికెక్కిన సౌజన్యమూర్తి బూర్గుల రామకృష్ణారావు. నిష్కళంక దేశభక్తుడు. గొప్ప న్యాయవాది, పాలనాదక్షుడు, కవి, పండితుడు, పరిశోధకుడు. ఉర్దూ, పార్శీ, సంస్కృతం, హిందీ, తెలుగు, కన్నడ, మరాఠీలలో మంచి పాండిత్యం గల బహుభాషాకోవిదుడు. 1899 మార్చి 13 వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తి తాలుకా పడగల్లులో బూర్గుల జన్మించారు. ఇంటిపేరు పుల్లంరాజు. అయితే, స్వగ్రామమైన బూర్గుల నామమే ఈయన ఇంటి పేరయింది. సుప్రసిద్ధ న్యాయవాదిగా పేరుప్రఖ్యాతులు గడించారు. భారత మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు బూర్గుల వద్ద జూనియర్ లాయర్‌గా పనిచేశారు.

డిగ్రీ చదువుకునే రోజుల్లోనే జాతీయభావాలతో ప్రభావితమై 1916లో వామన్ నాయక్ అధ్యక్షతన 'హైదరాబాద్ యంగ్ మెన్స్' సంస్థను స్థాపించి తెలంగాణ ప్రజలలో జాగృతి కలిగించే కార్యక్రమాలు చేపట్టారు. మాడపాటి హనుమంతరావు స్థాపించిన 'ఆంధ్ర కేంద్ర జనసంఘం'లో చేరి గ్రంథాలయాల స్థాపనకు, వయోజన విద్యాకేంద్రాల నిర్వహణకు కృషి చేశారు. 1923లో కాకినాడలో మౌలానా మహ్మద్ ఆలీ అధ్యక్షతన జరిగిన జాతీయ కాంగ్రెస్ మహాసభకు హాజరై, ఉత్తరాది నాయకుల ప్రసంగాలను తెలుగులోకి అనువదించి జాతీయ నాయకుల ప్రశంసలనందుకున్నారు. నిజాం రాష్ట్ర ఆంధ్ర మహాసభ అధ్యక్షునిగా దానిని చైతన్యవంతమైన సంస్థగా రూపొందించారు. 1938 స్టేట్ కాంగ్రెస్ స్థాపనలో కీలకపాత్ర పోషించారు బూర్గుల రామకృష్ణా రావు. 'పీపుల్స్ కన్వెన్షన్'ను ఏర్పాటు చేసి తెలంగాణ ప్రజలకు బాధ్యతాయుతమైన ప్రభుత్వం కావాలని గళం వినిపించారు. గాంధేయవాదిగా క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించారు. స్వాతంత్ర్యానంతరం హైదరాబాద్ సంస్థానంలో చెలరేగిన రజాకార్ల ఉద్యమం నుండి ప్రజలను కాపాడుటకు కొండా వెంకటరంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి తదితరులతో కలిసి గ్రామలు సందర్శించి ప్రజల్లో ధైర్యాన్ని నింపారు. రజాకార్ల దురంతాలను అంతం చేయాల్సిందిగా స్టేట్ కాంగ్రెస్ పక్షాన ఢిల్లీకి వెళ్లి నెహ్రూ, పటేల్‌లను కోరారు.

పోలీసు చర్యల అనంతరం హైదరాబాదు రాష్ట్రంలో ఏర్పడిన తాత్కాలిక మంత్రి వర్గంలో బూర్గుల రెవెన్యూ, ఎక్సైజ్, విద్యాశాఖల మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 1952లో జరిగిన సాధారణ ఎన్నికల్లో షాద్‌నగర్ నియోజకవర్గం నుండి శాసనసభకు ఎన్నికై ముఖ్యమంత్రి అయ్యారు. ముఖ్యమంత్రిగా విశాలాంధ్రోద్యమాన్ని బలపరిచి, చిత్తశుద్ధితో ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావానికి కృషి చేశారు.

సాంఘిక సాంస్కృతిక రంగాల్లోనూ వీరి సేవ ప్రత్యేకమైనది. క్లాసికల్ లాంగ్వేజి కమిషన్ సభ్యులుగా, దక్షిణ భారత హిందీ ప్రచార సభ, సంస్కృత పరిషత్ ఉపాధ్యక్షులుగా భాషా సేవలు అందించారు. ఉమర్ ఖయ్యాం, ఉర్దూ భాషా సారస్వతములు, పండితరాజ పంచామృతం, నవీన వాఙ్మయము, నివేదన (కవితలు), పారశీక వాఙ్మయ చరిత్ర తదితర రచనలు చేశారు. చారిత్రక దృష్టితో రెడ్డి రాజుల కాలపు సంస్కృతులు అను పరిశోధనా వ్యాసాలు రాశారు. వానమామలై, కాళోజీ, దాశరథి, నారాయణ రెడ్డిల ప్రోత్సాహంతో తెలంగాణ రచయితల సంఘం ఏర్పాటు చేశారు. బూర్గుల కేరళ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు గవర్నర్‌గా పనిచేశారు. 1962లో రాజ్యసభ సభ్యుడయ్యారు. 1967 సెప్టెంబర్ 10వ తేదీన కన్నుమూశారు.

■ **డా. తన్నీరు కళ్యాణ్ కుమార్**
తెలుగు లెక్చరర్, ఏపీఆర్‌డీసీ

*(నేడు బూర్గుల రామకృష్ణారావు జయంతి)*

# మోదీ, సోషల్ మీడియా




ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సదా వార్తల్లో ఉంటారు. కొన్నిసార్లు తన ప్రమేయంతో; కొన్నిసార్లు తన ప్రమేయం ఏమీ లేకుండానే. తన ప్రమేయం లేకుండా మోదీ వార్తల్లోకి ఎక్కడం గురించి ఇక్కడ మాట్లాడుకోనక్కర లేదు. ఆయన ప్రత్యక్ష, పరోక్ష ప్రమేయంతో పుట్టే వార్తల గురించీ, తానుగా కావాలని ఇచ్చే వార్తల గురించి మనం తప్పనిసరిగా చర్చించాలి. ఎందుకంటే ప్రధాని ఆలోచనా ధోరణి మనకు వాటి ద్వారా తెలిసే అవకాశం ఉంది. ఏ దేశంలోనయినా అక్కడి ప్రజల భవిష్యత్తును ప్రభుత్వాలే ప్రధానంగా ప్రభావితం చేస్తాయి. ప్రస్తుతం ఇండియాను ఏలుతున్న ప్రభుత్వంలో ప్రధానమంత్రి మోదీ అత్యంత శక్తిమంతుడు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ప్రధానమంత్రిని సమానుల్లో ప్రథముడు (first among the equals) అంటారు. మన ఎన్‌డిఎ ప్రభుత్వంలో ఆ మాటకు విలువ లేదు. కేంద్ర మంత్రిమండలి అంటే ప్రధాని మోదీ ఒక్కరే. ఆ వెనుక కాస్త దూరంలో హోంమంత్రి అమిత్ షా ఉంటారు. మిగతావారంతా పేరుకే మంత్రులు అని ప్రత్యేకంగా చెప్పనక్కర లేదు. ప్రభుత్వాన్ని మోదీ అలా ఒంటి చేత్తో నడిపిస్తున్నారు కాబట్టి ఆయన మదిలో మెదిలే ఆలోచనలు దేశ ప్రజలకు ఎంత ముఖ్యమైనవో మనం అర్థం చేసుకోవచ్చు. ప్రధాని మోదీని ఇటీవల విలక్షణ రీతిలో వార్తల్లోకి ఎక్కించిన అంశం ఏమిటంటే ఆయన సోషల్ మీడియాను వదిలిపెడుతున్నారన్న అంశం. ఆ మాటను స్వయంగా మోదీ ఒక ట్వీట్ ద్వారా ప్రజల్లోకి వదిలారు. ఇంకేముంది బ్రహ్మాండం బద్దలయినంత పని జరిగింది. సోషల్ మీడియాలో ఆయనకున్న ఆదరణ అలాంటిది. ట్విట్టర్‌లో మోదీకి 5.4 కోట్ల మంది ఫాలోయర్లు ఉన్నారు. ఫేస్‌బుక్‌లో 4.4 కోట్ల మంది, ఇన్‌స్టాగ్రామ్‌లో 3.52 కోట్ల మంది మోదీని ఫాలో అవుతున్నారు.

అలాంటి మోదీ సోషల్ మీడియా నుంచి వైదొలగనున్నారన్న వార్త ప్రధాన స్రవంతి మీడియాకు పెద్ద వార్త కాకుండా ఎలా ఉం టుంది! ప్రత్యేకించి ఎలక్ట్రానిక్ మీడియాకు! మోదీ వేసే ప్రతి అడుగులో దేశ శ్రేయస్సునూ, ఆయనపై వచ్చే ప్రతి విమర్శలో దేశద్రోహాన్నీ చూసే న్యూస్ ఛానళ్లు మిన్నూమన్నూ ఏకం చేశాయి. మోదీ మనసుకు ఎంత కష్టం కలిగితే ఈ నిర్ణయం తీసుకున్నారో అంటూ దానికి కారకులను వెదికి శిలువ వేసేందుకు ఒకరోజు ప్రైం టైమ్ మొత్తాన్నీ వెచ్చించాయి.

తీరా చూస్తే మరుసటి రోజు వ్యవహారం తుస్సుమంది. మహిళా దినోత్సవం సందర్భంగా ఆరోజున తన సోషల్ మీడియా ఖాతాలను స్ఫూర్తిదాయకమైన మహిళలకు అప్పగించనున్నట్లు మళ్లీ మోదీనే ట్విట్టర్ ద్వారా ప్రకటించారు. ఈ మొత్తం వ్యవహారంలో మనం తెలుసుకోవాల్సింది ఏమన్నా ఉందా? పైకి ఇది ఆషామాషీగా, పెద్ద ప్రాముఖ్యత లేని విషయంగా కనబడవచ్చు. కానీ ఒకరోజంతా సస్పెన్స్ ఎందుకు నడిచిందన్న ప్రశ్న వేసుకుంటే దీని ప్రాముఖ్యత అర్థం అవుతుంది. మహిళా దినోత్సవం సందర్భంగా తన సోషల్ మీడియా ఖాతాలను మహిళలకు అప్పగించనున్నట్లు మోదీ మొదటి రోజే ప్రకటించవచ్చు. కానీ ఆయన ఆ పని చేయకుండా సోషల్ మీడియాను వదిలిపెట్టాలని అనుకుంటున్నట్లు మొదట ప్రకటించారు. అసలు విషయం తర్వాత చెప్పారు. సోషల్ మీడియాలో అత్యంత శక్తిమంతమైన ప్రపంచ నేతల్లో మోదీ ఒకరు. మరి ఆయన అస్త్ర సన్యాసం చేస్తున్నానంటే గోల కాకుండా ఎలా ఉంటుంది! కాబట్టి మోదీకి కావాల్సింది అదేనని ఎవరైనా భావిస్తే తప్పు పట్టనక్కరలేదు.

భయంకరమైన స్థాయిలో జరిగిన ఢిల్లీ మారణకాండ తదనంతర చర్చనుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు మోదీ ట్వీట్ ఉపయోగపడింది. మోదీ కోరుకున్నది ఇదేనా? నిజానికి ఈ ప్రశ్నకు కచ్చితమైన జవాబు కోసం ప్రయత్నించక్కర లేదు. ఎందుకంటే ఆయన చేసిన పని వల్ల వచ్చిన ఫలితం అదే. ఆయన ఏమి ఆశించారన్న దానితో ఆ ఫలితానికి నిమిత్తం లేదు. ఈ సందర్భంగా సోషల్ మీడియా సహా వివిధ మాధ్యమాల్లో మోదీ చేసిన పనులతో పాటు ఆయన చేయని పనుల ఫలితాల గురించి కూడా ఒక్కసారి ఆలోచించాల్సిన అవసరం ఉంది.

దేశ రాజధాని ఒకపక్క మండుతుంటే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అతిథి మర్యాదలతో బిజీగా ఉన్న ప్రధాని మధ్యలో కాస్త వ్యవధి చూసుకుని ఢిల్లీ వీధుల్లో దాడులను ఖండించలేక పోయారు. దానికి ఆయనకు మూడు రోజులు పట్టింది. అప్పుడు కూడా శాంతి సామరస్యాలు స్థాపించాల్సిందిగా ప్రజలను కోరారు తప్ప 'గోలీ మారో' వంటి విద్వేషపూరిత వ్యాఖ్యలతో అల్లర్లను ప్రేరేపించిన తన పార్టీ నాయకులను పల్లెత్తు మాట అనలేదు. ఆ మాటకొస్తే హిందుత్వవాదాన్ని వ్యతిరేకించే జర్నలిస్టులపై, మేధావులపై సభ్యసమాజం ఊహకు కూడా అందనంత ఘోరంగా ట్విట్టర్‌లో వ్యాఖ్యలు చేసే చాలామందిని మోదీ తాను ప్రధాని కుర్చీలో కూర్చున్న తర్వాత కూడా చాలాకాలం ఫాలో అయ్యారు. ఇప్పటికి కూడా విద్వేషపూరిత ట్రోలింగ్‌కు పాల్పడే చాలామందిని మోదీ ఫాలో అవుతున్నారు. 2014లో మోదీ నాయకత్వంలో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేశ వ్యాప్తంగా హిందుత్వ శక్తులు రెచ్చిపోయాయి. గో సంరక్షణ పేరుతో అమాయక ముస్లింలను చాలామందిని కొట్టి చంపారు. దాద్రిలో అక్లాఖ్‌ను కొట్టి చంపిన ఘటనపై ఇప్పటివరకూ ఒక్కసారంటే ఒక్కసారి కూడా మోదీ ఈ అమానుష హత్యాకాండను ఖండించలేదు. తన సొంత రాష్ట్రం గుజరాత్‌లోని ఉనాలో దళితులపై పైశాచికంగా దాడి జరిగినపుడు కూడా దానిని ఖండించేందుకు ట్విట్టర్‌ను ఉపయోగించుకోవచ్చని మోదీ అనుకోలేదు.

**ఢిల్లీ మారణకాండ తదనంతర చర్చనుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు సోషల్ మీడియాను వదిలి పెడుతున్నానన్న ట్వీట్ ఉపయోగపడింది. మోదీ కోరుకున్నది ఇదేనా? నిజానికి ఈ ప్రశ్నకు కచ్చితమైన జవాబు కోసం ప్రయత్నించక్కర లేదు. ఎందుకంటే ఆయన చేసిన పని వల్ల వచ్చిన ఫలితం అదే. ఆయన ఏమి ఆశించారన్న దానితో ఆ ఫలితానికి నిమిత్తం లేదు. ఈ సందర్భంగా సోషల్ మీడియా సహా వివిధ మాధ్యమాల్లో మోదీ చేసిన పనులతో పాటు ఆయన చేయని పనుల ఫలితాల గురించి కూడా ఒక్కసారి ఆలోచించాల్సిన అవసరం ఉంది.**

దేశానికి తాను ఏది చెప్పాలనుకున్నా మోదీ అందుకు ఉపయోగించుకునేది సోషల్ మీడియానే. ప్రజలతో నేరుగా సంభాషించేందుకు సోషల్ మీడియా ఉపయోగపడుతుందని ఆయన అంటారు. కానీ ఇది వాస్తవం కాదు. ఒక పక్షం కాదనుకున్నపుడు సోషల్ మీడియాలో సంభాషణ ఉండదు. మోదీ చెప్పదలచుకున్నది చెబుతారు. అంతే. ప్రజలు ఆయనను ప్రశ్నించలేరు కాబట్టి వారి తరఫున మీడియా ఆయనను ప్రశ్నించాలి. కానీ మీడియాకు ఇంతవరకూ ఆ అవకాశం లభించలేదు. ప్రధానమంత్రి పదవిని చేపట్టిన నాటి నుంచీ ఇంతవరకూ మోదీ ఒక్కసారంటే ఒక్కసారి కూడా మీడియా సమావేశంలో మాట్లాడలేదు.

ఈ అయిదేళ్ల తొమ్మిది నెలల కాలంలో సామాజికంగా సంభవించిన పరిణామాలను అలా ఉంచితే నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజకీయంగా అనేక వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నది. ప్రజలు వాటి దుష్పరిణామాలను అనుభవించారు. పెద్ద నోట్ల రద్దు, జిఎస్‌టి వంటి చర్యల వల్ల ఆశించిన ఫలితాలు రాకపోగా ఆర్థిక రంగంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం చూపించాయి. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా రద్దు చేశారు. ఏడు నెలలుగా అక్కడ మాజీ ముఖ్యమంత్రులు, ముఖ్యమైన నేతలు నిర్బంధంలో ఉన్నారు. కశ్మీర్ లోయలో తీవ్రమైన నిర్బంధం రాజ్యమేలుతోంది. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పరిణామాలు వేటిపైనా కూడా ప్రధాని మోదీని ప్రశ్నించేందుకు మీడియాకు అవకాశం లేదు. ఆ అవకాశం మీడియాకు నిరాకరించడం ద్వారా మోదీ ఒకవిధంగా జవాబుదారీతనాన్ని నిరాకరిస్తున్నారు.

తనకు చాలా సన్నిహిత మిత్రుడిగా మోదీ చెప్పుకునే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కూడా ట్విట్టర్ ద్వారానే దేశ ప్రజలతో తన ఆలోచనలు పంచుకుంటారు. ఆ మాటకొస్తే ఆయన పెద్ద పెద్ద నిర్ణయాలు కూడా ట్విట్టర్ ద్వారానే వెల్లడిస్తారు. అయితే ట్రంప్ ఇంటా బయటా మీడియాతో ఎడాపెడా మాట్లాడతారు. నిజానికి ప్రజాస్వామ్య దేశాల్లో ప్రభుత్వాధినేతలు మీడియాతో సంభాషించకుండా ఉండడం కుదరదు. తాను మాట్లాడనని భీష్మించే వారు మోదీ తప్ప మనకు ఎవరూ కనబడరు కూడా. తన సన్నిహిత మిత్రుడు ట్రంప్ ఈ విషయంలో మాత్రం మోదీకి ఆదర్శం కాకుండా పోయాడు!

❐ **ఆలపాటి సురేశ్ కుమార్**

సొగసు

# కూల్ కాటన్స్!

**కాటన్ దుస్తులు అనగానే చుడీదార్లు, చీరలే కళ్ల ముందు మెదులుతాయి. కానీ వీటికన్నా వినూత్నంగా కనిపించే గౌన్స్, ఫ్రాక్స్ కూడా ఉంటాయి. అమ్మాయిలు వాటితో కూడా సమ్మర్‌లో కూల్‌గా, స్టయిల్‌గా కనిపించవచ్చు.**




ఎగ్జామ్స్ టిప్స్



# గుర్తుండాలంటే...

చదివింది గుర్తుండాలంటే పదే పదే చదవాలంటారు. కానీ ఆ పద్ధతి అందరికీ నచ్చకపోవచ్చు. ఇలాంటప్పుడు ఏం చేయాలంటే....

**చూడకుండా రాయాలి:** చదివింది మర్చిపోకుండా ఉండాలంటే, చూడకుండా రాయాలి. నేర్చుకున్న పాఠం వల్లెవేయడం కన్నా, చూడకుండా రాసే క్రమంలో మెదడు చదివింది గుర్తు చేసుకునే ప్రయత్నం చేస్తుంది. ఫలితంగా పాఠం ఎక్కువ కాలం పాటు గుర్తుండిపోతుంది.

**నేర్పాలి:** చదివింది ఎంత వరకూ ఒంటబట్టిందో తెలుసుకోవాలంటే, నేర్చుకున్న పాఠాన్ని ఇంకొకరికి నేర్పాలి.

**బొమ్మలు, పేజీ నంబర్లు:** కొన్నిసార్లు పాఠం, ఆ పాఠం ఉన్న పేజీ నంబరు లేదా ఆ పేజీలో ఉన్న బొమ్మతో సహా గుర్తుండిపోతుంది. ఇలాంటప్పుడు పాఠంలోని అంశం గుర్తురాకపోతే అక్కడ ఉన్న బొమ్మ లేదా పేజీ నంబరు స్ఫురణకు తెచ్చుకునే ప్రయత్నం చేయాలి.

**కోడ్:** ఒక దీర్ఘమైన సమాధానాన్ని గుర్తుపెట్టుకోవడం కష్టం. అయితే అదే సమాధానంలోని సబ్ హెడ్డింగుల మొదటి అక్షరాలన్నీ కలిపి ఓ కెడ్ వర్డ్‌గా గుర్తుపెట్టుకుంటే, పరీక్ష హాలులో పూర్తి సమాధానం తొందరగా జ్ఞాపకం వచ్చే వీలుంది.

బ్యూటీ



# కళ్ల కింద నలుపా?

కళ్ల కింద నల్లమచ్చలు, గీతలు, ముడతలు ఏర్పడితే వయసు పెరిగినట్టు కనిపిస్తారు. కళ్ల దగ్గరి చర్మం యవ్వనంగా కనిపించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- తరచుగా కళ్లను రుద్దుకోవడం మానేయాలి. ఎందుకంటే రుద్దడం వల్ల కళ్ల కింద వలయాలు, గీతలు ఏర్పడే అవకాశం ఉంది. అలానే మేకప్ తొలగించేటప్పుడు, కళ్లను శుభ్రం చేసుకునేటప్పుడు జాగ్రత్త వహించాలి.
- ఆహారంలో ఉప్పు తగ్గించాలి. ఆకుకూరలు, అరటిపండు, క్యాబేజీ, బ్రకోలి వంటివి ఎక్కువగా తినాలి. ఇవి కళ్ల కింద వలయాలను నివారిస్తాయి. వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించి, కళ్లు వాయడాన్ని అడ్డుకుంటాయి.
- కళ్లు వాపు ఎక్కకుండా ఉండాలంటే కెఫీన్, చక్కెర, వేగించిన ఆహార పదార్థాలను తగ్గించాలి.

నగ ధగ

పెళ్లిళ్లలో అమ్మాయిలదే సందడంతా అనుకుంటే పొరపాటు. అబ్బాయిలూ వేడుకలకు వన్నె తెస్తారు. కాబట్టే పూర్వంతో పోల్చుకుంటే ఇప్పుడు పెళ్లి వేడుకల్లో అబ్బాయిలు కూడా అలంకరణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అలంకరణలో భాగంగా వీరు ఈ నగలను ఎంచుకోవచ్చు.

**సర్‌పేంచ్:** పులిగోరు, హారాలు, ఉంగరాలు, హారాలతో కలిపి ధరించవచ్చు. తలకు ధరించే పగడీ మీద 'సర్ పేంచ్' అనే నగ తప్పనిసరిగా పెట్టుకోవాలి. ఈ సర్‌పేంచ్ పచ్చలు పొదిగినదై ఉండాలి. మెడలో పచ్చలు లేదా ముత్యాల హారాలు బాగుంటాయి.

**పగడాల నగలు:** పెళ్లికి వెళ్లే 10 నుంచి 13 ఏళ్ల మగపిల్లల అలంకరణ కూడా చూడముచ్చటగా ఉంటోంది. ఈ సమయంలో మగపిల్లలకు ముత్యాలు, పగడాలతో తయారైన నగలు నప్పుతాయి. ధరించే దస్తులకు తగ్గట్టుగా మెడలో లాంగ్ హారాలు, చేతికి కడియాలు బాగుంటాయి. ధరించే షేర్వాణికి తగ్గట్టుగా, ఆ రంగుకు కాంట్రాస్ట్‌గా ఉండే నగలు ధరిస్తే చూడముచ్చటగా ఉంటారు.



# రాజసం మీ సొంతం!



కడియాలు పెళ్లికి హాజరయ్యే అబ్బాయిలు ధరించే నగలు. ఇవి సాదాసీదా బంగారంతో కాకుండా, పచ్చలు పొదిగిన బంగారు నగలైతే బాగుంటాయి. ప్రస్తుతం నడుస్తున్న ట్రెండ్ ఇదే! వీటిని నక్షి, కుందన్, అన్‌కట్, డైమండ్ పెండెంట్స్



● మంజులా రావు
మంజుల జ్యువెల్స్, హైదరాబాద్

వైరల్

# ఇది 'పేపర్ టవల్ ఛాలెంజ్'!






సోషల్ మీడియాలో రోజుకో వింత ట్రెండ్ వెలుగు చూస్తోంది. ప్రస్తుతం 'టిక్‌టాక్'లో చాలామంది 'పేపర్ టవల్ ఛాలెంజ్' విసురుతున్నారు. వీటిలో నిగూఢంగా ఉన్న సందేశాలు నీళ్లు తగలగానే కనిపించి నవ్వు తెప్పిస్తుంటాయి. పేపర్ నాప్కిన్‌ను సగానికి మడత పెట్టి, పై భాగంలో ఒక రకం అర్థం వచ్చేలా, వెనుక వైపు అదే సందేశం మరొక అర్థం వచ్చేలా రాస్తారు. ముందుగా నాప్కిన్ పై భాగంలో ఉండే సందేశం కనిపిస్తుంది. నాప్కిన్‌ను వాష్‌బేసిన్‌లోగానీ, బయటగానీ నీటిలో తడపగానే వెనుక ఉన్న అక్షరాలతో కలిసి నవ్వు పుట్టించే సందేశం ప్రత్యక్షమవుతుంది. ఉదాహరణకు నాప్కిన్ పైన 'విల్ యూ ఎం' అని రాయగానే 'మ్యారీ మీ' అని ఉంటుందేమో అనుకుంటారు. కానీ నీటిలో తడవగానే 'మేక్ మీ ఏ శాండ్‌విచ్' అని కనిపిస్తుంది. ప్రస్తుతం ఈ 'పేపర్ టవల్ ఛాలెంజ్' విపరీతంగా వైరల్ అవుతోంది.

స్ఫూర్తి

**కల్పనా మోండల్... రద్దీగా ఉండే కోల్‌కతా వీధుల్లో బస్సు చక్రాన్ని రయ్‌న తిప్పుతుంది. సన్నగా రివటలా ఉండే 21 ఏళ్ల ఈ అమ్మాయి బస్ డ్రైవర్‌గా అంత భారీ వాహనాన్ని నడపడం చూసి ప్రయాణికులతో పాటు ట్రాఫిక్ పోలీసులూ ఆశ్చర్యపోతారు. మగవాళ్లకే పరిమితమైన ఈ 'ఫీట్'ను ఒక అమ్మాయి ఆత్మవిశ్వాసంతో ప్రదర్శించడం... కోల్‌కతాలో పిన్నవయస్కురాలైన బస్సు డ్రైవర్‌గా గుర్తింపు తెచ్చుకోవడం... ఈ తరానికి స్ఫూర్తిదాయకం.**



# జీవిత 'చక్రం' తిప్పుతోంది!

అందరు టీనేజర్ల మాదిరే కల్పన కూడా సోషల్ మీడియాను ఫాలో అవుతుంది. తన భవిష్యత్తు గురించి చాలా పెద్ద కలలు కంటుంది. ఇంటి వద్ద తన ప్రియనేస్తం 'ఘోంటు' (పెంపుడు కుందేలు)తో సరదాగా ఆడుకుంటుంది. కానీ మిగతా వారిలా ఆడుతూపాడుతూ సాగే జీవితం కాదు ఆమెది. కష్టమైన పరిస్థితుల్ని నవ్వుతూ దాటి వచ్చిన విజేత ఆమె. కోల్‌కతాలోని నోపరా ప్రాంతంలో చిన్న ఇంటిలో కల్పన కుటుంబం నివాసం ఉంటుంది. నలుగురు సంతానంలో తనే చిన్నది. వాళ్ల నాన్న డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఒకరోజు యాక్సిడెంట్ కావడంతో ఆయన రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఎముకలు విరగడంతో రాడ్లు వేశారు. దాంతో ఇల్లు గడవాలంటే ఎవరో ఒకరు పని చేయాల్సిన పరిస్థితి. ఆ క్షణం కల్పన తండ్రి బాధ్యతను తీసుకుంది. కుటుంబానికి ఆసరాగా నిలిచేందుకు చదువు మధ్యలోనే ఆపేసింది. తండ్రి వదిలేసిన స్టీరింగ్ అందుకుంది. రోజూ ఉదయాన్నే నిద్రలేచి ఏడు గంటలకు అమ్మకు వంట, ఇంటి పనిలో సాయం చేసి తర్వాత బస్సు నడిపేందుకు వెళుతుంది.

**తండ్రిని గమనిస్తూ...**

కల్పనకు డ్రైవింగ్ మీద ఆసక్తి పెరగడానికి కారణం వాళ్ల నాన్నే. ఆమె చిన్నతనంలో వాళ్ల నాన్న సుభాష్‌తో కలిసి ట్రిప్పులకు వెళ్లేది. ఆయన డ్రైవింగ్ చేస్తుంటే క్యాబిన్‌లో కూర్చుని ఆసక్తిగా గమనించేది. "ఎనిమిదేళ్ల వయసులోనే పెద్ద వాహనాలు నడపడం నేర్చుకుంది. అయితే మెయిన్ రోడ్ల మీద కాకుండా వీధుల్లోనే నడిపేది. ఒక్కోసారి సరుకు లోడుతో ఉన్న లారీలను గోడౌన్‌కు తరలించేది. చాలారకాలుగా తను నాకు కొడుకులా మారింది. నా ఆశ, నమ్మకం రెండూ తనే" అని గర్వంగా చెబుతారు సుభాష్. "మేము రోజూ రాత్రి పది గంటలకు సరకు తీసుకొని హౌరా వెళతాం. తిరిగి ఇంటికి వచ్చేసరికి బాగా చీకటి అవుతుంది. హౌరా వెళ్లేటప్పుడు నాన్న డ్రైవ్ చేస్తారు. తిరిగి వచ్చేటప్పుడు నేను డ్రైవింగ్ చేస్తా. అయితే అనుకోకుండా ఒకరోజు టైర్ పంక్చర్ అయింది. మా నాన్నేమో కాళ్లు వంచలేరు. అప్పుడు నేను లారీ కిందకు వెళ్లి టైర్ మార్చేశా" అని గుర్తుచేసుకుంటుంది కల్పన. అయితే పూర్తి స్థాయిలో డ్రైవర్ అవ్వాలనే లక్ష్యంతో రోజూ రాత్రిపూట తమ ప్రాంతంలోని వీధుల్లో లారీ నడిపేది. కల్పన నాన్న ఆమె పక్కన కూర్చొని డ్రైవింగ్‌లో మెలకువలు నేర్పేవారు.

> **ఒకరోజు పోలీసులు వచ్చి బస్సు ఆపారు. 'ఒక అమ్మాయి బస్సు నడుపుతోంది. చెక్ చేయండి' అని పై అధికారులు వారిని ఆదేశించారట. ఇప్పుడు వారే నేను బస్సు నడుపుతూ, సిగ్నల్స్ దాటి వెళుతుంటే అభినందిస్తున్నారు. అందరు పోలీసులు ఒకేలా ఉండరు. కొందరు నన్ను డ్రైవింగ్ చేసేందుకు ప్రోత్సహిస్తారు. నా ఫొటోలు తీస్తారు. కొందరేమో నన్ను అనేక ప్రశ్నలు అడుగుతూ అత్యుత్సాహం ప్రదర్శిస్తారు.**

**బస్సు స్టీరింగ్ అందుకుందిలా...**

కల్పనకు పూర్తిస్థాయి బస్సు డ్రైవర్‌గా అవకాశం ఇచ్చేందుకు కొత్తలో బస్సు యజమానులు సందేహించేవారు. కొన్ని రోజులకు ఎప్లనాడే-బారానగర్ మార్గంలో బస్సు నడిపేందుకు ఒక యాజమాని అవకాశం ఇచ్చాడు. డ్రైవింగ్ సీట్లో కూర్చొని ఒడుపుగా బస్సు నడిపి శభాష్ అనిపించుకుంది. కోల్‌కతాలో బస్సు నడపడం అంత సులువు కాదు. ఇరుకుగా ఉండే అక్కడి రోడ్లు, ట్రాఫిక్, జనంతో నిండిపోయే మార్కెట్ వీధుల గుండా డ్రైవ్ చేయడం ఎవరికైనా సవాలే. అయితే కల్పన మాత్రం ఏంతో చాకచక్యంగా బస్సును పరుగెత్తిస్తుంది. "ఒకరోజు పోలీసులు వచ్చి బస్సు ఆపారు. 'ఒక అమ్మాయి బస్సు నడుపుతోంది. చెక్ చేయండి' అని పై అధికారులు వారిని ఆదేశించారట. ఇప్పుడు వారే నేను బస్సు నడుపుతూ, సిగ్నల్స్ దాటి వెళుతుంటే అభినందిస్తున్నారు. అందరు పోలీసులు ఒకేలా ఉండరు. కొందరు నన్ను డ్రైవింగ్ చేసేందుకు ప్రోత్సహిస్తారు. నా ఫొటోలు తీస్తారు. కొందరేమో నన్ను అనేక ప్రశ్నలు అడుగుతూ అత్యుత్సాహం ప్రదర్శిస్తారు"అని తనకు ఎదురైన అనుభవాలు చెబుతోందీ యంగ్ డ్రైవర్.



తన భవిష్యత్తు గురించి ఎవరైనా అడిగితే 'రోజంతా బస్సు నడపడం వల్ల అలసిపోతాను. కెరీర్, అవకాశాలు అంటూ నాకేమీ లేవు. అయితే మధ్యలో వదిలేసిన పదో తరగతి పూర్తిచేయాలనుకుంటున్నా. తరువాత పోలీస్‌శాఖలో డ్రైవర్‌గా ఉద్యోగం తెచ్చుకొని నా తండ్రి కలను నిజం చేయాలనుకుంటున్నా" అంటున్న కల్పన నేటితరం అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలుస్తోంది.

నవజీవన వేదం

# ఆనందం అక్కడే ఉంది!



నిజమైన ఆనందం ఎక్కడ ఉంది? ఈ ప్రశ్నకు సమాధానాన్ని భగవద్గీత 3వ అధ్యాయంలో శ్రీకృష్ణ పరమాత్మ వివరించాడు.

**యస్త్వాత్మరతిరేవ స్యాత్ ఆత్మతృప్తశ్చ మానవః**
**ఆత్మన్యేవ చ సంతుష్టః తస్య కార్యం న విద్యతే!**

"అర్జునా! ఏవో పనులు చేయడంలోనో, ఏదో సాధించడంలోనో, ఎవరి మెప్పో పొందడంలోనో, ఎవరితోనో పోట్లాడటంలో ఆనందం ఉందని అనుకుంటాం. అది చాలా పొరపాటు. బయట ఆనందం అంటూ ఏమీ లేదు. ఆనందం మనసులోనే ఉంటుంది. ఏకాంతంలోనే ఉంటుంది" అన్నాడు శ్రీకృష్ణపరమాత్మ. ఈ విషయం అర్థం చేసుకుంటే ఆనందం కోసం బయటకు వెళ్లే పనేలేదు. మన ఇంట్లోనే కూర్చుని ఆనందంగా ఉంటాం.

●●●

### మహాత్ముల లక్షణం!

కొంతమంది మహానుభావులు ఏకాంతంగా ఉండటానికి ఇష్టపడరు. తమకు తెలిసిన విషయాలను పదిమందికి చెబుతారు. అలా చేయడంలోనే ఆనందం పొందుతారు. రామకృష్ణపరమహంస, స్వామి వివేకానంద, జిడ్డుకృష్ణమూర్తి... ఇలా చెప్పుకుంటూ పోతే చాలా మంది మహానుభావులున్నారు. ఈ విషయాన్ని భర్తృహరి సుభాషితాలను తెలుగులో అందించిన ఏనుగు లక్ష్మణ కవి పద్యం ద్వారా తెలుసుకుందాం.

**హృదయవచశ్శరీరముల నెంతయు పుణ్యసుధాప్రపూర్ణులై/ ముదము బహూపకారముల మూడు జగంబులకు ఘటింపుచున్ / వదలక సాధుసద్గుణులవంబులు కొండలుజేసి మెచ్చుచున్ / మదిని వికాసయుక్తులగు మాన్యులు కొందరు వొల్తు రిద్ధరన్**

మహానుభావుల మనస్సు అమృతం. వచస్సు అమృతం. వాళ్ల శరీరం నిండా అమృతమే. మనస్సు, మాట, చేత.. ఈ మూడింటిలో అమృతమే ఉంటుంది. కల్మషం కనిపించదు. వాళ్లకు ఈ లోకాన్ని బాగు చేయడం, అజ్ఞానాన్ని పోగొట్టడం తప్ప వేరే లక్ష్యం లేదు. వాళ్లకు కీర్తి, డబ్బు అవసరం లేదు. ఒక ప్రవక్త, తత్త్వవేత్త, జ్ఞాని లక్షణం ఏమిటంటే తోటి ప్రవక్తల సద్గుణాలను కొండంతలు చేసి మెచ్చుకుంటారు. అలాంటి వాళ్లు కొందరు ఉంటారు. వాళ్లకు నమస్కారం చేద్దాం!



● డా. గరికిపాటి నరసింహారావు

చింతన

# ఇది... సత్యం!



**ఏ ధర్మం అయినా నిలబడేది సత్యం పైనే!**
**అన్ని ధర్మాలకూ సత్యమే ప్రాతిపదిక.**
**ఏ కాలానికైనా వర్తించేది సత్యం!**
**వేదాలూ, ఉపనిషత్తులూ,**
**పురాణాల సారం ఇదే!**

సనాతన భారతీయ ధర్మం సత్యానికి సమున్నత స్థానం కల్పించింది. మానవ ధర్మాలలో సత్యానికి అగ్రపీఠం వేసింది.

మహాభారతంలో ధర్మరాజును యక్షుడు "సూర్యుణ్ణి నిలిపి ఉంచే ఆధారం ఏది?" అని ప్రశ్నించినప్పుడు "సూర్యుడికి ఆధారం సత్యమే!" అని బదులిస్తాడు (అరణ్య పర్వం, సప్తమాశ్వాసం).

సమస్త సృష్టికీ వెలుగులు అందించే సూర్య భగవానుడు కూడా ప్రవర్తిల్లుతున్నది 'సత్యం' అనే ఆధారంతోనే!

### అదే వేదం... అదే తపస్సు!

భరతుణ్ణి కుమారునిగా స్వీకరించడానికి దుష్యంతుడు తిరస్కరించిన సందర్భంలో సత్యం విశిష్టతను శకుంతల నోట ఆంధ్ర మహాభారతంలోని 'ఆది పర్వం'లో 'నుతజలపూరితంబులగు...' అనే పద్యంలో నన్నయ పలికించాడు.

"నూరు మంచినీటి చేదుడు బావుల కన్నా ఒక దిగుడు బావి మేలు. వంద దిగుడు బావుల కన్నా ఒక మంచి క్రతువు (యజ్ఞం) మేలు. అలాంటి వంద క్రతువుల కన్నా ఒక కుమారుడు మేలు. అలాంటి వందమంది కుమారుల కన్నా ఒక సత్యవాక్యం గొప్పది" అని ఆ పద్యం చెబుతోంది.. ఆ క్రమంలోనే వచ్చే మరో రెండు పద్యాలు : 'వెలయంగ నశ్వమేధంబులు వేయును...', 'సర్వ తీర్థాభిగమనంబు'! "ఒక త్రాసులో ఒక వైపు వెయ్యి అశ్వమేథ యాగాల ఫలాన్నీ, మరోవైపు సత్యాన్నీ ఉంచి తూచితే, సత్యం ఉన్న వైపే ముల్లు మొగ్గు చూపుతుంది. అలాగే తీర్థయాత్రలు, వేదాధ్యయనం చేయడం వల్ల వచ్చే ఫలితాలు కూడా సత్యం ముందు దిగదుడుపే! ధర్మాత్ములైన మునీంద్రులందరూ సర్వధర్మాల కన్నా సత్యమే గొప్పదని స్పష్టంగా చెప్పారు" అని ఆ పద్యాల అని భావం. మహాభారతంలోని నాలుగో ఆశ్వాసం 'సత్యమే వేదం, సత్యమే తపస్సు, ప్రజా సంతతిని సృష్టించేది సత్యమే. ఈ లోకమంతా సత్యం పైనే ఆధారపడి ఉంది. సత్యాన్ని వదలి చేసే జపాలూ, హోమాలూ, పూజాదికాలూ అన్నీ వ్యర్థాలే!' అని స్పష్టం చేస్తోంది.

**సత్యాన్నే పలకాలి. మధురంగా మాట్లాడాలి. సత్యమే అయినా అప్రియమైన వచనం పలుకకూడదు. ప్రియాన్ని కలిగించేదే అయినా అబద్ధం చెప్పకూడదు.**

"సత్యమేవ జయతే నానృతమ్ / సత్యేన పంథా వితతో దేవయానః / యేనాక్రమంతి ఋషయో హి ఆప్తాకామా / యత్ర తత్సత్యస్య పరమం నిధానమ్" అని ముండకోపనిషత్తు చాటి చెప్పింది. మన జాతీయ చిహ్నంలో కూడా ఈ శ్లోకంలోని మొదటి రెండు పదాలు చోటు చేసుకున్నాయి.

"సత్యమే (ధర్మమే) జయిస్తుంది. అసత్యం పాపకారణం. సత్యమార్గం వల్లనే దైవమార్గం అవగతం అవుతుంది. మునీశ్వరులు సత్య ప్రవర్తకులై, మనోరథ సిద్ధిని సాధించి, ముక్తి పొందుతారు" అని దీని అంతరార్థం.

### అన్నిటికీ అదే మూలం

శ్రీమద్రామాయణంలో జాబాలి నాస్తికవాదాన్ని శ్రీరాముడు ఖండిస్తూ సత్యవాదే ఉన్నత స్థితికి చేరుతాడని చెబుతాడు.

"సత్యమే వేశ్వరో లోకే సత్యే ధర్మా శ్రితా సదా / సత్యమూలాని సర్వాణి సత్యాన్నాస్తి పరం పదమ్" (వాల్మీకి రామాయణం, అయోధ్య కాండ). "లోకంలో ధర్మానికి సత్యమే పరాకాష్ఠ. అది స్వర్గ ప్రాప్తి పదం. సత్యమే భగవత్స్వరూపం. అది అన్నిటీ మూలం. సత్యం వల్లనే సంపదలు చేకూరుతాయి" అని దీని అర్థం.

### అప్పుడు అనృతం కాదు!

"సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్ - న బ్రూయాత్ సత్యమప్రియం / ప్రియం చ నానృతం బ్రూయాత్- ఏష ధర్మ స్సనాతనః" అని చెప్పాయి ధర్మశాస్త్రాలు. అంటే సత్యాన్నే పలకాలి. మధురంగా మాట్లాడాలి. సత్యమే అయినా అప్రియమైన వచనం పలుకకూడదు. ప్రియాన్ని కలిగించేదే అయినా అబద్ధం చెప్పకూడదు. అయితే ప్రాణహాని జరిగినప్పుడూ, ఆస్తి, సంపదలు దోపిడీకి గురయ్యే విపత్కర పరిస్థితుల్లో అసత్యం చెప్పవచ్చుననే మినహాయింపు ఉంది. కొంపలు కూల్చేది సత్యమయినా మంచిది కాదు. ప్రాణహితంగా ఉండేదే సత్యం. ప్రాణుల శ్రేయస్సు కోసం పలికే అసత్యం సత్యంతో సమానం అనీ, ప్రాణులకు భయం కలిగించే సత్యం అబద్ధంతో సమానమనీ మహాభారతంలోని శాంతి పర్వం చెబుతోంది. అబద్ధం చెప్పడం పాపమే. అయినా, స్త్రీల విషయంలో, పెళ్ళికి సంబంధించి, నవ్వులాటకు, మరణ సంబంధమైన విషయాల్లో, దోపిడీకి గురయ్యే సందర్భంలో అబద్ధం చెప్పవచ్చునీ, గురువులూ, పెద్దలను రక్షించడానికీ చెప్పే అసత్యం దోషం కాదని వివరించింది.

ఏమైనా, సత్యవాక్కు కలిగి, ధర్మాన్ని ఆచరించడం మానవులందరి కర్తవ్యం కావాలి.

● రాయసం రామారావు

సద్గురువాణి

# చేతులు జోడిద్దాం!

ఆధునిక సమాజంలో కరచాలనం విడదీయలేని ఒక అలవాటు. పలకరింపు, అభినందన... ఇలా ఏ సందర్భమైనా చేతులు కలపడం సర్వసాధారణం. అయితే ఇప్పుడు పరిస్థితి మారుతోంది. అంతుపట్టని వ్యాధుల ముట్టడిలో ఉన్న ప్రపంచం కరచాలనానికి ప్రత్యామ్నాయాలను చూస్తోంది. అయితే భారతీయ సంస్కృతి ప్రకారం వేరొకరితో చేతులు కలపనక్కర్లేదు. చేతులు జోడిస్తే చాలు! అది నమస్కారం. అదే మన సంస్కారం.



చాలామంది నమస్కారాన్ని ఒక సాంస్కృతిక విషయంగా పరిగణిస్తారు. కానీ దాని వెనుక విజ్ఞానం ఉంది. మన అర చేతులను దగ్గరకు చేర్చే ప్రతిసారీ ఒక చిన్న శక్తి విస్ఫోటనం సంభవిస్తుంది. ఇలా చేయడం వల్ల మనలోని జీవశక్తి స్థాయిలో ఒక సమర్పణ జరుగుతుంది. అంటే మనల్ని అవతలి వ్యక్తికి అర్పించుకుంటున్నాం. ఆ సమర్పణతో ఆ ప్రాణిని మనతో సహకరించే జీవిగా చేసుకుంటున్నాం. ప్రతీ జీవీ తన చుట్టూ ఉన్న జీవరాశుల సహకారం ఉంటేనే వృద్ధి చెందుతుంది.

**అసలు ఉద్దేశం ఇదే!**

ఎక్కడైనా ఒక వ్యక్తిని మనం చూసినప్పుడు అతని గురించి ఒక నిర్ణయానికి వచ్చేస్తాం. 'ఈ మనిషిలో ఇది బాగుంది, అది బాగులేదు. అతను మంచివాడు లేదా చెడ్డవాడు. అందంగా ఉన్నాడు లేకుంటే అంద వికారంగా ఉన్నాడు'... ఇలా! ఒక్క క్షణంలోనే ఈ అభిప్రాయాలూ, తీర్మానాలూ జరిగిపోతాయి. అవి పూర్తిగా తప్పు కూడా కావచ్చు. ఎందుకంటే ఈ ఆలోచనలన్నీ మన గతానుభవాల నుంచి వస్తాయి. ప్రస్తుతం ఉన్నదాన్ని ఉన్నట్టుగా గ్రహించడానికి అవి అనుమతించవు.

ఏదైనా రంగంలో మీరు సమర్థంగా పని చేయాలంటే, ఎవరైనా మీ ముందుకు వచ్చినప్పుడు వారు ప్రస్తుతం ఎలా ఉన్నారో అలాగే అవగాహన చేసుకోవాలి. వారు నిన్న ఎలా ఉన్నారన్నది కాదు... ఈ క్షణంలో ఎలా ఉన్నారనేది ప్రధానం. కాబట్టి మొదట మీరు శిరస్సు వంచి నమస్కారం చేయాలి. ఒకసారి అలా చేసినట్టయితే, మీ ఇష్టానిష్టాలు బలపడకుండా మెత్తబడతాయి. వారిలో ఉన్న సృష్టి మూలాన్ని మీరు గుర్తిస్తారు. నమస్కారం చేయడం వెనుక ఉద్దేశం అదే!

**సృష్టికర్త హస్తం**

సృష్టికర్త హస్తం ప్రమేయం లేనిదేదీ ఈ సృష్టిలో లేదు. అందుకే మనం పైకి ఆకాశం వంక చూసినా, కిందికి భూమి వంక చూసినా, శిరస్సు వంచి అభివాదం చేయమని భారతీయ సంస్కృతి చెబుతోంది. స్త్రీని, పురుషుడిని, పిల్లాడిని, ఆవుని లేదా ఓ చెట్టుని... ఇలా దేన్ని చూసినా శిరస్సు వంచి అభివాదం చేయమంటోంది.



**శక్తులన్నీ ఒక్కటిగా...**

నమస్కారానికి మరో కోణం కూడా ఉంది. మన అరచేతుల్లో ఎన్నో నాడుల కొసలు ఉంటాయి. వాస్తవానికి మన నాలుక కన్నా, కంఠం కన్నా మన చేతులే ఎక్కువ మాట్లాడుతాయి. యోగ ముద్రల గురించి పూర్తిగా ఒక శాస్త్రమే ఉంది. మన చేతులను కొన్ని ప్రత్యేకమైన రీతుల్లో అమరిస్తే, మన దైహిక వ్యవస్థను పూర్తి భిన్నంగా పని చేసేలా చేయవచ్చు. మనం చేతులను జోడించిన క్షణమే, మన ద్వైత భావనలు, ఇష్టానిష్టాలు, కోరికలు, మనం ఈసడించుకునే విషయాలు... ఇవన్నీ సమమైపోతాయి, తొలిగిపోతాయి. ఇలా మనల్ని మనం వ్యక్తీకరించుకోవడంలో ఒక రకమైన ఏకత్వం ఉంటుంది. అప్పుడు మనలోని శక్తులన్నీ ఒక్కటిగా పనిచేస్తాయి.

**మీలో సృష్టి మూలం ఉందన్న విషయాన్ని నమస్కారం నిరంతరం గుర్తు చేస్తూ ఉంటుంది. అది గుర్తిస్తే, నమస్కారం చేసిన ప్రతీసారి మీరు మీ సహజ ప్రవృత్తి వైపు అడుగులు వేస్తున్నట్టే!**

● సద్గురు జగ్గీవాసుదేవ్

జ్ఞానారవిందం

# భిన్నత్వంతో మమేకం కావాలి!



**ఇంద్రియాలకు చేతనాశక్తిని... అంటే ఎరుకను కలిగించేది ప్రజ్ఞానం. ఇది సర్వప్రాణికోటిలోనూ ఉంటుంది. ఎప్పుడైతే 'ఈ చేతన నేనే!' అని మానవుడికి తెలుస్తుందో అప్పుడు 'నేను వేరు, ఈ ప్రపంచం వేరు' అనే భావన తొలగిపోతుంది. అప్పుడు బ్రహ్మకూ-ప్రపంచానికీ, ప్రపంచానికీ -వ్యక్తికీ ఉన్న తేడా సమసిపోతుంది.**

నాగరికత తెలియని ఆదిమ మానవుడి కన్నా మనం చాలా తెలివైన వాళ్ళం అని సంబరపడిపోయేవారు మనలో కొందరు ఉంటారు. అది నిజమే. కానీ మన తరువాత, భవిష్యత్తులో వచ్చే నవ నాగరిక, వైజ్ఞానిక మానవుడు మనల్ని గుర్తు చేసుకొని ఏమనుకుంటాడో అని ఆలోచించం. ఆనాటి అడవి మనిషి అజ్ఞాని. కానీ ఈనాటి పట్టణాలలో, మహా నగరాలలో ఉన్న మనిషి జ్ఞాని, విజ్ఞాని. అయినప్పటికీ, అన్ని నాగరికతలకూ గీటురాయిగా ఉండాల్సిన 'మానవత' అనే ప్రమాణంలో మాత్రం అడవి మనిషికన్నా అన్యాయంగా వ్యవహరిస్తున్నాడు. తోటి మానవుణ్ణి నానా విధాలా హింసిస్తున్నాడు. వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాడు. ఆటవిక మానవుడు మనకన్నా అజ్ఞాని కావచ్చు, కానీ మనంతటి అపాయకారి కాదనేది చేదు నిజం. మనం కూర్చున్న కొమ్మను మనమే నరుక్కుంటున్నాం. ప్రపంచంలో ఏ మూల చూసినా తోటి మనిషిని హింసించడం, భాషా వైషమ్యాలు, ప్రాంతీయ దురభిమానాలు, మత దురహంకారాలు, పెత్తనం కోసం వెంపర్లాటలు, అధికారం కోసం అర్రులు చాచడాలు... ఇవన్నీ మనలోని ఆటవికతకు అద్దం పడుతున్నాయి.

దీనికంతటికీ కారణం వేరు భావన. తాను వేరు, తోటి వాడు వేరు, సమాజం వేరు అనుకోవడమే అనర్థమని మన ఋషులు ఏనాడో చెప్పారు. శ్రీ అరవిందుని మాటా అదే! 'ప్రజ్ఞానాం బ్రహ్మ' అన్నాడు ఐతరీయోపనిషత్ ద్రష్ట. అంటే ప్రజ్ఞానమే బ్రహ్మ. ఈ ప్రజ్ఞానాన్నే 'ఎరుక', 'చేతన' అని పిలుస్తున్నాం. నీవు వేరు, నీ చుట్టూ ఉన్న ప్రపంచం వేరు కాదు. అది తెలుసుకోవాలి. అంతవరకూ శాంతి లేదు. మన జ్ఞానం పరిపూర్ణం కాదు. పాక్షికం మాత్రమే. అర్ధ జ్ఞానం, అసంపూర్ణ జ్ఞానం ఎప్పుడూ అపాయకరమే!

వ్యక్తి, విశ్వం, విశ్వాతీత బ్రహ్మం... ఇవన్నీ ఒకే చేతనలోని వివిధ అంతస్థులు, వివిధ రూపాలు, వివిధ ప్రకటనలు. 'చేతన' అంటే ప్రజ్ఞ. ఆటవిక మానవుడి నుంచి ఈ ప్రజ్ఞ బాహ్యంలో వికసించినంతగా అంతరంగంలో వికసించలేదు. ఈ వికాసంలో సమతుల్యత దెబ్బతినడం వల్ల, ప్రకృతి శక్తులను ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలియకపోవడం వల్ల ఈ వాతావరణ కాలుష్యాలు తలెత్తాయి. వీటన్నిటినుంచీ బయటపడాలంటే తనలోని ప్రజ్ఞతో మానవుడు అనుసంధానం కావాలి. అప్పుడు అతని చేతన సకల సృష్టితోనూ అనుసంధానమై అల్లుకుపోతుంది. అతనికి భిన్నత్వంలోని ఏకత్వంతో తాదాత్మ్యత కలుగుతుంది.

● కె. సంపూర్ణ

సందేశం

# పిలిస్తే పలుకుతాడు!



ఆపన్నులను కాపాడేది ఆ దైవమే! ఎవరికి ఏ ఆపద వచ్చినా, సమస్యలు ఏర్పడినా ఆయనకు మొర పెట్టుకుంటే తప్పక ఆలకిస్తాడు. దివ్య ఖుర్ఆన్‌లో ఈ విషయాన్ని అల్లాహ్ స్వయంగా తెలిపాడు:

"ఓ ప్రవక్తా! నా దాసులు నా గురించి నిన్ను అడిగితే నేను వారికి అత్యంత సమీపంలోనే ఉన్నానని చెప్పు. నా దాసుడు నన్ను ఎప్పుడు పిలిచినా అతని పిలుపును నేను ఆలకిస్తాననీ, ఆమోదిస్తాననీ వారికి చెప్పు. కాబట్టి వారు నా ఆదేశాన్ని శిరసా వహించాలి. నన్ను విశ్వసించాలి. తద్వారానే వారు సన్మార్గ భాగ్యం పొందగలుగుతారు. ఈ విషయం వారికి నీవు తెలియజెయ్యి." (దివ్య ఖుర్ఆన్- అల్ బఖర 2:186)

అలాగే "నన్నే ప్రార్థించండి. నేను మీ ప్రార్థనలను ఆమోదిస్తాను. నా దాస్యం పట్ల గర్వం, అహంకారం ప్రదర్శించేవారు త్వరలోనే అవమానితులై నరకంలో ప్రవేశించడం తథ్యం" అని కూడా అల్లాహ్ ప్రకటించాడు. (దివ్య ఖుర్ఆన్- అల్ మూమిన్ 40:60)

"కలత చెందిన వ్యక్తి మొరపెట్టుకున్నప్పుడు అతని మొరను ఆలకించి, అతని వ్యాకులతను దూరం చేసేది ఎవరు? మిమ్మల్ని భూమికి ప్రతినిధులుగా చేసేది ఎవరు?" అని ప్రశ్నిస్తూ అది అల్లాహ్ మాత్రమేనని దివ్య ఖుర్ఆన్ స్పష్టం చేస్తోంది. ఆయనను సంపూర్ణంగా విశ్వసించని వారి ఆరాధన తిరస్కారానికి గురి అవుతుందని హెచ్చరిస్తోంది.

"అల్లాహ్ సిగ్గరి. గొప్ప దాత. ఏ దైసుడైనా అల్లాహ్ సన్నిధిలో చేతులు జోడించి, ఏదైనా కావాలని అర్థిస్తే, అతణ్ణి ఉత్త చేతులతో పంపడానికి అల్లాహ్ సిగ్గు పడతాడు" అని దైవ ప్రవక్త మహమ్మద్ పేర్కొన్నారు. కావలసిందల్లా ఆయన పట్ల అచంచలమైన భక్తి విశ్వాసాలే!

● మహమ్మద్ వహీదుద్దీన్

దైవమార్గం



# దేవుడే కవచం!

సమస్యలూ, ఇబ్బందులూ తరచూ వస్తూనే ఉంటాయి. ఒక విధంగా అవి దైవం మీద విశ్వాసానికి పరీక్షల్లాంటివి. అలాంటి సమయంలోనే విశ్వాసం అచంచలంగా ఉండాలి. "నా మాంసం తినడానికి దుష్టులు నా మీద పడినా, నన్ను బాధించడానికి శత్రువులు వచ్చినా నా హృదయం భయపడదు. నా మీదకు సైన్యం దండెత్తి వచ్చినా నా విశ్వాసం చెక్కుచెదరదు" అంటాడు దావీదు (కీర్తనలు). మనకు వ్యతిరేకులు ఎవరైనా కావచ్చు, మనం ఎలాంటి విపత్కర సందర్భంలోనైనా చిక్కుకుపోయి ఉండవచ్చు. దేవుడి మీద నమ్మకం మాత్రం సడలిపోకూడదు. దైవం ఎప్పుడూ మనకు తోడుగా, నీడగా ఉండి, ఆపత్కాలంలో రక్షిస్తాడన్న ఆలోచన ఉన్న వ్యక్తికి ఎన్నడూ భయం కలుగదు. మన శత్రువు ఎంత శక్తిమంతుడైనా కావచ్చు... దేవుడు మనను కాపాడే కవచంగా నిలుస్తాడని మన స్ఫూర్తిగా నమ్మాలి. దావీదు తన కీర్తనలో ప్రకటించింది అటువంటి విశ్వాసాన్నే!

ధర్మపథం

# మనిషి తల విలువ!



ఒక రోజు అశోకుడు మేడపై నిలబడి రాజవీధి వైపు చూస్తున్నాడు. ఒక యువ భిక్షువు అటుకేసి వస్తూ కనిపించాడు. అతని ముఖ వర్చస్సు అశోకుణ్ణి ముగ్ధుణ్ణి చేసింది.

"ఆ భిక్షువును నా సభా మంటపానికి సాదరంగా తీసుకురండి" అని సేవకులకు చెప్పాడు. ద్వార పాలకుడు ఆ విషయాన్ని సేనాపతికీ, మహా మంత్రికీ చెప్పాడు. వారు గబగబా వీధిలోకి వెళ్ళి, హతాశులయ్యారు.

'ఈ బిడ్డ విషయం ప్రభువులు పసిగట్టారు. నిర్దాక్షిణ్యంగా చంపేస్తారేమో?' అని భయపడ్డారు. చేసేది లేక అతణ్ణి ఆహ్వానించి తీసుకుపోతూ- "భంతే! మమ్మల్ని క్షమించండి! మేం అశక్తులం!" అన్నారు.

"మీరు భయపడకండి. నాకు భయం లేదు" అంటూ ముందుకు నడిచాడు భిక్షువు.

భిక్షువును చూడగానే సింహాసనం నుంచి అశోకుడు లేచి వచ్చి, వినమ్రంగా నమస్కరించి- "తమరు ఎవరు? ఇంత తేజస్సుతో ఉన్నారు!" అని అడిగాడు.

"ఒకప్పుడు నేను అశోక మహారాజు అన్న సుమనుని పుత్రుణ్ణి. ప్రస్తుతం మొగ్గలిపుత్త తిస్స ప్రియ శిష్యుణ్ణి. నిగ్రోధ నామధేయ భిక్షువుని!" అన్నాడతను నిర్భయంగా.

అశోకుని గుండె ఝల్లుమంది. కాళ్ళ కింద నేల కంపించింది. తాను చంపిన తన అన్న కుమారుడే! ఆ ముఖంలో ఎంత శాంతం! ఎంత క్షమ! ఎంత నిర్భీతి!

అశోకుడి కళ్ళు వర్షించాయి. ఆ భిక్షువును ఉచితాసనం మీద కూర్చోబెట్టి, అతని పాదాలు కడిగాడు. శిరస్సు వంచి, నిగ్రోధుడి పాదాలను తాకాడు. ఉచిత రీతిన సత్కరించి పంపాడు.

మంత్రులు ఆశ్చర్యపోయారు. "మహారాజా! శత్రుశేషంగా భావించి ఆ భిక్షువును చంపుతారేమోనని భయపడ్డాం. మీరు అలా చేయలేదు. సంతోషం. కానీ, మీరు చక్రవర్తులు. మీ శిరస్సుకు అభిషేకం జరిగింది. దాన్ని వంచి, చిన్న పిల్లవాడి పాదాలకు తాకించడం తప్పు కాదా?" అని అడిగారు.

వెంటనే అశోకుడు సేవకులను పిలిచి, ఒక పళ్ళెంలో మేక తల, ఒక పళ్ళెంలో గుర్రం తల, ఒక పళ్ళెంలో గొర్రె తల పెట్టి "ఇవి అమ్ముకు రండి" అన్నాడు. వారు వీధిలోకి వెళ్ళి, త్వరగా అమ్ముకొని వచ్చారు. ఆ తరువాత ఒక శవం తల నరికించి, దాన్ని పళ్ళెంలో పెట్టి " పోయి దీన్ని అమ్ముకురండి" అన్నాడు అశోకుడు. వారు సాయంత్రం దాకా తిరిగి తిరిగి వచ్చి "మహారాజా! ఏ ఒక్కరూ కొనలేదు" అన్నారు.

"చూశారా మంత్రీ! ఈ తల స్థానంలో చక్రవర్తి అయిన నా తలను ఉంచితే అమ్ముకురాగలరా?" అని ప్రశ్నించాడు. వారు మౌనం దాల్చారు.

"పశువుల తలలకు విలువ ఉంది. మనిషి తలకు విలువ లేదు. అలాంటి తలను ఒక మహనీయ భిక్షువు పాదాలకు మోడ్చి, నమస్కరిస్తే తప్పేమిటి?" అన్నాడు అశోకుడు.

మంత్రులు, సామంతులు, సేనాధిపతులు, సభికులందరూ లేచి హర్షధ్వానాలు చేశారు.

● బొర్రా గోవర్ధన్

## డైలీ సుడోకు - 306

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 5 | 6 | | 4 | | | | |
| | | 8 | 1 | | | | 2 | |
| 3 | 2 | | | 9 | | | | 6 |
| | | | | | 4 | | | 8 |
| | | 9 | | 7 | | 6 | | |
| 7 | | | 3 | | | | | |
| 9 | | | | 8 | | | 4 | 7 |
| | 6 | | | | 7 | 9 | | |
| | | | | 5 | | 8 | 6 | |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 305 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 4 | 2 | 9 | 3 | 7 | 1 | 6 | 5 | 8 |
| 7 | 3 | 5 | 8 | 9 | 6 | 2 | 4 | 1 |
| 8 | 1 | 6 | 2 | 4 | 5 | 3 | 7 | 9 |
| 6 | 4 | 1 | 7 | 5 | 9 | 8 | 2 | 3 |
| 9 | 8 | 2 | 6 | 3 | 4 | 5 | 1 | 7 |
| 5 | 7 | 3 | 1 | 2 | 8 | 9 | 6 | 4 |
| 1 | 5 | 7 | 9 | 8 | 2 | 4 | 3 | 6 |
| 2 | 6 | 8 | 4 | 1 | 3 | 7 | 9 | 5 |
| 3 | 9 | 4 | 5 | 6 | 7 | 1 | 8 | 2 |


LAKSHMI VENKATESWARA FRAMES
D.V. Cine Creations PROUDLY PRESENTS
నేడే విడుదల
పిజ్జా తరువాత భారీ అంచనాలతో వస్తున్న..
పిజ్జా-II
Never Seen Story
Producer Uday Harsha Vaddella, D.Venkatesh
Director Ranjit Jeyekodi
Sam C.S Dinesh Krishna Bhavan Sreekumar
GUNTUR & KRISHNA- P.Chanbasha(through) GUNTUR- Kamakshi films: 9849448471 KRISHNA- A.B.Enterprises: 9393999937 NELLORE- Sri Hanuman Sai Films: 9849118745 EAST-Mahadeva Naidu Visuals:9391444599 WEST-Usha Pictures: 9246664689 VIZAG- Kiran:9789055799 CEDED- Chittoor:S.K.Picture- 9989830794,9391048646 Kadapa: S.A.Pictures:9676906041 Karnool & Bellary: Sitaare Films: 7794945888 Anantapur: Jagadeswari films: 9440155064 NIZAM- KARNATAKA:MoviemaxxRelease:9030161717 OtherAreaContact:8332964379


ADITYA MUSIC
నేడే విడుదల
యురేక
WRITTEN & DIRECTED BY KARTEEK ANAND
PRODUCED BY PRASANTH TATA CO-PRODUCER LALITHA KUMARI BODDUCHERLA
NO GREAT DISCOVERY WAS EVER MADE WITHOUT A BOLD GUESS


NATTI'S ENTERTAINMENTS
KWITY ENTERTAINMENTS
రేపే విడుదల
A.A. ARTS
అర్జున
PRODUCERS: NATTI KARUNA, NATTI KRANTHI DIRECTOR: KANMANI
VELIGONDA SRINIVAS VANDEMATARAM SRINIVAS GOUTHAM RAJU D.Y. SATYANARAYANA KANAL KANNAN & RAMANA


SS ART
YUGA CREATIONS
MURALIRAMASWAMY Presents
RAHUL BHAI MEDIA & DURGA SREE FILMS
నేడే విడుదల
MURALI RAMASWAMY FILM
ప్రేమ పిపాసి
SEARCHING FOR TRUE LOVE
Producer PS RAMA KRISHNA Associate Producer YUGANDHAR KODAVATI
Co-Producers RAHUL PANDIT, GS RAO, Y.VENKATA LAKSHMY
TRUE LOVER
TRUE FU**ER


GS FILMS
ANIL BODDIREDDY (USA) PRESENTS
MARCH 20TH WORLD WIDE RELEASE
TRAILER OUT
A SRINIVAS BANDARI CINEMA
అసలు ఏం జరిగిందంటే
ASALU EM JARIGINDHANTE
PRODUCED BY GS FILMS
PVR PICTURES RELEASING
9963883444


DREAM TREE
నేడే బ్రహ్మాండమైన విడుదల
302
the true story of real fake
Story - Direction Karthikeya Miriyala
Producer Avinash Sundarapalli Co Producer N Vykunta Rao
Natti's Kwity Entertainment
creativePSYCHO


VIACOM 18 STUDIOS
THRILLING BLOCKBUSTER
3RD WEEK
VIACOM18 STUDIOS PRESENTS IN ASSOCIATION WITH ANTO JOSEPH FILM COMPANY
DULQUER SALMAAN
కనులు కనులను దోచాయంటే
PRODUCED BY VIACOM18 STUDIOS & ANTO JOSEPH FILM COMPANY
WRITTEN AND DIRECTED BY DESINGH PERIYASAMY
KFC ENTERTAINMENTS


THIRD EYE PRODUCTIONS
నేడే విడుదల
MADHA
A FILM BY SRIVIDYA BASAWA
PRODUCED BY INDIRA BASAWA

| బంగారం | వెండి (కిలో) | రూపాయి (ఒక డాలర్‌కు) | ముడి చమురు |
|---|---|---|---|
| 43,374 | 45,340 | 74.28 | 32.68 |
| ముంబై 10 గ్రాములు (99.9 శాతం స్వచ్ఛత) 274 | 665 | (60 పైసలు) | |

**అధికంగా నష్టపోయిన షేర్లు** 12 మార్చి

32,778.14

| పాయింట్లు | బీఎస్ఈ సెన్సెక్స్ | % |
|---|---|---|
| 212.75 | ఎస్‌బీఐ | -13.23% |
| 62.60 | ఓఎన్‌జీసీ | -12.63% |
| 542.85 | యాక్సిస్ బ్యాంక్ | -12.27% |
| 156.25 | ఐటీసీ | -11.07% |
| 1769.85 | టీసీఎస్ | -9.45% |
| 1078.20 | టైటాన్ | -9.31% |
| 2350.00 | బజాజ్ ఆటో | -9.29% |
| 1013.15 | ఎల్ అండ్ టీ | -9.29% |
| 425.00 | ఐసీఐసీఐ బ్యాంక్ | -8.68% |
| 165.85 | పవర్ గ్రిడ్ | -8.62% |

-2919.26

**దలాల్‌స్ట్రీట్‌లో దమనకాండ!**

**మళ్లీ కుప్పకూలిన స్టాక్ సూచీలు**

**10 వేల దిగువకు నిఫ్టీ**

**బేర్ దెబ్బకు బుల్ చిత్తు**

# కరోనార్పణం

## రూ.11,00,000 కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి

### సెన్సెక్స్ 2,919 పాయింట్లు డౌన్

### ఇంట్రాడేలో 3,204 పాయింట్ల క్షీణత

### 868 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ



### సూచీలకిదే ఆల్‌టైం అతిపెద్ద నష్టం



ప్రపంచ మహమ్మారి కరోనా ఈక్విటీ మదుపర్లపైనా కత్తిగట్టింది. స్టాక్ మార్కెట్లపై బేర్ మరింత పట్టుబిగించడంతో ప్రామాణిక సూచీలు చరిత్రలో అతిపెద్ద పతనాన్ని చవిచూశాయి. గురువారం ఇంట్రాడే ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 3,204.30 పాయింట్ల వరకు క్షీణించింది. చివరికి 2,919.26 పాయింట్ల నష్టంతో 32,778.14 వద్ద ముగిసింది. నిఫ్టీ 868.25 పాయింట్లు కోల్పోయి 9,590.15 వద్దకు జారింది. ఈ మధ్య కాలంలో సూచీలు గరిష్ఠ స్థాయి నుంచి 20 శాతం పైగా పడ్డాయి. ఈ ఏడాది జనవరి 14న సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేసుకున్న సూచీలు.. గురువారం ట్రేడింగ్ సెషన్‌లో రెండున్నరేళ్లకు పైగా కనిష్ఠ స్థాయిలో ముగిశాయి. దలాల్‌స్ట్రీట్ దమనకాండలో ప్రధాన కంపెనీల షేర్లతో పాటు చిన్న, మధ్య స్థాయి షేర్లలోనూ అమ్మకాలు పోటెత్తాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 7.84 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 8.72 శాతం క్షీణించాయి. దాంతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ సంపద రూ.11.28 లక్షల కోట్లు హరించుకుపోయి రూ.125,86,398.07 కోట్లకు జారుకుంది.

**ఏడాది కనిష్ఠానికి 1,180 షేర్లు**

బీఎస్ఈలోని 1,180 కంపెనీల షేర్లు 52 వారాల సరికొత్త కనిష్ఠాన్ని నమోదు చేసుకున్నాయి. అందులో రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి దిగ్గజ కంపెనీలూ ఉన్నాయి. హీరో మోటోకార్ప్, గెయిల్, ఏసీసీ, ఏబీబీ, బీఈఎంఎల్, గ్లెన్‌మార్క్ ఫార్మా, జిలెట్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఆటో, బ్యాంక్ ఆఫ్ బరోడా, బీహెచ్‌ఈఎల్, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, అరబిందో ఫార్మా సైతం 52 వారాల కనిష్ఠ స్థాయిని తాకాయి.

మార్కెట్ మహా పతనంలోనూ రుచి సోయా ఇండస్ట్రీస్, అపోలో ఫిన్‌వెస్ట్ సహా 13 కంపెనీలు ఏడాది గరిష్ఠానికి చేరుకోగలిగాయి.

**అన్నీ నేలచూపులే..**

సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీలూ నష్టాల్లోనే పయనించాయి. ఎస్‌బీఐ అత్యధికంగా 13.23 శాతం మార్కెట్ విలువను కోల్పోయింది. ఓఎన్‌జీసీ, యాక్సిస్ బ్యాంక్, ఐటీసీ సైతం రెండంకెల నష్టాన్ని చవిచూశాయి. బీఎస్ఈలోని అన్ని రంగాల సూచీలదీ నేలచూపే. ఆయిల్ అండ్ గ్యాస్ ఇండెక్స్ 9.82 శాతం తగ్గింది. బేసిక్ మెటీరియల్, బ్యాంకింగ్, మెటల్, రియల్టీ ఇండెక్స్‌లు సైతం 9 శాతం పైగా విలువను కోల్పోయాయి.

**ఎయిర్‌లైన్స్ షేర్లు అతలాకుతలం**

కరోనా వైరస్ విజృంభణతో భారత్, అమెరికాతో పాటు పలు దేశాలు ప్రజల ప్రయాణాలపై, ముఖ్యంగా విదేశీ విమానయానాలపై ఆంక్షలు విధించాయి. ముున్ముందు మరిన్ని దేశాలు ఇదే నిర్ణయం తీసుకోవచ్చు. ఈ నేపథ్యంలో ఎయిర్‌లైన్స్ కంపెనీల ఆదాయానికి భారీ గండి పడవచ్చన్న ఆందోళనలతో ఈ రంగ షేర్లు కుప్పకూలాయి. బీఎస్ఈలో ఇండిగో షేరు 11.85 శాతం, స్పైస్‌జెట్ 19.55 శాతం పతనమయ్యాయి. తాత్కాలికంగా మూతపడ్డ జెట్ ఎయిర్‌వేస్ షేర్లు సైతం 4.77 శాతం నష్టపోయాయి.

**బీఎస్ఈ సెన్సెక్స్**

| బుధవారం | |
|---|---|
| ముగింపు | 35,697.40 |
| **గురువారం** | |
| ప్రారంభం | 34,472.50 |
| గరిష్ఠం | 34,472.50 |
| కనిష్ఠం | 32,493.10 |
| ముగింపు | 32,778.14 |

**యెస్ బ్యాంక్ షేరు 13 శాతం డౌన్**

ఆర్థిక సంక్షోభంలోకి జారుకున్న యెస్ బ్యాంక్ షేరు 13 శాతం పైగా పడిపోయింది. దాంతో గడిచిన రెండు సెషన్లలో ఈ షేరు ఆర్జించిన లాభాలన్నీ తుడిచిపెట్టుకుపోయాయి.

**ఆర్ఐఎల్‌కు చమురు సెగ**

అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు భారీగా పతనం కావడంతో రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనవుతున్నాయి. బీఎస్ఈలో ఆర్ఐఎల్ షేరు మరో 7.95% నష్టపోయి రూ.1,061.6కు పడిపోయింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ ఒక్క రోజులో రూ.41,152 కోట్ల మేర తరిగిపోయింది.

**పాపం.. రూపాయి**

రూపాయి మరింత క్షీణించింది. డాలర్‌తో రుపీ మారకం రేటు 60 పైసలు బలహీనపడి రూ.74.28కు చేరింది. మారకం రేటుకు సరికొత్త 17 నెలల కనిష్ఠ స్థాయి ఇది. అంతర్జాతీయంగా డాలర్ మరింత బలపడటంతో పాటు ఈక్విటీ మార్కెట్ల పతనం, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ ఇందుకు కారణమయ్యాయి.

వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కరోనా వైరస్‌ను ప్రపంచ మహమ్మారిగా ప్రకటించడంతో అంతర్జాతీయ మార్కెట్లో హెచ్చరిక ఘంటికలు మోగాయి. దాంతో ప్రపంచవ్యాప్తంగా మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి పెరిగింది.

## ఇవీ కారణాలు..

### ప్రయాణాలపై ఆంక్షలు

కరోనా వ్యాప్తి నియంత్రణ చర్యల్లో భాగంగా యూరప్ నుంచి తమ దేశానికి ప్రజల ప్రయాణాలను 30 రోజులపాటు నిలిపివేస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. ఈ ప్రకటనతో ద్వైపాక్షిక వాణిజ్యానికి అంతరాయం ఉండదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హామీ ఇచ్చినప్పటికీ ఇన్వెస్టర్లలో ఆందోళనలు అధికమయ్యాయి. ప్రయాణాలపై ఆంక్షలు, విదేశీ వాణిజ్యానికి అవరోధాలు, పారిశ్రామికోత్పత్తి నిలిపివేతతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మళ్లీ మాంద్యంలోకి జారుకోవచ్చన్న భయాలు మరింత పెరిగాయి.

### విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ

ప్రపంచవ్యాప్తంగా ఈక్విటీ మార్కెట్లలో ట్రేడింగ్ సెంటిమెంట్ పూర్తి ప్రతికూలంగా మారింది. ఈ నేపథ్యంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) మన మార్కెట్ నుంచి పెట్టుబడులను పెద్ద ఎత్తున ఉపసంహరించుకుంటున్నారు. కేవలం ఈ నెలలోనే వారు రూ.20,831 కోట్లకు పైగా పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు.

### ముడి చమురు 33 డాలర్లు

కరోనా ప్రభావానికి తోడు సౌదీ అరేబియా, రష్యా మధ్య మొదలైన ముడి చమురు ధరల యుద్ధం మార్కెట్లో ప్రతికూలతను మరింత పెంచింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ 33 డాలర్ల స్థాయికి పడిపోవడంతో ఆయిల్ అండ్ గ్యాస్ రంగ షేర్లపై అమ్మకాల ఒత్తిడి అధికమైంది.

### ప్రపంచ మార్కెట్లూ ఫట్

ఆర్థిక మాంద్యం భయాలు అంతకంతకూ పెరుగుతుండటంతో ప్రపంచ దేశాల ఈక్విటీ సూచీలు, ముడి చమురు ధరలు మరో భారీ పతనాన్ని చవిచూశాయి. అమెరికా సూచీలు 5 శాతం వరకు నష్టపోగా.. యూరప్ మార్కెట్ సూచీలైతే 10 శాతంపైగా పడిపోయాయి. ఆసియా దేశాల సూచీలూ 1-4 శాతం పైగా పడిపోయాయి.

### బాండ్ మార్కెట్లో అనిశ్చితి

యెస్ బ్యాంక్ పునర్నిర్మాణంలో భాగంగా ఆ బ్యాంక్ గతంలో జారీ చేసిన అదనపు టైర్ 1 బాండ్లను శాశ్వతంగా, పూర్తిగా రద్దు చేస్తున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. ఈ నిర్ణయం బాండ్ మార్కెట్లో పెట్టుబడులపై ప్రతికూలతతో పాటు అనిశ్చితిని పెంచింది.

### 8,100 స్థాయికి నిఫ్టీ?

మార్కెట్లో ఈ పతనం ఎంతవరకో తెలియక ఇన్వెస్టర్లు దిక్కుతోచకున్నారు. సూచీలు ఇప్పటికే బేర్ జోన్‌లోకి ప్రవేశించాయని, మార్కెట్లో ప్రస్తుతం కొనసాగుతున్న దిద్దుబాటుకు ఇప్పట్లో తెరపడే అవకాశాలు కన్పించడం లేదని ఈక్విటీ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రతికూల ట్రేడింగ్ ట్రెండ్‌లో సూచీలు మరింత పడవచ్చని వారంటున్నారు. ఇప్పటికే 10,000 దిగువకు జారుకున్న నిఫ్టీ.. ముున్ముందు 8,800-8,100 స్థాయికి క్షీణించే అవకాశాల్లేకపోలేవని యెస్ సెక్యూరిటీస్‌కు చెందిన అమర్ అంబానీ అభిప్రాయపడ్డారు. అంటే, సూచీలు మరో 5-15 శాతం మేర క్షీణించవచ్చన్నమాట.

### బిగ్ బుల్‌పై బేర్ పంజా

మార్కెట్ పతనం చిన్న మదుపర్ల దగ్గరి నుంచి బడా ఇన్వెస్టర్ల వరకు అందరినీ కుదిపేసింది. దలాల్‌స్ట్రీట్ బిగ్ బుల్‌గా పేరున్న ప్రముఖ ఇన్వెస్టర్ రాకేశ్ ఝున్‌ఝున్‌వాలాకూ గట్టి దెబ్బే తగిలింది. ఈయనకు రూ.6,500 కోట్ల పెట్టుబడులు కలిగి ఉన్న టైటాన్ షేరు ధర ఏడాది గరిష్ఠ స్థాయి నుంచి 20 శాతం పతనమైంది. ఝున్‌ఝున్‌వాలా పెట్టుబడులు కలిగిన కంపెనీల షేర్లన్నీ ఏడాది గరిష్ఠ స్థాయి నుంచి 20-80 శాతం వరకు పతనమయ్యాయి.



**ఫారం గేటు అమ్మకం ధరలు** (నెక్ 100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 12వ తేదీకి.. | | విజయవాడ | 324 |
| హైదరాబాద్ | 295 | విశాఖపట్నం | 355 |
| 13వ తేదీకి.. | | వరంగల్ | 298 |
| చిత్తూరు | 323 | డజను గుడ్లు రూ. 54 | |
| గోదావరి | 324 | | |

**ఫామ్‌గేట్ ధర** (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 15 | విజయవాడ | 30 |
| వరంగల్ | 15 | గుంటూరు | 30 |
| మహబూబ్‌నగర్ | 15 | ఒంగోలు | 30 |
| కరీంనగర్ | 16 | చిత్తూరు | 30 |
| కర్నూలు | 15 | నెల్లూరు | 30 |
| విశాఖపట్నం | 16 | అనంతపురం | 35 |
| గోదావరి | 16 | | |



**బులియన్**

| బంగారం (10 గ్రాములు) | హైదరాబాద్ | విజయవాడ | విశాఖపట్నం | ప్రొద్దుటూరు | చెన్నై |
|---|---|---|---|---|---|
| 24 క్యారెట్లు | 43,960 | 42,900 | 45,030 | 43,000 | 43,650 |
| క్రితం ముగింపు | 44,310 | 43,300 | 45,240 | 43,200 | 43,720 |
| 22 క్యారెట్లు | 41,910 | 39,800 | 41,420 | 39,810 | 41,570 |
| క్రితం ముగింపు | 42,220 | 40,100 | 41,620 | 40,100 | 41,640 |
| వెండి (కిలో) | 45,400 | 46,800 | 46,660 | 46,500 | 48,900 |
| క్రితం ముగింపు | 46,100 | 47,700 | 47,200 | 47,400 | 49,500 |

## 20 ఏళ్లలో.. 1,880 కొత్త విమానాలు

▸ **భారత్‌పై ఎయిర్‌బస్ అంచనా**



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వచ్చే ఇరవై ఏళ్లలో భారత్‌లో విమాన ప్రయాణికుల రద్దీ ఏడాదికి 7.7 శాతం చొప్పున వృద్ధి చెందగలదని ఎయిర్‌బస్ అంచనా వేస్తోంది. ఇది అంతర్జాతీయ సగటు 4.3 శాతం కన్నా దాదాపు రెట్టింపు. దేశీయ విమాన ప్రయాణికులు సగటున ఏడాదికి 8.2 శాతం మేరకు పెరగనున్నారని.. విదేశాల నుంచి వచ్చి పోయే విమాన ప్రయాణికులు వృద్ధి రేటు ప్రస్తుతం 3-4 శాతం ఉండగా.. 2038 నాటికి ప్రతి ఏడాది 5-7 శాతం మేరకు పెరగొచ్చని ఎయిర్‌బస్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, ప్రెసిడెంట్ ఆనంద్ స్టాన్లీ తెలిపారు. ప్రస్తుతం 54 కోట్లుగా ఉన్న మధ్య తరగతి వర్గం 2038 నాటికి 100 కోట్లకు చేరగలదని 'వింగ్స్ ఇండియా'లో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. 'బలమైన ఆర్థిక వృద్ధి రేటు, మధ్య తరగతి వర్గం విమాన ప్రయాణికుల వృద్ధికి దోహదం చేయనుంది. ప్రస్తుతం మధ్యతరగతిలో 10 శాతం మంది మాత్రమే విమాన ప్రయాణం చేస్తున్నారు. ఇది ఏ మాత్రం పెరిగినా విమానయాన రంగానికి మేలు చేస్తుంది. 2038 నాటికి మొత్తం భారత జనాభాలో మధ్య తరగతి వర్గం 63 శాతానికి చేరగలదని అంచనా. 2018 నుంచి 2038 మధ్య ఇరవై ఏళ్లలో భారత్‌కు 1,880 కొత్త ప్యాసింజర్, కార్గో విమానాలు అవసరమవుతాయని ఎయిర్‌బస్ పేర్కొంది. ఇందులో 20 శాతం వరకూ వైడ్ బాడీ విమానాలు ఉంటాయి. కొత్తగా అవసరమయ్యే విమానాల్లో 440 విమానాలను ఉన్న విమానాలను రీప్లేస్ చేయడానికి కాగా మిగిలిన 1,440 విమానాలు డిమాండ్‌కు అనుగుణంగా సేవలు అందించడానికని స్టాన్లీ వివరించారు.

### హైదరాబాద్‌లో మరిన్ని కార్యకలాపాలు

ఇటీవలే హైదరాబాద్‌లో ఇంజినీరింగ్, పరిశోధన కార్యకలాపాలను ఎయిర్‌బస్ ప్రారంభించింది. ఇక్కడ కంపెనీకి 150 మంది ఇంజనీర్లు ఉన్నారు. హైదరాబాద్ కార్యకలాపాలను భారీగా విస్తరించనున్నామని స్టాన్లీ తెలిపారు. ఇన్ఫోసిస్‌తో కలిసి ఇంజినీరింగ్, డిజైనింగ్, టాటాలతో కలిసి తయారీ కార్యకలాపాలను కంపెనీ నిర్వహిస్తోంది. స్టార్టప్‌లు, హెలీ అంబులెన్స్ వంటి అర్బన్ మొబిలిటీ, తదితర విభాగాల్లో కార్యకలాపాలు చేపట్టడానికి తెలంగాణ ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్లు చెప్పారు.

## విమానయానాన్ని ఆదుకోవాలి

▸ **ప్రభుత్వాన్ని కోరనున్న కంపెనీలు!**

▸ **'వింగ్స్ ఇండియా'కు అరకొర విదేశీయులు**

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): కరోనా వైరస్ చైనాలో కొద్దిగా సద్దుమణిగినా.. అమెరికా, యూరప్ దేశాలను గడగడ లాడిస్తోంది. అన్ని దేశాలు ట్రావెల్ అలర్ట్‌లను జారీ చేస్తున్నాయి. విదేశీ ప్రయాణికులు రాకుండా వీసాల జారీని రద్దు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో విమానయాన రంగం భారీగా నష్టపోతోంది. ఈ ప్రభావం నుంచి దేశీయ విమానయాన కంపెనీలు గట్టెక్కడానికి ప్రభుత్వాన్ని ప్రత్యేక మద్దతు చర్యలు కోరే వీలుంది. హైదరాబాద్‌లో జరుగుతున్న అంతర్జాతీయ విమానయాన ప్రదర్శన 'వింగ్స్ ఇండియా'లో ప్రత్యేక ప్యాకేజీ వంటివి కంపెనీలు కోరడానికి అవకాశం ఉందని విమానయాన మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి ఉషా పాధే అభిప్రాయపడ్డారు. విమానయాన శాఖ కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఖరోలాతో విమానయాన, విమానాశ్రయాల కంపెనీలకు చెందిన ముఖ్య కార్యనిర్వహణ అధికారులు (సీఈఓ) కలవనున్నారని తెలిపారు. కాగా, రెండేళ్ల క్రితం హైదరాబాద్‌లో జరిగిన విమానయాన ప్రదర్శనకు దాదాపు 1500 మంది ప్రతినిధులు వస్తే.. ఈసారి అందులో మూడో వంతు కూడా రాలేదని.. వింగ్స్ ఇండియాలో జరిగే మినిస్టీరియల్ ప్యానల్‌కు ఘనా తదితర దేశాల నుంచి వచ్చే విదేశీ ప్రతినిధులను రావద్దని కోరామని ఉషా చెప్పారు. 20 రాష్ట్రాలకు చెందిన 100 మంది ఎగ్జిబిటర్లు వింగ్స్ ఇండియాలో పాలు పంచుకున్నారు. 6 రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు బీ2బీ సమావేశాల్లో పాల్గొన్నారు.

## మరింత క్షీణత!

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్టాక్ మార్కెట్ మరింత క్షీణించవచ్చని బ్రోకింగ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కరోనా వైరస్ ప్రభావం అమెరికా, యూరప్ దేశాల ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నందున అమెరికా, యూరప్ స్టాక్ మార్కెట్లు మరింతగా క్షీణించగలవని, అందుకు అనుగుణంగా భారత మార్కెట్ కూడా క్షీణించగలదని అభిప్రాయపడుతున్నారు. మార్కెట్ పరిస్థితులను ప్రతిబింబిస్తూ.. గురువారం డోజోన్స్ భారీ నష్టంతో ప్రారంభమైంది. కరోనా ప్రభావం తగ్గితే తప్ప ఏప్రిల్-జూన్ త్రైమాసిక వృద్ధి రేటు అంచనాలపై అమెరికా కొద్దిగా ఆశలు పెట్టుకోవడానికి అవకాశాలు లేవు. అంతర్జాతీయ పరిణామాలను పరిగణనలోకి తీసుకుని దేశీయంగా మదుపర్లు మార్కెట్‌పై విశ్వాసం ఉంచలేకపోతున్నారని.. ఇప్పటికే విశ్వాసాన్ని కోల్పోయారని హైదరాబాద్‌కు చెందిన శ్రీజా బ్రోకింగ్ కంపెనీ ఎండీ శేఖర్ తెలిపారు. నిఫ్టీ 9,000 పాయింట్లకు చేరే అవకాశం ఉందని శేఖర్ తెలిపారు. నిఫ్టీ ఈ స్థాయికి వచ్చిన తర్వాత పీఈ నిష్పత్తి 18-19 శాతానికి చేరుతుందని.. సాధారణంగా స్థాయి వద్ద షేర్ల కొనుగోలుకు మదుపర్లు ఆసక్తి చూపుతారని అన్నారు. అందువల్ల మార్కెట్ మరింత తగ్గి అక్కడ స్థిరపడవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

### హైదరాబాద్‌లో రెవిన్ ఏవియేషన్ డిజైన్ కేంద్రం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పది మంది ప్రయాణించడానికి వీలైన బహుళ ప్రయోజనాల సీ ప్లేన్‌ను రెవిన్ ఏవియేషన్ అభివృద్ధి చేయనుంది. హైదరాబాద్‌లో డిజైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి సీ ప్లేన్‌ను డిజైన్ చేయనున్నట్లు రెవిన్ ఏవియేషన్ సీఈఓ నిరంజన్ మదరి, వ్యవస్థాపక డైరెక్టర్ నిల్స్ పిల్బ్లాడ్ తెలిపారు. 2020 మూడో త్రైమాసికంలో డిజైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఇందులో 25 మంది ఇంజనీర్లు పని చేయనున్నారు. దశల వారీగా 50 మందికి పెంచనున్నామని నిరంజన్ చెప్పారు. డిజైన్ చేసి. ఆమోదం పొందడానికి ఏడాదిపాటు పడుతుందని.. ఆ తర్వాత రెండేళ్లలో ఉత్పత్తి ప్రారంభించగలమని చెప్పారు. భారత్‌లో ఆర్డర్లు అధికంగా లభిస్తే.. ఇక్కడే తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయగలమని తెలుగు రాష్ట్రాలను ఇందుకు పరిశీలించనున్నామని వివరించారు.

***జనవరిలో ఐఐపీ దూకుడు:*** భారత పారిశ్రామిక రంగం మైనింగ్ కార్యకలాపాలు, విద్యుత్ ఉత్పత్తి దన్నుతో జనవరి నెలలో భారీ వృద్ధిని నమోదు చేసింది. పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) గత ఆరు నెలల కాలంలో లేనంత రికార్డు స్థాయిలో 2 శాతం వృద్ధిని నమోదు చేసింది.

***దిగొచ్చిన రిటైల్ ద్రవ్యోల్బణం:*** కూరగాయలు, వంట గదిలో అధికంగా ఉపయోగించే ఇతర దినుసుల ధరలు తగ్గడంతో రిటైల్ ద్రవ్యోల్బణం ఫిబ్రవరిలో 6.58 శాతానికి దిగొచ్చింది. జనవరి నెలలో ఇది 7.59 శాతం ఉంది.

***తగ్గిన కరెంట్ ఖాతా లోటు:*** దేశంలో కరెంట్ ఖాతా లోటు డిసెంబరు త్రైమాసికంలో జీడీపీలో 0.2 శాతం తగ్గింది. అంటే కరెన్సీ విలువలో 140 కోట్ల డాలర్ల మేరకు తగ్గింది. ఆర్‌బీఐ ప్రకటించిన తాజా గణాంకాల ప్రకారం ఏడాది క్రితం ఈ లోటు 2.7% ఉండగా డిసెంబరు త్రైమాసికంలో అది 0.9% ఉంది.

## కీలక స్థాయి 9500 చేరువలో...

**టెక్ వ్యూ**

నిఫ్టీ 300 పాయింట్ల దిగువన భారీ గ్యాప్‌తో ప్రారంభమై రోజంతా డౌన్‌ట్రెండ్ కొనసాగించింది. స్వల్పకాలిక మద్దతు స్థాయి 10000 వద్ద విఫలమైన అనంతరం ఆ స్థాయిని తిరిగి చేరుకోవడానికి ఎలాంటి ప్రయత్నం చేయకపోవడం భారీ అమ్మకాల ఒత్తిడికి సంకేతం. తదుపరి క్రమంలో 9500 వరకు దిగజారి చివరిలో మైనర్ రికవరీ సాధించినా 870 పాయింట్ల భారీ నష్టంతో ముగిసింది. 10000 వద్ద విఫలం కావడం ద్వారా తక్షణ అప్‌ట్రెండ్ ఆశలు కూడా పోగొట్టుకుంది. రానున్న కొద్ది రోజుల్లో స్పష్టమైన దిశ తీసుకునేందుకు ఎక్కడ మద్దతు తీసుకుంటుందో వేచి చూడాలి.

**శుక్రవారం స్థాయిలివే...**

**నిరోధం : 9650 మద్దతు : 9500**

◆ మైనర్ నిరోధం 9650 కన్నా పైన నిలదొక్కుకుంటే మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమించగలుగుతుంది. ప్రధాన నిరోధం 9850. బుధవారం ఇక్కడే మైనర టాప్‌లు ఏర్పడ్డాయి.

◆ ప్రధాన మద్దతు స్థాయి 9500 వద్ద నిఫ్టీ పరీక్ష ఎదుర్కొనవచ్చు. ట్రెండ్‌లో సానుకూలత కోసం ఇక్కడైనా బలమైన కన్సాలిడేషన్ సాధించాలి. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక కరెక్షన్ మరింతగా కొనసాగుతుంది.

■ వి.సుందర్ రాజా

## ప్రారంభ, ముగింపు సెషన్లు మెరుగు

**ఆస్ట్రో వ్యూ**

**తిథి :** ఫాల్గుణ బహుళ పంచమి
**నక్షత్రం :** స్వాతి
**అప్రమత్తం :** ఆశ్లేష, జ్యేష్ఠ, రేవతి నక్షత్ర జాతకులు, వృశ్చిక, మీన రాశుల వారు అప్రమత్తంగా ఉండాలి.

**ట్రెండ్ మార్పు వేళలు : 1.58**

**ధోరణి :** నిఫ్టీ ఫ్యూచర్స్ 10.30 వరకు మెరుగ్గాను, ఆ తర్వాత 1.55 వరకు నిస్తేజంగాను ట్రేడయ్యే ఆస్కారం ఉంది. తదుపరి 3.10 వరకు మరోసారి మెరుగ్గా ట్రేడయి చివరిలో నిస్తేజంగా మారవచ్చు.

**ట్రేడింగ్ వ్యూహం :** నిఫ్టీ ఫ్యూచర్స్ 10.30 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఏటిపి) కన్నా దిగువన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో షార్ట్ పొజిషన్లు తీసుకుని 1.45 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 3.10 సమయానికి ఏటిపి కన్నా పైకి వస్తే లాంగ్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవచ్చు.

**నిరోధం : 9650, 9700, 9750**

**మద్దతు స్థాయిలు : 9540, 9500, 9450**

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంతకన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.

**గమనిక :** ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.

■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinancialastrologer.blogspot.in

# కోరలు సాచిన కరోనా

## 125 దేశాల్లో కల్లోలం.. ఐరోపాతో నెలపాటు కటీఫ్.. కరోనాపై ట్రంప్ ఆకస్మిక ప్రకటన



కరోనా భయంతో కరచాలనానికి స్వస్తి చెప్పి నమస్కరిస్తున్న బ్రిటన్ యువరాజు చార్లెస్. ప్రతి నమస్కారం చేస్తున్న బ్రిటన్ బుల్లితెర నటి ఫ్లాయెలా బెంజిమన్

వాషింగ్టన్, మార్చి 12: కరోనావైరస్ ప్రపంచాన్ని కమ్మేసింది. ఇది ప్రపంచ మహమ్మారి అని ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యక్షుడు ప్రకటించిన వేళకు ఏకంగా 125 దేశాల్లో విలయతాండవం చేస్తోంది. అగ్రరాజ్యం అమెరికా సైతం దాసోహమైంది.వాషింగ్టన్ డీసీ సహా 15 రాష్ట్రాల్లో ఆరోగ్య అత్యవసర స్థితి ప్రకటించారు. పరిస్థితి చేజారడంతో 30 రోజుల పాటు తమ దేశానికి రావొద్దంటూ 26 ఐరోపా సమాజ దేశాలకు అధ్యక్షుడు ట్రంప్ బాంబు పేల్చారు. వైరస్ వ్యాప్తిని అరికట్టడంలో ఈయూ సరిగా స్పందించలేదని ఆయన తప్పుబట్టారు. స్వదేశాలకు వచ్చే అమెరికన్లకు ఈ బ్యాన్ వర్తించదని, వాణిజ్య కార్యకలాపాలు కూడా కొనసాగుతాయని చెప్పారు. ట్రంప్ కూడా కొలరాడో, నెవెడా, విస్కాన్‌సన్‌ల్లో ఎన్నికల సభలను రద్దు చేసుకున్నారు. వైరస్ దెబ్బకు ఘోరంగా పడిపోయిన ఆర్థికవ్యవస్థలను ట్రంప్ నిర్ణయం మరింత గాయపరుస్తుందని, మాంద్యం పెరిగేందుకు అవకాశం ఇస్తుందని, ఆర్థిక విధ్వంసం చోటుచేసుకుంటుందని ఈయూ దేశాలు మండిపడ్డాయి. 'ఇది ప్రపంచ సంక్షోభం. ఈ సమయంలో కావల్సినది అన్ని దేశాల పరస్పర సహకారం. ఏకపక్ష నిర్ణయాలు కాదు' అని యూరోపియన్ కౌన్సిల్, యూరోపియన్ కమిషన్‌ల అధ్యక్షులు విమర్శించారు.

### హాలీవుడ్ సూపర్‌స్టార్‌కు కరోనా

హాలీవుడ్ సూపర్‌స్టార్ టామ్ హాంక్స్, ఆయన భార్య రీటా హాంక్స్‌కు కరోనా సోకింది. విఖ్యాత గాయకుడు ఎల్విస్ ప్రెస్లీపై వార్నర్ బ్రదర్స్ తీసే సినిమాకు సంబంధించిన ప్రీప్రొడక్షన్ పనుల నిమిత్తం ఆయన ఆస్ట్రేలియాలో ఉన్నారు. తమకు నీరసం, చలిజ్వరం, ఒళ్ల నొప్పులు రావడంతో పరీక్ష చేయించుకున్నామని, కరోనా లక్షణాలున్నట్లు ధ్రువపడిందని టామ్ తన ఇన్‌స్టా ద్వారా తెలియజేశారు. ఐక్యరాజ్యసమితి ఈ నెలలో జరపతలపెట్టిన మెరైన్ బయోడైవర్సిటీ, దేశీయ, స్థానికాంశాలు, మహిళా సమస్యలపై తలపెట్టిన సదస్సులను వాయిదా వేసుకుంది. అటు భద్రతా మండలి తన షెడ్యూల్‌ను కుదించుకుంది. డెలిగేట్ల సంఖ్యను భారీగా తగ్గించాలని సభ్య దేశాలను కోరింది. సమావేశాలు విశాలమైన హాళ్లలో ఉండేట్లు చూడాలని నిర్ణయించింది. ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి వార్షిక సమావేశాలను కరోనా కారణంగా రద్దు చేసింది.

### తీవ్ర దశను దాటేశాం: చైనా

చైనా దాదాపుగా తెరిపిన పడ్డట్లే కనిపిస్తోంది. హ్యూబై రాష్ట్రంలో గురువారం కొత్త కేసులు 8 మాత్రమే నమోదయ్యాయి. డిసెంబరులో వైరస్ మొదలయ్యాక సింగిల్ డిజిట్‌లో కేసులు నమోదు కావడం ఇదే ప్రథమం. అయితే వ్యాధి బారిన పడ్డ 4,257 పరిస్థితి విషమంగానే ఉంది. 'వైరస్ అత్యధిక దశను దాటేశాం. ఆటో రంగంలో కీలకమైన వుహాన్‌లో కొన్ని పరిశ్రమలను తెరుస్తున్నాం' అని నేషనల్ హెల్త్ కమిషన్ ప్రతినిధి లీ ఫెంగ్ చెప్పారు. దేశమంతా వైరస్ విస్తరించి, వాణి జ్యం,ఎగుమతులు దెబ్బతినడంతో ఆర్థికసాయం అందించాలని ఐఎంఎఫ్‌ను ఇరాన్ అర్థించిం ది. ఇప్పటికే అమెరికా ఆర్థిక ఆంక్షలతో ఇరాన్ తీవ్ర ఇబ్బందులు పడుతోంది. కాగా, పశ్చిమాసియా, గల్ఫ్ దేశాల్లో కేసుల సంఖ్య గురువారం నాడే 10 వేలకు పైగా నమోదయ్యాయి.

### మోదీకి బ్రిటన్ ప్రధాని ఫోన్

ప్రధాని నరేంద్ర మోదీకి బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ గురువారం రాత్రి ఫోన్ చేసి వైరస్ నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలు, సహకారంపై చర్చించారు. బ్రిటన్ ఆరోగ్యమంత్రి నాడిన్ డోరీస్‌కు వైరస్ సోకడంపై ప్రధాని ఆందోళన వ్యక్తం చేస్తూ ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

### కెనడా ప్రధాని భార్యకు వైరస్

కెనడా ప్రధాని జస్టిస్ ట్రూడో భార్య సోఫీ గ్రెగరీ ట్రూడోకు కరోనా సోకింది. దాంతో తామిద్దరం స్వయంగా ఏకాంతవాసంలో ఉండనున్నట్లు ట్రూడో ప్రకటించారు. ఇంటి నుంచే అధికారిక కార్యకలాపాలు నిర్వర్తించనున్నట్లు తెలిపారు.

### అరుణ గ్రహంపైకి మిషన్ వాయిదా

అంగారకుడిపై పరిశోధనలకు గాను రష్యా-ఐరోపా సమాజం సంయుక్తంగా పంపదలిచిన అంతరిక్ష నౌకను రెండేళ్ల పాటు వాయిదా వేశాయి. మార్స్‌పై జనజీవనానికి అవకాశం ఉందా లేదా అన్నది పరిశోధించడానికి ఓ రోబోను అక్కడ ప్రవేశపెట్టాలన్నది ఈ మిషన్ లక్ష్యం. కరోనా వైరస్‌ని దృష్టిలో పెట్టుకుని, అన్నీఆ లోచించాక- ఈ ప్రయోగాన్ని 2022కు వాయిదావేశామని రష్యా అంతరిక్ష పరిశోధన సంస్థ రాస్‌కాస్మోస్ అధ్యక్షుడు దిమిత్రి రోగోజిన్ చెప్పారు.

### ఎవరెస్ట్ మూసివేత

ఎవరెస్ట్ శిఖరాధిరోహణను చైనా మూసేసింది. ఈ శిఖరానికి నేపాల్ వైపు నుంచి అత్యధికంగా వెళ్తారు. చైనా ఉత్తర ప్రాంతం నుంచీ, టిబెట్ నుంచీ వెళ్లే వీలుంది. ఈ దారుల్లో వెళ్లేందుకు అనుమతులు నిరాకరిస్తున్నట్లు చైనా అధికారులు ప్రకటించారు. బేస్ క్యాంప్‌ల్లో వైరస్ సోకే ప్రమాదం ఉండడం, చలి ప్రదేశాల్లో వైరస్ సోకేవారి పరిస్థితి తొందరగా విషమించే అవకాశం ఉండడం వల్ల అనుమతులు నిలిపేస్తున్నట్లు తెలిపారు. నేపాల్ మాత్రం యథావిధిగా కొనసాగించనుంది.



### కబళిస్తున్న మహమ్మారి

| | |
|---|---|
| ఎన్ని దేశాలకు విస్తరించింది | 125 |
| ప్రపంచవ్యాప్తంగా మొత్తం కేసులు | 1, 30, 237 |
| ఇందులో నయమై డిశ్చార్జి అయిన వారు | 68, 677 |
| చికిత్సలో ఉన్న కేసులు... | 56, 804 |
| ఇందులో క్రిటికల్‌గా ఉన్నవారు | 5, 714 |
| కొత్తగా నమోదైనవి | 1600 |
| మొత్తం మృతుల సంఖ్య | 4, 756 |

### చికిత్సలో ఉన్నవారు, మృతులు దేశాల వారీగా!

| దేశం | కేసులు | మృతులు |
|---|---|---|
| చైనా | 14, 814 | 3169 |
| ఇటలీ | 10,590 | 827 |
| ఇరాన్ | 6687 | 429 |
| దక్షిణ కొరియా | 7470 | 66 |
| ఫ్రాన్స్ | 2221 | 48 |
| స్పెయిన్ | 2968 | 84 |
| అమెరికా | 1283 | 38 |
| జర్మనీ | 1938 | 3 |
| జపాన్ | 509 | 16 |
| బ్రిటన్ | 434 | 8 |
| ఇరాక్ | 48 | 8 |
| నెదర్లాండ్స్ | 496 | 5 |

### దేశంలో తొలి కరోనా మరణం

హైదరాబాద్, బెంగళూరు, న్యూఢిల్లీ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): దేశంలో తొలి కరోనా మరణం నమోదైంది. జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలతో బాధపడుతూ హైదరాబాద్‌లో కన్నుమూసిన కన్నడిగుడు.. కలబుర్గి వాసి మహ్మద్ హుస్సేన్ సిద్దిఖీ(76) నమూనాలు కొవిడ్-19 పాజిటివ్‌గా తేలాయి. ఈ విషయాన్ని కర్ణాటక ఆరోగ్య శాఖ మంత్రి బి.శ్రీరాములు ట్విటర్ ద్వారా ధ్రువీకరించారు. సిద్దిఖీ హైదరాబాద్‌లో రెండు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కర్ణాటక సర్కారు తెలంగాణ ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసింది. దీంతో సిద్దిఖీ చికిత్స పొందిన ఆస్పత్రుల్లో ఆయనకు వైద్యం చేసిన డాక్టర్లు ఎవరు, ఇతర ఆస్పత్రి సిబ్బంది ఎవరు, ఇంకా ఆయనను ఎవరెవరు కలిశారు అనే విషయాలను ఆరా తీస్తోంది.

# రాష్ట్రం హై అలర్ట్

**అంటువ్యాధుల చట్టంతో అధికారులకు పవర్**

న్యూఢిల్లీ/అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఏపీలో తొలి కరోనా పాజిటివ్ కేసు నమోదవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. 13 జిల్లాల కలెక్టర్లు, ఆరోగ్యశాఖ అధికారులను అప్రమత్తం చేశారు. ఇప్పటికే ఇటలీ నుంచి వచ్చిన 75 మంది సెల్‌ఫోన్లను ఆరోగ్యశాఖ ట్రాక్ చేస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకూ 52 మంది శాంపిల్స్ పరిశీలించగా 47 మందికి నెగిటివ్ వచ్చింది. కాగా.. కరోనా నియంత్రణకు అంటువ్యాధుల నిరోధక చట్టాన్ని అమల్లోకి తెచ్చే సన్నాహాలు కూడా చేస్తున్నారు. మరోవైపు దేశంలో కరోనా వైరస్ వేగంగా విస్తరిస్తుండడంతో కేంద్రం ఈ చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. ఇది బ్రిటిష్ కాలం నాటి (1897)నాటి చట్టం. ఇందులో సెక్షన్ 2లో ఉన్న నిబంధనలు అత్యంత కీలకం. వీటి ప్రకారం...

- అంటువ్యాధులు ప్రబలితే ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవచ్చు. ప్రజలపై నియంత్రణలు విధించవచ్చు.
- రైళ్లలో, బస్సుల్లో ప్రయాణిస్తున్న వారిని తనిఖీ చేయొచ్చు. వ్యాధి ఉన్నట్లు ధ్రువపడితే వారిని అప్పటికప్పుడు ఆసుపత్రులకో, ప్రత్యేక నివాస స్థలాలకో తరలించవచ్చు.
- తనిఖీలు చేసే అధికారులకు అనుమానమొచ్చినా వారిని ఆసుపత్రులకో, లేక ఐసోలేషన్‌కో తరలించవచ్చు
- దేశం నుంచి వెళ్లే లేదా వచ్చే నౌకలపై నియంత్రణ విధించవచ్చు. అందులో ప్రయాణించేవారి, సిబ్బందిపై కూడా నియంత్రణలు విధించవచ్చు.
- ఈ సెక్షన్ కింద తీసుకున్న చర్యలను, నియంత్రణలను ఎవ్వరైనా పాటించకపోతే సెక్షన్ 3 కింద వారు నేరానికి పాల్పడినట్లే. ఐపీసీలోని సెక్షన్ 188 కింద వారు శిక్షార్హులు.

### ప్రపంచ మహమ్మారి అంటే..?

కరోనా వైరస్‌ను ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రపంచ మహమ్మారిగా ప్రకటించింది. అసలు దీని అర్థం ఏంటి? ఏ వ్యాధైనా అనేక దేశాల్లో- ప్రపంచవ్యాప్తంగా- ఒక వ్యక్తి నుంచి మరొకరికి ఒకే సమయంలో సోకినపుడు దాన్ని పాండమిక్ అంటారు.

**బయో మెట్రిక్‌కు బ్రేక్:** ప్రపంచాన్ని కరోనా వైరస్ వణికిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో బయోమెట్రిక్ హాజరు విధానాన్ని కొద్ది రోజులపాటు నిలిపి వేస్తున్నట్లు సీఎంవో ఆదేశాలిచ్చింది.

## తేదీల మార్పు.. టికెట్ల రద్దుకు టీటీడీ అవకాశం

తిరుమల, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): కరోనా ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని శ్రీవారి దర్శనం కోసం మే నెల వరకు ముందస్తుగా బుక్ చేసుకున్న రూ.300 టికెట్లను రద్దు చేసుకునేందుకు, తేదీలు మార్పు చేసుకునేందుకు టీటీడీ అవకాశం కల్పిస్తోంది. అలాగే మే నెల వరకు చేసుకున్న ఇతర ఆర్జిత సేవలు, గదుల బుకింగులను రద్దు చేసుకునేందుకు మాత్రమే వీలు కల్పించింది. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్టు టీటీడీ ఒక ప్రకటనలో తెలిపింది. కరోనా వైరస్ వ్యాప్తి చెందకుండా భక్తులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, నిత్యం వేలాది మంది భక్తులు తిరుమలకు వస్తుంటారు కాబట్టి అందరి ఆరోగ్యం కాంక్షించి జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్న వారు దయచేసి అవి తగ్గిన తరువాతే తిరుమలకు రావాలని టీటీడీ మరోసారి విజ్ఞప్తిచేసింది.

### వ్యాక్సిన్ తయారీకి రెండేళ్లు

సాధారణంగా ల్యాబ్‌లో కరోనా వైరస్‌ను వేరు చేయడం కష్టమని.. అలాంటిది పుణెలోని వైరాలజీ ల్యాబ్‌లో మన శాస్త్రజ్ఞులు 11 వైరస్‌లను ఐసోలేట్ చేయగలిగారని కేంద్ర అధికారులు తెలిపారు. అయితే, కరోనాను నిరోధించే టీకాను తయారు చేయడానికి మాత్రం ఏడాదిన్నర నుంచి రెండేళ్లు పడుతుందని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్‌లోని ఎపిడమియాలజీ అండ్ కమ్యూనికబుల్ డిసీజెస్-1 (ఈసీడీ-1) విభాగాధిపతి రమణ్ ఆర్ గంగాఖేడ్కర్ తెలిపారు.

### అమెజాన్, ట్విటర్ ప్రత్యేక చర్యలు

వర్క్ ఫ్రం హోం చేయాల్సిందిగా సామాజిక మాధ్యమ దిగ్గజం ట్విటర్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న తన ఉద్యోగులను కోరింది. అటు డెలివరీ దిగ్గజం అమెజాన్- తన ఉద్యోగులకు పెయిడ్ సిక్‌లీవు మంజూరు చేసి- ఇళ్ల దగ్గరే ఉండిపోవాలని కోరుతోంది.

# ఆ భయమే నిజమైంది

- నెల్లూరు వాసికి కరోనా పాజిటివ్
- నిర్ధారించిన పుణె వైరాలజీ ల్యాబ్
- అప్రమత్తమైన వైద్య అధికారులు
- మరిన్ని పటిష్ఠ చర్యలకు ఏర్పాట్లు
- సినిమా హాళ్ల మూతకు కలెక్టర్ ఆదేశం
- రాష్ట్రంలో మరో 6 అనుమానిత కేసులు

నెల్లూరు, కర్నూలు, విజయవాడ, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): భయపడినట్టుగానే ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా మహమ్మారి ఆంధ్రప్రదేశ్‌నూ తాకింది. రాష్ట్రంలో తొలి కరోనా కేసు నమోదైంది. ఇటీవల ఇటలీ నుంచి వచ్చిన నెల్లూరు వాసికి కరోనా పాజిటివ్ అని పుణె వైరాలజీ ల్యాబ్ నిర్ధారించింది. మొదట తిరుపతి స్విమ్స్‌లో నిర్వహించిన ప్రాథమిక పరీక్షల్లో పాజిటివ్ అని గుర్తించారు. తుది నివేదిక కోసం ఆ శాంపిల్స్‌ను పుణెలోని ల్యాబ్‌కు పంపగా.. ఆ నివేదిక గురువారం అందింది. అందులోనూ పాజిటివ్ అని నిర్ధారణ అయినట్టు కలెక్టర్ ఎంవీ శేషగిరిబాబు ధ్రువీకరించారు. ఈ నేపథ్యంలో నెల్లూరు జిల్లా అంతా హెల్త్ అలెర్ట్ ప్రకటించారు. కలెక్టర్ అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించి పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే జీజీహెచ్‌లో ఐసోలేషన్ వార్డు ఉండగా, అదనంగా జిల్లాలోని మరో మూడు ఆస్పత్రుల్లో కూడా ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేశారు. నెల్లూరులోని సినిమా థియేటర్లు, హోటళ్ల యజమానులతో కలెక్టర్ సమావేశమయ్యారు. కొన్ని రోజుల పాటు థియేటర్లు మూసివేయాలని ఆదేశించారు. షాపింగ్ మాల్స్‌లో కూడా మాస్కులు ధరించేలా చర్యలు తీసుకోవాలని, ఈ మేరకు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కాగా నెల్లూరులో రెండో రోజు కూడా అధికార బృందాలు పర్యటించాయి. ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టడంతోపాటు లిక్విడ్ క్లోరిన్‌ను స్ప్రే చేశారు. మరో 14 మంది కరోనా అనుమానితులకు జీజీహెచ్‌లోని ఐసోలేషన్ వార్డులో పరిశీలనలో ఉంచి చికిత్స అందిస్తున్నారు.

### కర్నూలులో ముగ్గురికి లక్షణాలు

కర్నూలు జిల్లాలో కరోనా అనుమానంతో ముగ్గురు పెద్దాసుపత్రి ఐసోలేషన్ వార్డులో చేరారు. ఈ ముగ్గురూ ఇటీవల విదేశాలకు వెళ్లి వచ్చారని అధికారులు చెబుతున్నారు. నగరానికి చెందిన ఓ మహిళ గత నెల జెరూసలేం యాత్రకు వెళ్లి ఈ నెల 6న తిరిగొచ్చారు. అప్పటి నుంచి ఆమెకు దగ్గు అధికం కావడంతో బంధువులు రెండు రోజుల క్రితం సర్వజన ఆస్పత్రి ఐసోలేషన్ వార్డుకు తీసుకొచ్చారు. ఆమె నుంచి శాంపిల్స్ సేకరించి తిరుపతికి పంపగా.. నెగిటివ్ వచ్చింది. గడివేముల మండలానికి చెందిన మరో మహిళ కొన్ని నెలల క్రితం అమెరికా వెళ్లి ఈ నెల 9న తిరిగొచ్చారు. 15 రోజులుగా తీవ్రమైన జ్వరం, దగ్గుతో బాధపడుతున్న ఆమెను ఐసోలేషన్ వార్డులో చేర్చి చికిత్స అందిస్తున్నారు. కర్నూలు నుంచి వరంగల్‌కు వెళ్లిన ఎన్ఐటీ విద్యార్థికి కరోనా అనుమానిత లక్షణాలు ఉండటంతో అక్కడి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ఆ విద్యార్థి ఈ నెల 1న అమెరికా కాన్ఫరెన్స్‌కు వెళ్లి తిరిగి స్వస్థలమైన కర్నూలుకు వచ్చాడు. ఈ నెల 8న వరంగల్‌కు వెళ్లాడు. అప్పటి నుంచి తీవ్రమైన దగ్గు, జ్వరంతో బాధపడుతున్నాడు. దీంతో అక్కడి ఎంజీహెచ్ హాస్పిటల్‌లో కరోనా అనుమానిత కేసుగా నమోదు చేసి ఐసోలేషన్ వార్డులో ఉంచారు. అలాగే విశాఖపట్నం జిల్లా బుచ్చెయ్యపేట మండలం కొత్తూరుకు చెందిన యువకుడికి కరోనా అనుమానిత లక్షణాలు కనిపించడంతో వైద్యులు విశాఖలోని ఛాతీ, అంటువ్యాధుల ఆస్పత్రికి తరలించారు. రెండేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లిన ఈ యువకుడు ఈనెల 2న స్వగ్రామానికి వచ్చాడు. 9న జ్వరం, దగ్గుతో అస్వస్థతకు గురయ్యాడు. ఎన్ని మందులు వాడినా ప్రయోజనం లేకపోవడంతో స్థానిక పీహెచ్‌సీ వైద్యులు గురువారం ఆ యువకుడితో పాటు అతని సోదరుడిని విశాఖ ఆస్పత్రికి తరలించారు. అలాగే విజయనగరం జిల్లా బొబ్బిలి మండలంలోనూ సింగపూర్ నుంచి వచ్చిన ఓ యువకుడికి కరోనా అనుమానిత లక్షణాలు ఉన్నట్టు గుర్తించి పరీక్షలు నిర్వహించారు. అయితే వ్యాధి నిర్ధారణ కాలేదు.

### విజయవాడలో మరొకరికి..

విజయవాడకు చెందిన ఒక వ్యక్తికి కరోనా వైరస్ సోకినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఇటీవల జర్మనీ వెళ్లిన ఆ యువకుడు ఢిల్లీ, హైదరాబాద్ విమానాశ్రయాల మీదుగా గురువారం రాత్రి 9:30 గంటలకు గన్నవరం చేరుకున్నారు. జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతున్న ఆ వ్యక్తికి నిర్వహించిన స్క్రీనింగ్‌లో కరోనా పాజిటివ్ అని ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో వెంటనే జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో అతన్ని ప్రత్యేక అంబులెన్స్‌లో విజయవాడలోని అతని ఇంటికే తీసుకువెళ్లారు. అతని నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పరిస్థితిని బట్టి అవసరమైతే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తామని కృష్ణా జిల్లా వైద్య శాఖాధికారి టి.ఎస్ఆర్.మూర్తి తెలిపారు.

# కోడికి కరోనా పోటు!



- కొవిడ్-19 దెబ్బకు ధరలు పతనం
- దివాలా దిశగా పౌల్ట్రీ పరిశ్రమలు
- ఫిబ్రవరిలోనే రూ.200 కోట్ల నష్టం

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

మనిషి ప్రాణాలతో చెలగాటమాడుతున్న మాయదారి మహమ్మారి కరోనా.. కోడినీ దెబ్బేసింది. నిన్న మొన్నటి వరకూ కోడి కూరంటే లొట్టలేసుకుని తిన్న మాంసాహార ప్రియులు.. కరోనా వదంతుల దెబ్బకు ఆ పేరు చెబితేనే ఉలిక్కిపడుతున్నారు. దీంతో వ్యాపారం లేక పౌల్ట్రీ పరిశ్రమ కుదేలైంది. ఒక్క ఫిబ్రవరిలోనే బ్రాయిలర్ పరిశ్రమ రూ.200 కోట్ల నష్టాలు చవిచూసిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. లేయర్ పరిశ్రమలు కూడా నష్టాల బాటలోనే పయనిస్తున్నాయి. 20 రోజుల వ్యవధిలో గుడ్డు ధర రూ.4.50 నుంచి రూ.2.50కి పడిపోయింది. ఏపీలోని 13 జిల్లాల్లో ఉన్న కోళ్ల ఫారాల నుంచి నెలకు 2 కోట్ల కోళ్లు ఉత్పత్తి అవుతాయి. సగటున ఒక కోడి 2.5 కేజీల లెక్కన పెరిగినా నెలకు సుమారు 5 కోట్ల కేజీల కోడి మాంసం ఉత్పత్తి అవుతుంది. ఈ ఏడాది జనవరి వరకు లైవ్ (బతికిఉన్న కోడి)చికెన్‌ని ఫారం దగ్గర కేజీ రూ.75కి విక్రయించేవారు. అంటే నెలకు రూ.375 కోట్ల వ్యాపారం నడిచేది. కరోనా నేపథ్యంలో ఫిబ్రవరి నుంచి లైవ్ కోడి ధర అమాంతం తగ్గుతూ వచ్చింది. ఎక్కువ రోజులు రూ.30 నుంచి రూ.40 పలకడంతో ఆ నెలలో బ్రాయిలర్ వ్యాపారులు సుమారు రూ.200 కోట్ల మేర నష్టపోయారు. ప్రస్తుతం లైవ్ కోడి ధర కేజీ రూ.10 మాత్రమే. ఏపీలోనే కాదు కరోనా దెబ్బకు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో సైతం కోళ్ల పరిశ్రమ విలవిల్లాడుతోంది. ముఖ్యంగా బ్రాయిలర్ మార్కెట్ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. లైవ్ చికెన్ కిలో రూ.10కి అమ్ముతున్నా కొనే నాథుడు కనిపించడం లేదు. ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో పౌల్ట్రీ పరిశ్రమ ఎక్కువగా కేంద్రీకృతమై ఉంది. చికెన్ తింటే కరోనా వస్తుందని సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా ప్రచారం కావడంతో జనం దాని ఊసే ఎత్తడం లేదు. దీనికి తోడు వేసవిలో సాధారణంగా వచ్చే రాణికట్ వైరస్‌తో కోళ్లు చనిపోతుండడం కూడా పరిశ్రమకు శాపంగా మారింది. కానీ కరోనా వల్లే ఈ కోళ్లు చనిపోయాయనే ప్రచారం ఎక్కువైంది. ఈ పరిణామాలన్నీ చికెన్ విక్రయాలపై భారీగా ప్రభావం చూపుతున్నాయి. చికెన్ వ్యాపారం పూర్తిగా పడేకయడంతో బ్రాయిలర్లను కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. ప్రస్తుతం పేపర్ ధర కిలో రూ.40 ఉండగా వ్యాపారులు రూ.10కు అడుగుతున్నారని ఫారాల యజమానులు వాపోతున్నారు. సాధారణంగా 45 రోజుల్లో రెండు రెండున్నర కేజీలు బరువు రాగానే కోళ్లను అమ్ముతుంటారు. కానీ కరోనా ప్రభావంతో నెల రోజులుగా కోళ్ల విక్రయాలు తగ్గిపోవడంతో ఫారాల్లో ఒక్కో కోడి మూడు.. మూడున్నర కేజీల బరువు పెరిగాయి. ఈ పరిస్థితుల్లో కోడిని ఏదోలా వదిలించుకోకపోతే రోజువారీ మేత ఖర్చు తడిసిమోపెడవుతుందని ఫారాల యజమానులు చెబుతున్నారు. కిలో కోడి తయారు కావడానికి సుమారు రూ.70 వరకు ఖర్చవుతుంది. ఒక్కో గుడ్డు ఉత్పత్తికి రూ.4 వరకు ఖర్చవుతుంది. ధరల పతనంతో కిలో కోడిపై రూ.60 వరకు నష్టపోవాల్సి వస్తోంది. దాణా ఖర్చు తట్టుకోలేక ఏపీ, తెలంగాణ సరిహద్దులోని సూర్యాపేట జిల్లా మేళ్ల చెరువులో రెండు రోజుల క్రితం 3వేల కోళ్లను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు.

### గుడ్డుకీ గడ్డుకాలం..

రాష్ట్రవ్యాప్తంగా గుడ్లు పెట్టే కోళ్లు 5 కోట్ల ఉంటాయి. ఇవి సగటున రోజుకి 4 కోట్ల గుడ్లను ఉత్పత్తి చేస్తుంటాయి. వీటిలో 35 శాతమే రాష్ట్రంలో వినియోగిస్తున్నారు. మిగిలిన వాటిని ఒడిసా, బిహార్, బెంగాల్, అసోం రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. కరోనా వల్ల చాలావరకు ఎగుమతులు తగ్గిపోయాయి. గుడ్డు ధర కూడా స్థానికంగా రూ.4.50 నుంచి రూ.2.50కి పడిపోయింది.

### ప్రభుత్వాలు ఆదుకోకుంటే కష్టమే

పౌల్ట్రీ పరిశ్రమ గడ్డు కాలాన్ని ఎదుర్కొంటోంది. బర్డ్ ఫ్లూ వచ్చినపుడు ఎలాంటి పరిస్థితి ఉందో ఇప్పుడంతకన్నా ఘోరంగా ఉంది. కేవలం అపోహల వల్లే పరిశ్రమ దారుణంగా దెబ్బతింది. బర్డ్‌ఫ్లూ సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పావలా వడ్డీకి రుణాలు ఇప్పించాయి. ఇప్పుడు కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆదుకోకపోతే పౌల్ట్రీ రంగం నామరూపాల్లేకుండా పోతుంది.

**- సుబ్బారెడ్డి, ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ**

# సీఎం అభ్యర్థిని కాను

- సూపర్‌స్టార్ రజనీకాంత్ సంచలన ప్రకటన



చెన్నై, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): తనకు ముఖ్యమంత్రి పదవిపై ఎప్పుడూ ఆశ లేదని, ఒక నాయకుడిగానే ప్రజల్లో ఉంటానని సూపర్‌స్టార్ రజనీకాంత్ సంచలన ప్రకటన చేశారు. రాజకీయ వ్యవస్థను సరిచేయాలన్నదే తన లక్ష్యమని పేర్కొంటూ.. అందుకు మూడు సూత్రాలు ప్రతిపాదించి, ఆ దిశగా వ్యవస్థలో మార్పు వచ్చాక రాజకీయాల్లోకి వస్తానని గురువారం చెన్నైలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన ప్రకటనతో అభిమానుల్లో తీవ్ర నిరాశ అలముకుంది. 1996 నుంచి రాజకీయాల్లోకి వస్తానని చెబుతూ వెనుకంజ వేస్తూనే ఉన్నారంటూ తనపై వచ్చిన విమర్శలకూ ఆయన బదులిచ్చారు. 2017, డిసెంబరు 31న మాత్రమే తాను రాజకీయాల్లోకి వస్తానని ప్రకటించానని, అంతకుముందు ఎప్పుడూ చెప్పలేదని, రాజకీయాల్లోకి వస్తారా అని అడిగితే 'దేవుడు శాసిస్తే వస్తాన'ని చెప్పానంతేనని స్పష్టం చేశారు. 1996లో ఊహించని విధంగా రాజకీయాల్లో తన పేరు వినిపించిందని, అంతేగానీ తనకు ఎప్పుడూ సీఎం పదవిపై ఆశ లేదన్నారు.

# వ్యక్తిగతంగా హాజరవ్వండి

**22 మంది రెబెల్ ఎమ్మెల్యేలకు మధ్యప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ నోటీసులు**



సింధియాను సన్మానిస్తున్న చౌహాన్

భోపాల్,మార్చి 12: రాజీనామా చేసిన 22 మంది ఎమ్మెల్యేలు తన ఎదుట వ్యక్తిగతంగా హాజరవ్వాలని మధ్యప్రదేశ్ శాసనసభ స్పీకర్ ఎన్.పి.ప్రజాపతి స్పష్టం చేశారు. స్వచ్ఛందంగా రాజీనామా చేశారా లేక ఒత్తిళ్ల వల్ల చేశారా అన్న విషయంపై శుక్రవారం తన ఎదుట స్పష్టత ఇవ్వాలంటూ గురువారం వారికి నోటీసులు జారీచేసినట్లు అధికారులు చెప్పారు. మరోవైపు 16న అసెంబ్లీలో బలపరీక్ష నిర్వహించాలని కోరనున్నట్లు బీజేపీ వెల్లడించింది. ప్రభుత్వం మైనారిటీలో పడినందున బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా 16న సభలో బలపరీక్ష నిర్వహించాలని గవర్నర్‌ను, శాసనసభ స్పీకర్‌ను కోరనున్నట్లు బీజేపీ చీఫ్ విప్ నరోత్తమ్ మిశ్రా తెలిపారు. కమల్‌నాథ్ సర్కారు మెజారిటీ కోల్పోయిందని మాజీ సీఎం శివరాజ్‌సింగ్ చౌహాన్ పేర్కొన్నారు. స్పీకర్ ప్రజాపతి ఇప్పటికే 22 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేశారని కాంగ్రెస్ నేత దిగ్విజయ్ సింగ్ అన్నారు. విశ్వాస పరీక్షకు ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నారని, అంతకుముందే ఎమ్మెల్యేల రాజీనామాలపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. జ్యోతిరాదిత్య సింధియా తన రాజకీయ భవిష్యత్తు గురించి ఆందోళన చెందడం వల్లే సిద్ధాంతాలను మరిచిపోయారని రాహుల్‌గాంధీ చెప్పారు. గురువారం రాహుల్ పార్లమెంటు వెలుపల విలేకరులతో మాట్లాడుతూ.. సింధియాకు బీజేపీలో గౌరవం దక్కదని, అక్కడ సంతృప్తిగా ఉండలేరని చెప్పారు. బెంగళూరు రిసార్టులో ఉన్న ఎమ్మెల్యేలను కలిసేందుకు వెళ్లిన మధ్యప్రదేశ్ మంత్రులను కర్ణాటక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మంత్రులిద్దరూ కేపీసీసీ అధ్యక్షుడు డి.కె.శివకుమార్‌తో భేటీ అయ్యారు.

### బీజేపీ సంకల్పం దృఢమవుతుంది: షా

జ్యోతిరాదిత్య సింధియా గురువారం ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లను కలిశారు. "సింధియా చేరికతో మధ్యప్రదేశ్ ప్రజలకు సేవ చేయాలన్న బీజేపీ సంకల్పం మరింత బలోపేతమవుతుందన్న నమ్మకం నాకుంది" అని షా ట్వీట్ చేశారు. గురువారం కేంద్ర మంత్రి తోమర్‌తో కలిసి ప్రత్యేక విమానంలో భోపాల్ చేరుకున్న సింధియాకు బీజేపీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

# ఏ పత్రాలూ ఇవ్వక్కర్లేదు

**ఎన్‌పీఆర్‌పై రాజ్యసభలో అమిత్ షా**

న్యూఢిల్లీ, మార్చి 12: జాతీయ జనాభా పట్టిక (ఎన్‌పీఆర్) కోసం ఎటువంటి డాక్యుమెంట్లు ఇవ్వాల్సిన అవసరం లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా తెలిపారు. ఎవర్నీ అనుమానితులు(డౌట్‌ఫుల్ -'డి')గా ప్రకటించబోమని స్పష్టం చేశారు. ఢిల్లీ అల్లర్లపై గురువారం రాజ్యసభలో స్వల్పకాలిక చర్చకు ఆయన సమాధానం ఇచ్చారు. "ఎన్‌పీఆర్ కోసం ఏ పత్రాలూ ఇవ్వాల్సిన అవసరం లేదు. ప్రజలు వారి దగ్గర ఏ సమాచారం ఉంటే అది ఇస్తేచాలు. మిగతా ప్రశ్నలను ఖాళీగా వదిలేయొచ్చు" అని వివరించారు. 'డి'ని తొలగిస్తారా అన్న కాంగ్రెస్ సభ్యులు ప్రశ్నించగా అమిత్ షా బదులిచ్చారు. "ఎన్‌పీఆర్ గురించి ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. ఎన్‌పీఆర్‌ను తాజాపరిచే ప్రక్రియలో ఎవర్నీ అనుమానితులుగా మార్కు చేయబోము" అని తెలిపారు. ఎన్‌పీఆర్ ప్రక్రియను చేపట్టేది లేదని ఇప్పటికే పలు రాష్ట్రాలు ప్రకటించిన తెలిసిందే. ఎన్‌పీఆర్‌లో ప్రశ్నలకు ప్రజలు సమాధానాలు ఇవ్వకపోతే ఆ ఇళ్లకు 'డి' ముద్ర వేస్తారన్న భయాలూ ఉన్నాయి. ఢిల్లీలో హింస, అల్లర్ల బాధ్యులను కులం, మతం, రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా శిక్షిస్తామన్నారు. విధ్వంసానికి పాల్పడిన 1,922 మందిని ఫేషియల్ ఐడెంటిఫికేషన్ సాఫ్ట్‌వేర్ ద్వారా గుర్తించామన్నారు. వారి నుంచి నష్ట పరిహారం రాబడతామన్నారు.

# ప్రైవేటు బ్యాంకుల్లో సొమ్ము భద్రం

- డిపాజిట్లు ఉపసంహరించొద్దు: ఆర్బీఐ

న్యూఢిల్లీ, మార్చి 12: ప్రైవేటు బ్యాంకుల నుంచి డిపాజిట్లను ఉపసంహరించవద్దని ఆర్బీఐ(భారతీయ రిజర్వు బ్యాంక్) రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. అలాంటి చర్యలు బ్యాంకింగ్, ఆర్థిక రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొంది. అలాంటి నిర్ణయాలపై వెంటనే పునరాలోచన చేయాలని కోరింది. ప్రైవేటు బ్యాంకుల్లో డిపాజిట్ల భద్రతపై ఆందోళనలు పూర్తిగా అసంబద్ధమంటూ అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శు(సీఎస్)లకు లేఖలు రాసింది. యస్ బ్యాంక్ సంక్షోభం నేపథ్యంలో ఆ బ్యాంకు బోర్డును రద్దు చేసిన ఆర్బీఐ.. నగదు ఉపసంహరణ(విత్‌డ్రా)పై పరిమితులు విధించిన విషయం తెలిసిందే. ఆ పరిణామం అనంతరం ప్రైవేటు బ్యాంకుల్లోని డిపాజిట్లను ప్రభుత్వరంగ బ్యాంకుల్లోకి మళ్లించాలంటూ కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తమ పరిధిలోని సంస్థలకు సూచించినట్టు వార్తలు వచ్చిన నేపథ్యంలో ఆర్బీఐ ఈ లేఖలు రాసింది.



జగన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న బలరాం, వెంకటేశ్‌కు కండువా కప్పుతున్న సీఎం

## అధికారికంగా వైసీపీలో చేరని బలరాం

**▸ అనర్హత వేటు తప్పించుకొనే యత్నం!**

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): చీరాల టీడీపీ ఎమ్మెల్యే కరణం బలరాం గురువారం ఇక్కడ వైసీపీలో చేరినా ఆ చేరికకు అధికారిక ముద్ర పడకుండా జాగ్రత్త పడ్డారు. తన కుమారుడు వెంకటేశ్, మరి కొందరు అనుచరులతో తాడేపల్లిలోని సీఎం జగన్మోహన్‌రెడ్డి నివాసానికి వచ్చిన బలరాం ఆయనను కలిసి ఆ పార్టీలో చేరిపోయారు. ముఖ్యమంత్రిని కలిసిన తర్వాత ఆయన బయటకు వచ్చి మీడియాతో మాట్లాడతారని వైసీపీ వర్గాలు మీడియాకు సమాచారం ఇచ్చాయి. కాని మీడియా ముందుకు బలరాం రాలేదు. ఆయన బదులు కుమారుడు వెంకటేశ్ వచ్చి మాట్లాడారు. సీఎం జగన్ సొంత పత్రికలో కూడా బలరాం చేరినట్లుగా పేర్కొనకుండా ఆయన కుమారుడు వెంకటేశ్ చేరినట్లుగా రాశారు. పార్టీ మార్పిడి వల్ల అనర్హత వేటు పడకుండా చూసుకోవడానికే ఈ జాగ్రత్తలు పాటిస్తున్నట్లు చెబుతున్నారు.

### ▸ చీరాల టీడీపీ ఇన్‌చార్జిగా బాలాజీ

ప్రకాశం జిల్లా చీరాల అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా యడం బాలాజీ నియమితులయ్యారు. అక్కడి ఎమ్మెల్యే కరణం బలరాం వైసీపీలో చేరిన నిమిషాల వ్యవధిలోనే ఈ నియామక ప్రకటనను టీడీపీ అధినేత చంద్రబాబు విడుదల చేశారు.

### ▸ వైసీపీది ప్రజాపక్షం: సజ్జల

"వైసీపీది ప్రజాపక్షం. టీడీపీ డ్రామాల పార్టీ" అని సీఎం సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో సజ్జల నేతృత్వంలో వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపార్వతి, ఎంవీఎస్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని, అందుకే పల్నాడుకు బుద్దా వెంకన్న, బొండా ఉమా వెళ్లారని ఆరోపించారు.

### ▸ వైసీపీకి శుభాకాంక్షలు: ఐఏఎస్ పీవీ రమేశ్ ట్వీట్

వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం సీఎంఓ అధికారి, విశ్రాంత ఐఏఎస్ పీవీ రమేశ్ ట్వీట్ చేశారు. "పదేళ్ల క్రితం ఇదే రోజున వైసీపీని స్థాపించారు. ప్రజా సాధికారిత కోసం కృషి చేస్తున్న వైసీపీ చిరకాలం వర్ధిల్లాలి. వైఎస్ జగన్ మొక్కవోని దీక్ష, అవిశ్రాంత కృషి పార్టీని నేటి ఈ ఉచ్ఛ స్థితికి చేర్చాయి. దీనిని మరింత ముందుకు తీసుకువెళ్లడానికి ప్రతిజ్ఞపూనుదాం" అని పీవీ ట్వీట్ చేశారు. అధికారిక హోదాలో ఉన్న పీవీ అధికార పార్టీకి శుభాకాంక్షలు చెప్పడం చర్చనీయాంశమైంది.

### ▸ హీనదశలో శాంతిభద్రతలు: తులసిరెడ్డి

కడప కలెక్టరేట్, మార్చి 12: "రాష్ట్రంలో వైసీపీ పాలనలో ప్రజాస్వామ్యం తీవ్ర ప్రమాదంలో పడింది. శాంతిభద్రతలు ఎన్నడూ లేనివిధంగా హీనదశకు చేరుకున్నాయి. గతంలో ఎన్నో ఎన్నికలు జరిగాయనీ, నామినేషన్ల సమయంలో అధికార పార్టీ నేతల దౌర్జన్యాలు, దాడులు రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ చూడలేదు" అని పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తులసిరెడ్డి అన్నారు.

### ▸ రాష్ట్రంలో ఫ్యాక్షన్ రాజకీయాలు: కళా

రాజాం రూరల్, మార్చి 12: రాష్ట్రంలో ఫ్యాక్షన్ రాజకీయాలు నడుస్తున్నాయని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళా వెంకటరావు రాజాంలో ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని అధికార పార్టీ నాయకులు పరిహాసం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. టీడీపీ నాయకులు బొండా ఉమ, బుద్దా వెంకన్నపై దాడిని ఖండించారు. వైసీపీలో దళిత ప్రజాప్రతినిధులు ఆత్మప్రబోధం ప్రకారం వర్ల రామయ్య రాజ్యసభ అభ్యర్థిత్వాన్ని సమర్థిస్తూ ఓటేసి గెలిపించాలని కోరారు.

### ▸ ప్రజల మేలు కోసం ప్రాణాలైనా అర్పిస్తా: బుద్దా

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): "స్వార్థ రాజకీయం కోసం సొంత బాబాయినే వేసేశారు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతున్న ఒక సామాన్య బీసీ నాయకుడినైన నన్ను వదులుతారని నేను అనుకోవడం లేదు" అని టీడీపీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న ట్వీట్ చేశారు. "ప్రాణం ఉన్నంత వరకూ మా అధినేత చంద్రబాబు వెంటే ఉంటా. టీడీపీ నేర్పిన విలువలు, విధానాలకు కట్టుబడి నియంతపై పోరు కొనసాగిస్తా. ప్రజల మేలు కోసం ఈ పోరులో నా ప్రాణాలు అర్పించడానికైనా సిద్ధం" అని పేర్కొన్నారు.

### ▸ రంగులేస్తే 1300 కోట్లు తీస్తే 1300 కోట్లు: లోకేశ్

"మీ ఇంటికొస్తే ఏమిస్తావు? మా ఇంటికొస్తే ఏమి తెస్తావు అనే టైపు జగన్మోహన్‌రెడ్డి. రంగులేస్తే రూ.1300 కోట్లు, వాటిని తీస్తే రూ.1300 కోట్లు, వాటేన్ ఐడియా జగన్‌జీ. రూ.2600 కోట్లు పెడితే డ్వాక్రా మహిళలకు మీరు మాటిచ్చి తప్పిన రుణాలైనా తీరేవి" అని మాజీ మంత్రి నారా లోకేశ్ ట్వీట్ చేశారు. తన ట్వీట్‌కు 'గన్నేరు పప్పు', 'ఏపీ డిజర్వ్స్ బెటర్' అనే హ్యాష్ ట్యాగ్‌లను జత చేశారు.

### ▸ బీజేపీ రాష్ట్ర సారథిగా ఎమ్మెల్సీ మాధవ్?

న్యూఢిల్లీ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీజేపీ అధ్యక్షుడిని ఖరారుచేసినట్లు తెలుస్తోంది. ఆ పదవికి ఉత్తరాంధ్రకు చెందిన యువనేత, ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్‌ను ఇప్పటికే ఎంపిక చేసినట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఈ నెలాఖరులో స్థానిక ఎన్నికల ఘట్టం పూర్తి కాగానే ఆయన పేరును ఏక్షణంలోనైనా ప్రకటించే అవకాశాలున్నాయని పేర్కొన్నాయి.

### ▸ రీ సర్వేపై 'ఉగాది' ఎఫెక్ట్... నేడు సమీక్ష

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఉగాదికి పేదలకు మంజూరు చేయనున్న ఇళ్ల స్థలాల కోసం భూముల అన్వేషణలో రెవెన్యూ, సర్వే యంత్రాంగం నిమగ్నమవ్వడంతో రీ సర్వే పైలెట్ ప్రాజెక్టు దాదాపుగా నిలిచిపోయినట్లు తెలిసింది. ఉపముఖ్యమంత్రి పిల్లి సుభాష్‌చంద్రబోస్ ఫిబ్రవరి 18న కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం తక్కెళ్లపాడు గ్రామంలో పైలెట్ ప్రాజెక్టును లాంఛనంగా ప్రారంభించిన సంగతి తెలిసిందే. రీ సర్వే అంశంతోపాటు పైలెట్ ప్రాజెక్టుపై శుక్రవారం ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు అజయ్ కల్లాం వద్ద సమీక్ష జరగనుంది.

### ▸ డిగ్రీ లెక్చరర్స్ పరీక్షలు వాయిదా

డిగ్రీ కాలేజ్ లెక్చరర్స్, నాన్ గజిటెడ్ పోస్టుల భర్తీ కోసం ఈ నెల 21, 22 మరియు 27, 28, 29 తేదీల్లో జరగాల్సిన పరీక్షలను వాయిదా వేసినట్లు ఏపీపీఎస్సీ సెక్రెటరీ ఆంజనేయులు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల కారణంగా పరీక్షలను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

## టీడీపీ అభ్యర్థులు కిడ్నాప్

**▸ ఈసీకి ఎమ్మెల్సీ రామకృష్ణ ఫిర్యాదు**

కడప, మార్చి 12(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా బి.మఠం జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థి కొమ్మినేని ఉపేంద్రనాయుడు, ఆయన సమీప బంధువు మధుకృష్ణమనాయుడులను వైసీపీ నాయకులు కిడ్నాప్ చేశారని టీడీపీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. బి.మఠం జడ్పీటీసీ స్థానాన్ని ఏకగ్రీవం చేసుకోడానికి వైసీపీ నాయకులు నామినేషన్‌ను ఉపసంహరించుకోవాలంటూ కొమ్మినేనిపై ఒత్తిడి చేశారని, ససేమిరా అనడంతో కిడ్నాప్ చేశారని ఆరోపించారు. గురువారం సాయంత్రం బి.మఠం శివార్లలో ఆ ఇద్దరూ ఉండగా వైసీపీ నాయకులుగా అనుమానిస్తున్న కొందరు కిడ్నాప్ చేశారని, నామినేషన్ల ఉపసంహరణ పత్రంపై బలవంతంగా సంతకం చేయించుకోడానికి ఈ పని చేసి ఉంటారని కొమ్మినేని బంధువులు ఆరోపించారు. అదే స్థానంలో టీడీపీ తరఫున మరో నామినేషన్ వేసిన దుగ్గిరెడ్డి, దిరసవంచ ఎంపీటీసీ అభ్యర్థి ఏసురత్నం కూడా కిడ్నాప్‌కు గురయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### ▸ ఎస్ఈసీ వైసీపీ ఏజెంటు: విష్ణువర్ధన్‌రెడ్డి

అనంతపురం, మార్చి 12(ఆంధ్రజ్యోతి): "రాష్ట్రంలో వైసీపీ, ఎన్నికల కమిషన్ కుమ్మక్కయ్యాయి. ఎన్నికల కమిషనర్ వైసీపీ ఏజెంటుగా వ్యవహరిస్తున్నారు. పోలీసు, రెవెన్యూ అధికారులు వైసీపీ నేతలు చెప్పినట్లే చేస్తున్నారు. వీరంతా వైసీపీలో చేరితే మంచిది. ఒక్కమాటలో చెప్పాలంటే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు కాదు... వైసీపీ సంస్థాగత ఎన్నికలు జరుగుతున్నాయా అనే అనుమానాలు కలుగుతున్నాయి" అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి గురువారం అనంతపురంలో మండిపడ్డారు.

# నరహంతక పాలన

## సీఎం నియోజకవర్గంలో విపక్షాలు నామినేషన్లు వేయకూడదా?

**ఈ దుర్మార్గాలను చూస్తూ ఊరుకోం: చంద్రబాబు**

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తన దౌర్జన్యాలు, అరాచకాలతో రాష్ట్రం మొత్తాన్ని మరో పులివెందులలా మారుస్తున్నారని మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ఆరోపించారు. గురువారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్షాలు స్థానిక ఎన్నికల్లో నామినేషన్లు వేయడానికే ప్రాణాలకు తెగించి పోరాడాల్సి రావడాన్ని తొలిసారి చూస్తున్నానని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్, ఉపముఖ్యమంత్రి నారాయణ స్వామి, పంచాయతీరాజ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈ దుర్మార్గాలకు ఆదర్శం కావడం విషాదకరమని వ్యాఖ్యానించారు. 'ముఖ్యమంత్రి నియోజకవర్గంలో ప్రతిపక్షాలు నామినేషన్లు వేసే పరిస్థితి లేదు. పులివెందుల, వేంపల్లె, చక్రాయిపేట వంటి మండలాల్లో ఎన్ని ఎంపీటీసీలు ఉంటే అన్నీ ఏకగ్రీవమే. పూతలపట్టు, పుంగనూరు, మాచర్ల, పీలేరు వంటి చోట్ల కూడా ఇదే పరిస్థితి. టీడీపీ వాళ్లు నామినేషన్లు వేయడానికి వస్తే వైసీపీ నేతలు, పోలీసులు అడ్డుకున్నారు. నామినేషన్లు వేయడానికి వచ్చిన వారిని పోలీసు అధికారులే తరిమేశారు. వాళ్ల ఇళ్లలో మద్యం పెట్టి అక్రమ కేసులు పెట్టారు. వలంటీర్లతో ప్రతిచోటా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. ఎలాగోలా నామినేషన్లు వేస్తే ఈ రోజు స్ర్కూటినీలో పనికిమాలిన కారణాలు చూపి పెద్ద సంఖ్యలో తిరస్కరించారు. ఇంటి పన్ను రశీదులు, కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా అధికారులను బెదిరించి అవి లేవన్న సాకు చూపించి కొన్ని తీసివేశారు. ఇప్పటివరకూ మాకున్న సమాచారం ప్రకారం 15 మండలాల్లో మొత్తం ఎంపీటీసీలను వైసీపీకి అనుకూలంగా ఏకగ్రీవం చేసుకున్నారు. రాష్ట్రం మొత్తమ్మీద ఐదారు వందలు ఈ రకంగా ఖాతాలో వేసుకున్నారు. ఈ దుర్మార్గాలను చూస్తూ ఊరుకునేది లేదు. తుదికంటా పోరాడతాం. అప్పీలుకు వెళ్తాం. అవసరమైతే సుప్రీంకోర్టు వరకూ వెళ్లడానికైనా సిద్ధం' అని స్పష్టం చేశారు. ఇంకా ఏమన్నారంటే..



మంగళగిరి ఎన్నారై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న న్యాయవాది కిశోర్‌ను గురువారం రాత్రి పరామర్శిస్తున్న చంద్రబాబు

### రౌడీరాజ్యంతో పెట్టుబడులొస్తాయా?

'సీఎం నియోజకవర్గంలోనే రౌడీరాజ్యం నెలకొంటే ఈ రాష్ట్రానికి పరిశ్రమలు పెట్టడానికి ఎవరైనా వస్తారా? నేరాలను వ్యవస్థీకృతం చేస్తున్నారు. కోర్టులు హెచ్చరిస్తున్నా పట్టించుకోకుండా ముఖ్యమంత్రి ఉన్మాదంతో వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు, ప్రాథమిక హక్కులు ఉన్నాయా అని కోర్టులు నిలదీసే పరిస్థితులు దాపురించాయి. అధికారులు కూడా ఆత్మ పరిశీలన చేసుకోవాలి. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఇలాగే తలలూపిన అధికారులు జైళ్లకు వెళ్లారు. ఇప్పుడు అంతకుమించిన స్థాయిలో అధికార యంత్రాంగాన్ని వాడుకుంటున్నారు. సహకరించిన అధికారులు తర్వాత చింతించక తప్పదు. ప్రజలు కూడా ప్రలోభాలకు లోను కావద్దు. ప్రతిఘటించాలి.'

### నివేదికలు రాలేదని తప్పించుకుంటారా?

'రాష్ట్రంలో ఇన్ని ఘోరాలు జరుగుతున్నా ఎన్నికల సంఘం చోద్యం చూస్తోంది. ఇదేమిటని అడిగితే ఎన్నికల అధికారులు నివేదికలు పంపలేదని తప్పించుకుంటున్నారు. ఎన్నికల కమిషనర్ గుమస్తా మాదిరిగా పని చేసుకుపోవడం కాకుండా కమిషన్ అధికారాలను ప్రయోగించాలి. ఇప్పటికీ రాష్ట్రమంతా ప్రభుత్వ ప్రచార హోర్డింగ్స్ అంతే ఉన్నాయి. అవి అధికారులకు, ఈసీకి కనిపించడం లేదా?'

### ఇన్ని మొట్టికాయలు ఎప్పుడైనా పడ్డాయా?

'కోర్టులతో ఇన్ని మొట్టికాయలు వేయించుకునే పరిస్థితి గతంలో ఏ ప్రభుత్వానికి రాలేదు. ఏ ప్రభుత్వం ఉన్నా ప్రాథమిక హక్కులు కాపాడాలని కోర్టులు అధికారులకు చీవాట్లు పెట్టే పరిస్థితి వచ్చింది. మాచర్ల మాదిరిగా రౌడీలు ప్రతి ఊర్లో చెలరేగిపోతే రక్షణ ఉంటుందా? నాలుగు కత్తులు, నాలుగు కర్రలు పట్టుకొని తిరిగే రౌడీలకు పోలీసుల సహకారం ఉంటే ఇక ఎవరూ ఆపలేరు. ఈ పరిస్థితులపై ప్రజలు తీర్పు ఇవ్వాలి.'

### ముఖ్యమంత్రి ఏం చేస్తున్నారు?

రాజీనామా చేయకుండా తమ పార్టీలోకి ఎవరినీ తీసుకునేది లేదని జగన్ గంభీరోపన్యాసాలు చెప్పారు. మరి ఇప్పుడు ఏం చేస్తున్నారు? బ్లాక్ మెయిల్ చేసో... ప్రలోభాలు పెట్టో కొందరిని తీసుకోవడంవల్ల మా పార్టీకి ఏమీ కాదు. మా ఆత్మస్థైర్యాన్నీ దెబ్బ తీయలేరు. పార్టీలో ఎవరెవరికి ఏం చేశామో.. పార్టీ ఎవరెవరిని ఎలా ఆదుకుందో అందరికీ తెలుసు. టీడీపీ పుట్టినప్పుడే 55 మంది ఎమ్మెల్యేలు పార్టీని వీడి వెళ్లిపోయారు. ఆ సీట్లన్నీ పార్టీ మళ్లీ గెలుచుకుంది. చిల్లర రాజకీయాలు, కుట్ర రాజకీయాలతో ఏమీ కాదు. ఒకరు పోతే వంద మంది తయారవుతారు. యువతరాన్ని ప్రోత్సహిస్తాం. మరింత పట్టుదలతో పనిచేస్తాం.'

### గవర్నర్‌కు ఫిర్యాదు

స్థానిక ఎన్నికల్లో హింస, అరాచకాలు రాజ్యమేలుతున్నాయని, అయినా ఎన్నికల సంఘం చోద్యం చూస్తోందని టీడీపీ అధినేత చంద్రబాబు విమర్శించారు. ఎన్నికల ప్రకటన నుంచి నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, బెదిరించడం, హింసకు పాల్పడడం, రిజర్వేషన్లలో తరచూ మార్పులు, బీసీలకు అన్యాయం, నామినేషన్ల పరిశీలనలో అక్రమాలు, బీసీలకు అన్యాయం, వైసీపీకి ఒక వర్గం అధికార యంత్రాంగం వత్తాసు పలకడం వంటి పరిస్థితులు నెలకొన్నాయని గవర్నర్ బిశ్వభూషణ్ దృష్టికి తీసుకెళ్లారు. గురువారం రాజ్‌భవన్‌లో చంద్రబాబు ఆయన్ను కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో ఎక్కడెక్కడ ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారు.. నామినేషన్ల పరిశీలనలో అక్రమాలు ఎక్కడ జరిగాయి.. ఎన్నికల్లో హింసకు సంబంధించిన వీడియోలను గవర్నర్‌కు అందించారు. నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నచోట్ల ఎన్నికల కోసం రీనోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. 'ప్రధానంగా పులివెందుల, పుంగనూరు, మాచర్ల, మంత్రాలయం.. ఈ 4 అసెంబ్లీ స్థానాల్లో అన్ని మండలాల్లో హింస, అక్రమాలు తీవ్రంగా జరిగాయి. రాష్ట్రంలో మరికొన్ని మండలాల్లో ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలు జరిగాయి. నామినేషన్ల పరిశీలనలో కూడా అక్రమాలు జరుగుతున్నాయి. అభ్యర్థులను పరిశీలన కోసం విడిగా పిలిచి.. ఉపసంహరించుకోవాలని బెదిరిస్తున్నారు. ఓటర్ల జాబితాలు కూడా రెండేసి ఇస్తున్నారు. తొలుత మొన్నటి సార్వత్రిక ఎన్నికల నాటి ఓటర్ల జాబితా ఇచ్చారు. ఆ తర్వాత తాజాగా తమ ఇష్టప్రకారం మార్పు, చేర్పులు చేసిన ఓటర్ల జాబితాలు ఇచ్చారు. పలుచోట్ల నో డ్యూ సర్టిఫికెట్లు ఇవ్వలేదు. గ్రామ వలంటీర్లు జగన్ రుణం తీర్చుకోవాలంటూ సాక్షాత్తూ ఉప ముఖ్యమంత్రే వ్యాఖ్యానించారు. ఈ అక్రమాలన్నిటినీ పరిశీలించి మీరు జోక్యం చేసుకోండి' అని గవర్నర్‌ను అభ్యర్థించారు.

## నామినేషన్ల గడువు పెంచండి!

**ఎన్నికల సంఘానికి చంద్రబాబు లేఖ**

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నామినేషన్ల దాఖలు గడువు పెంచాలని, ప్రతిపక్షాలు నామినేషన్లు వేయలేకపోయిన స్థానాలకు రీషెడ్యూల్ ప్రకటించాలని తెలుగుదేశం పార్టీ డిమాండ్ చేసింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ల దాఖలుకు అనేకచోట్ల అధికార పార్టీ నేతలు అడ్డంకులు సృష్టించినందున ప్రతిపక్ష అభ్యర్థులు నామినేషన్లు కూడా దాఖలు చేయలేకపోయారని, ఆయా స్థానాలకు మళ్లీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాలని కోరింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘాని(ఎస్ఈసీ)కి టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు లేఖ రాశారు. టీడీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయలేకపోవడానికి కారణాలను తెలియజేస్తూ గురువారం నివేదిక పంపారు. అధికార పార్టీ నేతల అడ్డంకులు, బెదిరింపులు, దౌర్జన్యాలతో ఆరు జడ్పీటీసీ సీట్లకు, 154 ఎంపీటీసీ స్థానాలకు టీడీపీ నామినేషన్లు దాఖలు చేయలేకపోయినట్లు పేర్కొన్నారు. 'గుంటూరు జిల్లా రెంటచింతల జడ్పీటీసీ స్థానం టీడీపీ అభ్యర్థి పోట్ల సతీశ్, దుర్గి జడ్పీటీసీ స్థానం టీడీపీ అభ్యర్థి యాగంటి నరేష్‌ని పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం వల్ల నామినేషన్లు వేయలేదు. నెల్లూరు జిల్లా తలవాయిపాడు ఎంపీటీసీ స్థానానికి నామినేషన్ వేయడానికి వెళ్లిన కొండా పెంచలమ్మ నామినేషన్ పత్రాలను వైసీపీ నేత సత్యనారాయణరెడ్డి చించివేసిన విషయం తెలిసి, పెళ్లకూరు జడ్పీటీసీ సీటుకు రావినూతల మస్తానమ్మ భయపడి నామినేషన్ వేయకుండానే వెనక్కి వెళ్లిపోయింది. చిత్తూరు జిల్లా పుంగనూరు, సదుం జడ్పీటీసీ స్థానాల విషయంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భయపెట్టడం వల్ల నామినేషన్ వేసేందుకు టీడీపీ తరఫున ఎవరూ ముందుకు రాలేదు. యాడమర్రి జడ్పీటీసీ సీటుకు నామినేషన్ వేయడానికి వెళ్లిన కె.రవీంద్రారెడ్డిని జడ్పీ కార్యాలయం వద్ద వైసీపీ అభ్యర్థి ధనుంజయరెడ్డి అనుచరులు బెదిరించి నామినేషన్ పత్రాలను లాక్కుపోగా.. అక్కడ డ్యూటీలో ఉన్న పోలీసు సిబ్బంది కూడా వారికి సహకరించారు. టీడీపీ అభ్యర్థులను అరెస్టు చేయడం.. నామినేషన్లకు అడ్డుపడడం.. నామినేషన్ పత్రాలను లాక్కుపోవడం వంటి అరాచకాలకు అధికార పార్టీ పాల్పడింది. కడప. చిత్తూరు. గుంటూరు, ఉభయ గోదావరి, నెల్లూరు, అనంతపురం జిల్లాల్లోని 154 ఎంపీటీసీ స్థానాలకు, 6 జడ్పీటీసీలకు టీడీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయలేకపోయాం. వీటన్నింటినీ పరిశీలించి రీషెడ్యూల్ ప్రకటించాలి' అని విజ్ఞప్తి చేశారు.

# వైసీపీవా... అయితే ఓకే!

**▸ కడపలో భారీగా టీడీపీ నామినేషన్ల తిరస్కరణ**

**▸ పీలేరు బరిలో మిగిలినవారంతా వైసీపీ నేతలే**

కడప/పీలేరు, మార్చి 12: జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల పరిశీలన ప్రక్రియ రసాభాసగా మారింది. సీఎం జగన్ సొంత జిల్లా కడపలో జడ్పీటీసీ, ఎంపీటీసీల నామినేషన్లు పెద్దసంఖ్యలో తిరస్కరణకు గురయ్యాయి. జిల్లాలో 50 జడ్పీటీసీ స్థానాలకు 343 నామినేషన్లు దాఖలయ్యాయి. 554 ఎంపీటీసీ స్థానాలకు 2,684 నామినేషన్లు వచ్చాయి. గురువారం నామినేషన్ల పరిశీలనలో భాగంగా 47 జడ్పీటీసీ అభ్యర్థుల నామినేషన్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కడప డివిజన్ పరిధిలో 6మండలాల జడ్పీటీసీ స్థానాలకు టీడీపీ వేసిన నామినేషన్లు మాత్రమే తిరస్కరించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కమలాపురం నియోజకవర్గం సీకేదిన్నె మండలంలో 9 ఎంపీటీసీ స్థానాలకు టీడీపీ అభ్యర్థులు 15మంది, వైసీపీ అభ్యర్థులు 17మంది, ఇతరులు నలుగురు నామినేషన్లు వేశారు. టీడీపీ, ఇతరులు వేసినవి కలిపి మొత్తం 19 నామినేషన్లను ఆర్ఓ తిరస్కరించారు. బద్వేలులోని బి.కోడూరులో మున్నెపల్లె ఎంపీటీసీ స్థానానికి టీడీపీ అభ్యర్థి రాఘవరెడ్డి అన్నీ సక్రమ పత్రాలతో నామినేషన్లు వేసినా, ఓ పత్రాన్ని అధికారులే చింపేసి నామినేషన్‌ను తిరస్కరించారని టీడీపీ నాయకులు ఆరోపించారు. దీనిపై హైకోర్టును ఆశ్రయిస్తామన్నారు. రాయచోటి నియోజకవర్గం రామాపురం మండలంలో 21నామినేషన్లు తిరస్కరించారు. సరైన కారణాలు చెప్పకుండా తిరస్కరించారని, హైకోర్టును ఆశ్రయిస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా పీలేరు మండలంలో 56 ఎంపీటీసీ నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. 21 ఎంపీటీసీ స్థానాలకు టీడీపీ, జనసేన అభ్యర్థులు వేసిన 35 నామినేషన్లు తిరస్కరించారు. దీంతో వైసీపీ అభ్యర్థుల నామినేషన్లు మాత్రమే మిగిలాయి. గుంటరు జిల్లా రేపల్లె నియోజకవర్గం చెరుకుపల్లి ఎంపీటీసీ(ఎస్టీ మహిళ) అభ్యర్థిగా టీడీపీ తరఫున పాలపర్తి దుర్గ నామినేషన్ వేశారు. నామినేషన్ల పరిశీలన సందర్భంగా ఆమె ఎస్టీ కాదని, ఓసీ అని వైసీపీ నేతలు తప్పుడు ఆధారాలు చూపి అభర్థిత్వాన్ని తిరస్కరించాలని రిటర్నింగ్ అధికారిపై ఒత్తిడి తెచ్చారు. ఇదే మండలం అరుంబాక ఎంపీటీసీ స్థానానికి టీడీపీ తరఫున నామినేషన్ వేసిన ఎం.శ్రీనివాసరావుపై ఉన్న ఒక కేసును 2007లోనే కొట్టివేసినా ఇతను నేరస్తుడంటూ నామినేషన్ తిరస్కరించాలని రిటర్నింగ్ అధికారిపై వైసీపీ నేతలు ఒత్తిడి తెచ్చారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆ అధికారి రెండు నామినేషన్లను పరిశీలన నిమిత్తం ఆర్డీవోకు పంపారు.

## టీడీపీ అభ్యర్థి కోసం పోలీసుల వేట

గుంటూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా మాచర్ల జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థి తన నామినేషన్ ఉపసంహరించుకోవాలని వైసీపీ శ్రేణులు ఒత్తిడి చేస్తున్నాయి. అధికార పార్టీ నేతల బెదిరింపులకు భయపడి ఈ స్థానానికి టీడీపీ తరఫున నామినేషన్ వేసేందుకు స్థానికులు ఎవరూ ముందుకురాలేదు. నాగార్జున సాగర్ వాసి, హైదరాబాద్‌లో ఉండే న్యాయవాది చందులాల్ నాయక్ టీడీపీ తరఫున బరిలోకి దిగేందుకు ముందుకొచ్చారు. ఆయనకు ఇక్కడ ఓటు ఉండడంతో నామినేషన్ ఆమోదం పొందింది. ఏకగ్రీవంగా గెలుపొందాలని భావించిన వైసీపీ శ్రేణులు నామినేషన్‌ను ఉపసంహరిచుకోవాలని బెదిరించారు. బరిలో నిలవాలనే ఉద్దేశంతో చందులాల్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. దీంతో ఆయన కోసం వైసీపీ నాయకులతో పాటు సుమారు 25మంది పోలీసులు అన్వేషిస్తున్నట్లు తెలిసింది. చందులాల్ కుటుంబీకులను అదుపులోకి తీసుకుని అతని ఆచూకీ చెబుతారా, చంపేయమంటారా అని బెదిరిస్తున్నట్లు సమాచారం.

## మాచర్ల ఘటనపై హత్యాయత్నం కేసు నమోదు

**▸ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా నేడు ప్రధాన నిందితుడు కిశోర్ నామినేషన్!**

గుంటూరు, మార్చి 12: టీడీపీ నేతలు బొండా ఉమామహేశ్వరరావు, బుద్దా వెంకన్నలపై బుధవారం మాచర్లలో జరిగిన హత్యాయత్నం ఘటనపై తొలుత పోలీసులు బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అయితే గురువారం ఆస్పత్రి నుంచి మెడికో లీగల్ కేసు (ఎంఎల్‌సీ) నివేదిక రావడంతో పోలీసులు ఆ కేసులో సెక్షన్ 307 (హత్యాయత్నం)ని చేర్చారు. ఘటన జరిగిన గంటల వ్యవధిలోనే ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని పోలీసులు అంటున్నారు. నిందితులు నిజంగా వారి అదుపులోనే ఉన్నారా.. అరెస్టు చేశారా.. లేదంటే విడుదల చేశారా అనేది తెలియడం లేదు. ప్రధాన నిందితుడైన తురకా కిశోర్ వైసీపీ తరఫున మాచర్ల మున్సిపల్ చైర్మన్‌గా పోటీ చేయాల్సి ఉంది. నామినేషన్ల దాఖలు గడువు శుక్రవారంతో ముగియనుంది. దీంతో కిశోర్‌ను హత్యాయత్నం కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతారా లేదంటే స్టేషన్ బెయిల్‌పై విడుదల చేస్తారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఆయనతో శుక్రవారం నామినేషన్ వేయించనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

## నూజివీడులో పోలీసుల హడావుడి

నూజివీడు, మార్చి 12: కృష్ణాజిల్లా నూజివీడు పురపాలక ఎన్నికల్లో టీడీపీ తరఫున 32వ వార్డు అభ్యర్థిగా పోటీచేస్తున్న పల్లి నాగరాజు వ్యాపార సంస్థలో పోలీసులు సోదాలు చేసి హడావుడి సృష్టించారు. ఆయనను అభ్యర్థిగా ఎంపిక చేసిన గంటలోనే ఈ దాడులు జరగడం గమనార్హం. నాగరాజు స్థానిక హరిదుర్గ మణికంఠ ఫైనాన్స్ సంస్థ యజమాని. సెకండ్ హ్యాండ్ బైకులను ఫైనాన్స్‌కు అమ్ముతుంటారు. గురువారం రాత్రి 7.30 సమయంలో ఎస్ఐ శ్రీనివాసరావు అక్కడికొచ్చి 'ఇక్కడ ఉన్నవన్నీ దొంగబళ్లే.. లారీ తీసుకొచ్చి ఎక్కించండి..' అంటూ హంగామా సృష్టించారు. టీడీపీ ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు తన అనుచరులతో వచ్చి నాగరాజు అభ్యర్థిగా ఎంపికైన గంటలోనే ఫిర్యాదులు అందాయా అంటూ ప్రశ్నించడంతో వాహనాల వివరాలను రేపు అందించాలని చెప్పి ఎస్ఐ నిష్క్రమించారు.

## 'కోడ్' పట్టని అధికారులు

**▸ ఇళ్ల స్థలాల పంపిణీకి గ్రామసభ.. టీడీపీ ఫిర్యాదుతో విచారణ**

**▸ మరికొన్ని పంచాయతీల్లో గ్రామసభల నిలిపివేత**

జంగారెడ్డిగూడెం, మార్చి 12: ఎన్నికల కోడ్ ఉండగా కొత్తగా పథకాలు పంపిణీ చేయరాదని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. కానీ అధికారులు దాని మాట కంటే ప్రభుత్వ పెద్దలకే ఎక్కువ విలువ ఇచ్చినట్టు కనిపిస్తోంది. ఉగాది నాటికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించే పనులను కోడ్ అమల్లో ఉన్నా యథేచ్ఛగా చేసేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లి సచివాలయంలో గురువారం ఇందుకోసం గ్రామసభనే నిర్వహించారు. వీఆర్వో, పంచాయతీ సెక్రటరీల ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. దీనిపై మండల ఎన్నికల అధికారి జి.శ్రీనివాస్‌కు టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. గ్రామసభ ఫొటోలు, గ్రామసభ తీర్మానం కాపీనీ ఫిర్యాదుకు జతచేశారు. ఆయన తహసీల్దార్‌తో మాట్లాడి విచారణకు ఆదేశించారు. ఈ ఫిర్యాదు నేపథ్యంలో పలుచోట్ల గ్రామసభలను నిలిపివేసినట్టు తెలిసింది.

## చిత్తూరు జిల్లాలో ఆగని వైసీపీ దాడులు

**▸ జనసేన శ్రీకాళహస్తి ఇన్‌చార్జిపై దౌర్జన్యం**

తిరుపతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలో ప్రతిపక్షాల నేతలు, కార్యకర్తలపై వైసీపీ దాడులు గురువారం కూడా కొనసాగాయి. శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి నగరం వినుత ప్రయాణిస్తున్న వాహనంపై వైసీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. శ్రీకాళహస్తి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీటీసీ నామినేషన్ల పరిశీలనకు హాజరై తిరిగి వెళ్తుండగా.. ముఖాలు కనబడకుండా కర్చీఫ్‌లు కట్టుకున్న పలువురు వైసీపీ కార్యకర్తలు పట్టణంలోని పానగల్లు వద్ద వాహనంలో వెళ్తున్న వినుతపై దాడి చేశారు. వాహనం అద్దాలు ధ్వంసమయ్యాయి. వినుత అనుచరుడు మహేశ్ గాయపడ్డారు. ఎంపీడీవో కార్యాలయం వద్దే టీడీపీ కార్యకర్త విజయ్‌భాస్కర్‌పై దాడిచేశారు. తొట్టంబేడు ఎంపీడీవో కార్యాలయం వద్ద నామినేషన్ల పరిశీలనకు వెళ్లిన శ్రీకాళహస్తి బీజేపీ అధ్యక్షుడు కాసరం రమేశ్, జనసేన పట్టణ అధ్యక్షుడు కొట్టే సాయిపైనా వైసీపీ కార్యకర్తలు దాడి చేశారు. టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి, బీజేపీ నేత కోలా ఆనంద్, తిరుపతి పార్లమెంటు బీజేపీ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి తదితరులు ఎంపీడీవో కార్యాలయం ఎదుట రోడ్డుపై బైఠాయించారు. అదనపు ఎస్పీ మునిరామయ్య బలగాలతో చేరుకుని బీజేపీ నేతలను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై బొజ్జల సుధీర్‌రెడ్డి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు.

## వైసీపీ మోచేతి నీళ్లు తాగే అధికారులను వదిలిపెట్టం

**▸ అందరినీ గుర్తుపెట్టుకుంటున్నాం: టీడీపీ**

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ మోచేతి నీళ్లు తాగుతూ.. ప్రతిపక్షాలు నామినేషన్లు వేయనివ్వకుండా అడ్డుపడిన అధికారులను వదిలిపెట్టబోమని టీడీపీ హెచ్చరించింది. 'ప్రభుత్వాలు మారతాయి. ఇప్పుడు ఏ అధికారి ఏం చేస్తున్నారో మేం గుర్తుపెట్టుకుంటున్నాం. మేమొచ్చాక వారిని వదిలిపెట్టేది లేదు. ఆ రోజు ఇదే అధికారులు ఇబ్బంది పడక తప్పదు. ఆ రోజు మిమ్మల్ని కాపాడడానికి జగన్ ఉండడు. మాచర్ల సీఐ భక్తవత్సలరెడ్డి వంటి అధికారులు మరీ దారుణంగా ప్రవర్తిస్తున్నారు. మీకు అంత ప్రేమ ఉంటే యూనిఫాం వదిలిపెట్టి వైసీపీ కండువా కప్పుకోండి. కానీ ఉద్యోగంలో ఉండి అడ్డగోలుగా చేస్తే సహించేది లేదు. మంత్రి బుగ్గన నియోజకవర్గంలో సీఐ ఆ నియోజకవర్గంలో ఇతరులు నామినేషన్ ఎలా వేస్తారని మాట్లాడుతున్నారు. అన్నీ రికార్డు చేశాం. మేం ఊరుకుంటామని అనుకోవద్దు' అని టీడీపీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు స్పష్టం చేశారు.

### కోర్టులే న్యాయం చేయాలి: యనమల

'తొలి ఏడాదిలోనే వైసీపీ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. దీంతో స్థానిక ఎన్నికల్లో గెలవలేమనే భయం ఏర్పడింది. అందుకే కండబలం, ఆర్థికబలం, మందబలంతో బరితెగించి అనేక అరాచకాలకు పాల్పడుతోంది. ఎన్నికల్లో అక్రమాలకు ప్రభుత్వమే తెరతీస్తే ఇక అప్పుడు కోర్టులే జోక్యం చేసుకుని ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడాలి' అని టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు అభ్యర్థించారు.

### ▸ మా ప్రాణాలకు రక్షణ కల్పించండి: బొండా

విజయవాడ, మార్చి 12(ఆంధ్రజ్యోతి): "రాష్ట్రంలో రౌడీ రాజ్యం నడుస్తోంది. మా ప్రాణాలకు హాని ఉంది. గుంటూరు జిల్లా మాచర్లలో జరిగిన దాడి నేపథ్యంలో మాకు రక్షణ కల్పించండి" అని మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన విజయవాడ పోలీస్ కమిషనర్ సీహెచ్ ద్వారకా తిరుమలరావును కలిశారు. ధ్వంసమైన కారును చూపించారు. మాచర్లలో జరిగిన దాడి దృశ్యాలను ఆయనకు వివరించారు. అనంతరం బొండా మీడియాతో మాట్లాడారు. మాచర్ల పోలీసు స్టేషన్‌కు వెళ్లిన తమను మూడు చోట్ల చంపాలని చూశారని చెప్పారు. తాను, ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న దైవానుగ్రహంతో బయట పడ్డామన్నారు. తాము మాచర్ల వెళ్తున్నట్టు పోలీసులకు ముందుగానే సమాచారం ఇచ్చామన్నారు. వారి నుంచే మాచర్ల ఎమ్మెల్యే వర్గానికి సమాచారం అందిందన్నారు.

ఊరిలో విశేషం




# యాభై ఏళ్లుగా ఏకగ్రీవమే

**ఆదర్శ గ్రామాలు**

**చింతలవలస, ఇద్దనవలస**

విజయనగరం జిల్లా మెంటాడ మండలంలోని చింతలవలస, ఇద్దనవలస పంచాయతీలు సుమారు 50 సంవత్సరాల క్రితం ఏర్పడ్డాయి. అప్పటి నుంచి సర్పంచ్, వార్డుమెంబర్ స్థానాలకు ఒక్క పర్యాయం కూడా ఈ గ్రామాల్లో పోలింగ్ జరగలేదు. ప్రతీ ఎన్నికల సమయంలోనూ గ్రామస్థులంతా సమావేశమై సర్పంచ్, వార్డు సభ్యులను ఏకాభిప్రాయంతో నిర్ణయిస్తారు. గ్రామంలో ఎన్ని రాజకీయ పార్టీలున్నా పంచాయితీ ఎన్నికలొచ్చేసరికి అందరిదీ ఒకేమాట. ఏకగ్రీవ పంచాయతీలకు ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహక నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి గ్రామాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారు. అయితే ఇదంతా పంచాయతీ ఎన్నికల వరకే. మిగతా ఏ ఎన్నికలైనా ఎవరి పార్టీ వారిదే. ఈసారి సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలు ఒకే సారి జరుగుతుండటంతో ఆ ఆదర్శం కొనసాగుతుందో! లేదో! చూడాలి. - మెంటాడ

## ఆర్డినెన్స్‌ను అడ్డుకోండి

**హైకోర్టులో టీడీపీ ఎమ్మెల్యే అనగాని పిటిషన్**

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీతో పాటు ఇతర పంచాయతీరాజ్ ఎన్నికల నిబంధనలకు సవరణలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. టీడీపీ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ గురువారం ఈ పిటిషన్ దాఖలు చేశారు. ఏపీ పంచాయతీరాజ్ చట్టం-1994 ప్రకారం.. ఎన్నికలు నిర్వహించే, లేదా ప్రత్యేక చట్టాలు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని. ఎన్నికల సంఘం పరిధిలో ఉండే అధికారాలను ప్రభుత్వం తీసుకోవడం రాజ్యాంగ విరుద్ధమని పిటిషన్‌లో పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడిన వ్యక్తులకు మూడేళ్ల జైలు వంటి చర్యలతో ఆర్డినెన్స్ తెచ్చే అధికారం ప్రభుత్వానికి లేదన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం చేపట్టాల్సిన బాధ్యతల్ని నిర్వహించడం దాని విధుల్లో జోక్యం చేసుకోవడమేనన్నారు. రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఈ ఆర్డినెన్స్‌ను దురుద్దేశంతోనే తీసుకొచ్చారని, అమలు కాకుండా అడ్డుకోవాలని కోర్టును అభ్యర్థించారు. ప్రతివాదులుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కేంద్ర పంచాయతీరాజ్, న్యాయశాఖల కార్యదర్శులను, రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి తదితరులను చేర్చారు.

## ఎంపీటీసీలకు 50,064 జడ్పీటీసీలకు 4,778 నామినేషన్లు

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల గడువు బుధవారంతో ముగిసింది. 13 జిల్లాల్లో ఎన్నికలు నిర్వహించనున్న 652 జడ్పీటీసీలకుగాను 4,778 నామినేషన్లు దాఖలయ్యాయి. బుధవారం ఒక్కరోజే 4,355 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఎంపీటీసీలకు సంబంధించి రాష్ట్రంలోని 9696 స్థానాలకుగాను 50,064 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. గురువారం ఈ నామినేషన్లను అధికారులు పరిశీలించారు. పోటీ నుంచి విరమించుకోవాలనే అభ్యర్థులు శనివారం మధ్యాహ్నం 3 గంటలలోపు నామినేషన్లు ఉపసంహరించుకోవచ్చు. అదే రోజు అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తారు. ఈ నెల 21న ఎన్నికలు నిర్వహిస్తారు.

**జడ్పీటీసీ నామినేషన్లు**

| జిల్లా | మొత్తం స్థానాలు | దాఖలైన నామినేషన్లు |
|---|---|---|
| శ్రీకాకుళం | 38 | 281 |
| విజయనగరం | 34 | 241 |
| విశాఖపట్నం | 39 | 296 |
| తూర్పుగోదావరి | 61 | 482 |
| పశ్చిమగోదావరి | 48 | 370 |
| కృష్ణా | 46 | 331 |
| గుంటూరు | 54 | 388 |
| ప్రకాశం | 55 | 394 |
| నెల్లూరు | 46 | 330 |
| కర్నూలు | 53 | 351 |
| అనంతపురం | 63 | 474 |
| చిత్తూరు | 65 | 480 |
| కడప | 50 | 341 |

# బెదిరిస్తే తీవ్రంగా పరిగణిస్తాం

- ఏకగ్రీవం కోసం అక్రమాలను సహించం
- అది కోడ్ ఉల్లంఘనే
- కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్లను ఆదేశించాం
- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ప్రకటన



అమరావతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో హింస, బెదిరింపులతో ఏకగ్రీవం చేసేలా నామినేషన్లు దాఖలు చేయకుండా అభ్యర్థులను నిరోధించడాన్ని తీవ్రంగా పరిగణిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రమేశ్ కుమార్ హెచ్చరించారు. రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో హింస, బెదిరింపులు, శారీరకంగా నిరోధించడం, అభ్యర్థులను నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకోవడం వంటి సంఘటనలు.. తద్వారా ఎన్నికలను ఏకగ్రీవంగా చేయడం లాంటి ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. కొన్ని పార్టీల నుంచి ఫిర్యాదులు వచ్చాయని.. ఆయా సంఘటనలపై పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో కూడా వస్తున్నాయని, వీటిని ఎన్నికల నియమావళి ఉల్లంఘనగా పరిగణిస్తామని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకుండా నిరోధిస్తే.. ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించినట్లే. ఎన్నికల సంఘం అభ్యర్థులకు తగిన రక్షణ కల్పించి ఇలాంటివాటిని అరికడుతుంది. పోటీ చేసే అభ్యర్థులను అడ్డుకోవడం, కుల ధ్రువపత్రాలను తిరస్కరించినట్లు ఆరోపణలొస్తున్నాయి. ఇలాంటి చట్ట విరుద్ధ పద్ధతులను ఆశ్రయిస్తే కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్లను ఆదేశించాం. ఎన్నికలు స్వేచ్ఛగా, శాంతియుతంగా నిర్వహించడానికి ఇలాంటి అప్రజాస్వామిక చర్యలపై స్పందించాలని క్షేత్రస్థాయిలో అధికారులకు స్పష్టం చేశాం. ఓటర్లు, పార్టీల ఫిర్యాదులను కలెక్టర్లు స్వీకరించి పరిష్కరించాలని ఆదేశించాం. హింస, బెదిరింపులు, నామినేషన్ల దాఖలు చేయకుండా అడ్డుకోవడం తదితర సంఘటనలపై ప్రెస్, ఎలక్ట్రానిక్ మీడియాలో కనిపించే కథనాలపై నివేదికలను స్వీకరించి ఎన్నికల సంఘం తన అభిప్రాయాలను వెల్లడిస్తుంది' అని తెలిపారు.

## ఆమెకు మరో అవకాశం!

**గడువు ముగిసినా నామినేషన్‌కు అనుమతి**

- రాష్ట్ర ఎన్నికల కమిషన్ అసాధారణ నిర్ణయం
- నామినేషన్ దాఖలు చేసిన పాలపాడు అభ్యర్థి




అమరావతి/ గుంటూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు నామినేషన్ల దాఖలులో జరుగుతున్న అరాచకాలపై రాష్ట్ర ఎన్నికల కమిషన్ కన్నెర్ర చేసింది. వైసీపీ నేతల ఆగడాలతో నామినేషన్ వేయలేకపోయిన అభ్యర్థికి గడువు పూర్తయినప్పటికీ గురువారం నామినేషన్ దాఖలుకు అనుమతి ఇచ్చింది. నరసరావుపేట నియోజకవర్గ పరిధిలోని పాలపాడు ఎంపీటీసీ (ఓసీ జనరల్) స్థానానికి టీడీపీ తరఫున తన కోడలు పులిమి ప్రతిభాభారతితో నామినేషన్ వేయించేందుకు ఆర్వో వద్దకు వెళ్తున్న పులిమి వెంకటరామిరెడ్డిపై వైసీపీ నేతలు బుధవారం దాడిచేశారు. అతడి చేతిలోని పత్రాలు చించివేసి, నామినేషన్ వేయనివ్వకుండా గెంటివేశారు. సమాచారం ఈసీ దృష్టికి వెళ్లడంతో స్పందించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ తనకున్న విశేషాధికారాలు ఉపయోగించి ప్రతిభా భారతి నామినేషన్ దాఖలు చేసేందుకు గురువారం సాయంత్రం వరకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో గురువారం ఆమె నామినేషన్ దాఖలు చేసినట్లు కలెక్టర్ సమాచారం ఇచ్చారని ఎన్నికల కమిషనర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అల్లర్లు, దౌర్జన్యాలు జరిగినప్పుడు ఎన్నికలు వాయిదా వేసిన సందర్భాలున్నాయి. కానీ ఎన్నికల కమిషన్ తనకున్న విశేష అధికారాలతో గడువు పూర్తయిన తర్వాత నామినేషన్ మళ్లీ వేయించడం అరుదైన సంఘటన. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అసాధారణ రీతిలో స్పందించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

### కంకణాలపల్లి జనసేన అభ్యర్థిపై దాడి, కిడ్నాప్

గుంటూరు జిల్లా సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి ఎంపీటీసీ అభ్యర్థిగా జనసేన తరఫున నామినేషన్ దాఖలు చేసిన వేల్పూరి శ్రీనివాసరావుపై బుధవారం అర్ధరాత్రి వైసీపీ నేతలు దాడికి పాల్పడి, కిడ్నాప్ చేశారు. అతడిని ఎలాగైనా బరిలో నుంచి ఉపసంహరించుకునేలా చేయాలని ప్రయత్నిస్తున్నారు. గురువారం రాత్రి వరకు కూడా అతడిని అజ్ఞాతంలోనే ఉంచి బెదిరిస్తున్నారని చెబుతున్నారు.



కాలనీ వాసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

### రోడ్డేస్తేనే ఓటు

రోడ్డేస్తేనే ఓట్లేస్తామంటూ భీష్మించారు కృష్ణాజిల్లా పామర్రులోని రామాంజనేయ కాలనీ వాసులు. ఎన్నికల సమయంలో ఇలా పట్టుబట్టడంతో పార్టీల నేతలు సతమతమవుతున్నారు. కాలనీ ఏర్పడి 25 ఏళ్లు అవుతున్నా, తమ ప్రాంతంపై అధికారులు, నాయకులు శీతకన్ను వేయడంపై ఓటర్లు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. రోడ్ల దుస్థితిపై కాలనీలో భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. కాలనీలో విద్యుత్ సౌకర్యం లేక విషపురుగులతో సావాసం చేస్తున్నామని, రోడ్డు పూర్తిగా ధ్వంసమై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో కాలనీలో రోడ్లు, విద్యుత్, డ్రైనేజీ సౌకర్యం కల్పించడానికి రూ.1.30కోట్లు కేటాయించినా, అధికారుల అలసత్వం కారణంగా పనులు చేపట్టలేదు. - పామర్రు



### నెల్లూరులో వైసీపీతో జతకట్టిన సీపీఐ

స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ, టీడీపీ పొత్తు పెట్టుకున్న విషయం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా ఆ రెండు పార్టీలు మిత్రపక్షాలుగా ఎన్నికల బరిలో దిగుతున్నాయి. అయితే, నెల్లూరు రూరల్ మండలంలో మాత్రం సీపీఐ నాయకులు వైసీపీతో పొత్తుపెట్టుకున్నారు. ఎంపీటీసీ స్థానం వైసీపీకి, సర్పంచ్ స్థానం సీపీఐకి.. ఇలా సీట్లను పంచుకొని ఒకరికొకరు గెలుపు కోసం కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నారు. ఆ మేరకు ప్రచారం కూడా ప్రారంభించారు. - నెల్లూరు



పట్టుబడిన నగదుతో పోలీసులు

### కోడ్.. 46 లక్షలు స్వాధీనం

ఎన్నికల కోడ్ నేపథ్యంలో రూ.46.79 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం కృష్ణా జిల్లా కంచికచర్ల సమీప కీసర టోల్‌గేట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. జగ్గయ్యపేట నుంచి ఆర్టీసీ బస్సులో విజయవాడ వెళుతున్న జగ్గయ్యపేటకు చెందిన కోట కృష్ణ బ్యాగులో రూ.45,54,570 లక్షలు గుర్తించారు. ఈ నగదుకు ఏలాంటి ఆధారాలూ లేకపోవడంతో స్వాధీనం చేసుకొని, రిటర్నింగ్ అధికారికి అప్పగించనున్నట్టు సీఐ చెప్పారు. అలాగే, నందిగామ మండలం కొణతమాత్మకూరు చెక్‌పోస్టు వద్ద రూ.1.79 లక్షలను పోలీసులు పట్టుకున్నారు. అదే గ్రామానికి చెందిన అప్పారావు గంపలగూడెం మండలం పెనుగొలను నుంచి ఆ నగదు తీసుకొస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. - కంచికచర్ల

## మాటపై నిలవండి.. నోటు గెలవండి



### ఏకగ్రీవాలకు పెరిగిన నజరానా!

**చిన్న పంచాయతీలకు 5 లక్షలు.. మేజర్‌కు 20 లక్షలు**

రాష్ట్రంలో నిర్వహిస్తున్న స్థానిక ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే అలాంటి పంచాయతీలకు నజరానాను పెంచుతూ పంచాయతీరాజ్‌శాఖ ఉత్తర్వులు జారీచేసింది. గతంలో 15వేల జనాభా కంటే తక్కువ ఉన్న గ్రామ పంచాయతీలకు రూ.7 లక్షలు, 15 వేల కంటే ఎక్కువ జనాభా కలిగిన వాటికి రూ.20 లక్షలు నజరానా ఇచ్చేవారు. తాజాగా ప్రభుత్వం వాటిని సవరించింది. 2 వేల జనాభా కంటే తక్కువ ఉన్న గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమైతే రూ.5 లక్షలు, 2-5 వేల లోపు జనాభా ఉంటే రూ.10 లక్షలు, 5-10 వేల లోపు ఉంటే రూ.15 లక్షలు, 10 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు రూ.20 లక్షల నజరానా ఇవ్వనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏకగ్రీవ పంచాయతీలకిచ్చే ఈ నజరానాతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చు. - అమరావతి

### ఎంపీటీసీ రేసులో వలంటీర్

పెద్దాపురం, మార్చి 12: ఎంపీటీసీ పదవి కోసం గ్రామ వలంటీర్ ఉద్యోగానికి, పాఠశాల విద్యా కమిటీ సభ్యురాలి పదవికి రాజీనామా చేసిందో యువతి. తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం మండలం కట్టమూరు ఎంపీటీసీ-1 స్థానానికి నంది ఉమామహేశ్వరి టీడీపీ తరఫున నామినేషన్ దాఖలు చేశారు. గ్రామ వలంటీర్, విద్యా కమిటీ సభ్యురాలి పదవి రాజీనామా లేఖలను సంబంధిత అధికారులకు ఆమె అందజేశారు. డిగ్రీ పూర్తిచేసిన తాను ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే రాజకీయాల్లోకి వచ్చినట్లు ఆమె పేర్కొన్నారు.

### మున్సిపోల్స్‌కు 3380 నామినేషన్లు

మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి రెండోరోజు గురువారం వివిధ పార్టీల అభ్యర్థులు ఉత్సాహంగా నామినేషన్లు దాఖలు చేశారు. రాష్ట్రంలోని 75 పురపాలక సంఘాలు, నగరపాలక పంచాయతీలు, 12 నగర పాలక సంస్థల్లో కలిపి రెండోరోజు గురువారం మొత్తం 3380 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో మున్సిపాలిటీలు, నగరపాలక పంచాయతీల్లో 1997, మున్సిపల్ కార్పొరేషన్లలో 1383 ఉన్నాయి. తొలిరోజు బుధవారం వచ్చిన 386తో కలిపి రాష్ట్రంలో ఇప్పటి వరకు దాఖలైన మొత్తం నామినేషన్ల సంఖ్య 3716కు చేరింది.

### ఎంపీటీసీ అభ్యర్థి 'వెలి'

తణుకు, మార్చి 12: ఎన్నికల్లో నామినేషన్ ఉపసంహరించుకోలేదని ఓ కుటుంబాన్ని వెలివేశారు వైసీపీ నాయకులు. పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలం ఏలేటిపాడులో జరిగిందీ దారుణం. గ్రామానికి చెందిన దూలబోయిన శ్రీలక్ష్మి టీడీపీ తరఫున ఎంపీటీసీ అభ్యర్థిగా 11న నామినేషన్ దాఖలు చేశారు. ఉపసంహరించుకోవాలంటూ వైసీపీ నేతలు ఆమెను బెదిరించారు. మాట వినకపోవడంతో శెట్టిబలిజ సామాజిక వర్గంలో ఎవరూ ఆ కుటుంబంతో మాట్లాడరాదని హుకుం జారీచేశారు. సంఘంలో తమతో మాట్లాడటం లేదని, రామాలయంలో దీపారాధన చేసేదాన్నని, గుడి తాళాలు కూడా తీసేసుకున్నారని ఆమె తెలిపారు.

# ఎందుకింత భయం?

## 151 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు

- ఏకగ్రీవం కోసం అరాచకాలు, అకృత్యాలు
- ఇంతదానికి స్థానిక ఎన్నికలెందుకు?
- జగన్‌రెడ్డే ప్రకటించుకోవచ్చుగా!
- వైసీపీకి ముకుతాడు వేయాలి
- ప్రజలకు పవన్ కల్యాణ్ పిలుపు
- రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ: కన్నా
- స్థానిక ఎన్నికలకు 'విజన్ డాక్యుమెంట్'



విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేస్తున్న పవన్, కన్నా; చిత్రంలో సునీల్ దేవధర్, మాధవ్ ఉన్నారు.

అమరావతి, మార్చి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైసీపీ గూండాలు, రౌడీల అరాచకాలు, అకృత్యాలకు లెక్కలేదని జనసేన అధినేత పవన్ కల్యాణ్ మండిపడ్డారు. ఏకగ్రీవ ఎన్నిక కోసం దౌర్జన్యాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఏ జిల్లాలో చూసినా నామినేషన్లు వేయడానికి భయపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. 151 మంది ఎమ్మెల్యేలు ఉండి కూడా వైసీపీ ఎందుకు ఇంత భయపడుతోందో అర్థం కావడం లేదని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం జనసేన, బీజేపీ సిద్ధం చేసిన 'విజన్ డాక్యుమెంట్'ను గురువారం విజయవాడలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణతో కలిసి పవన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. 'అనంతపురంలో జనసేన పీఏసీ సభ్యుడు చిలకం మధుసూధన్‌రెడ్డిపై రాళ్ల దాడి చేయడం, శ్రీకాళహస్తిలో బీజేపీ నాయకులపై దాడి చేయడం ఆందోళన కలిగిస్తున్నాయి. 151 మంది ఎమ్మెల్యేలు ఉండి కూడా వైసీపీ ఎందుకు ఇంత భయపడుతోందో అర్థం కావడం లేదు. ఈ మాత్రం దానికి ఎన్నికలెందుకు? ఏకగ్రీవం చేయడానికి ఎన్నికలెందుకు.. ఎన్నికల సంఘం ఎందుకు.. జగన్‌రెడ్డే ప్రకటించుకోవచ్చు కదా' అని విమర్శించారు. గోదావరి జిల్లాల్లో రైతుల్ని బెదిరిస్తున్నారని, ఏకగ్రీవం చేయకపోతే భూములు లాగేసుకుంటాం.. బైండోవర్ కేసులు పెడతామని బెదిరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. కళ్ల ముందు ఇదంతా జరుగుతుంటే చర్య తీసుకోకపోవడం నేరపూరిత రాజకీయాలకు వంత పాడినట్లు అవుతుందని.. దీనిపై ఎన్నికల సంఘం దృష్టిపెట్టాలని కోరారు. పోలీసులు మహిళలను దుర్భాషలాడడం దారుణమని, కొంత మంది పోలీసులు వైసీపీ కార్యకర్తల్లా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. 'భయపెట్టి సాధించిన గెలుపు ఎన్నటికీ నిలబడదు. జనసేన, బీజేపీ తరఫున నామినేషన్లు వేసిన వాళ్లు ధైర్యంగా నిలబడండి. బెదిరింపులకు లొంగవద్దు. అదుపుతప్పిన ఎద్దు ముక్కుకు తాడేసినట్లుగా.. వైసీపీ రౌడీయిజానికి ముకుతాడు వేయాల్సిన సమయం వచ్చింది. అది త్వరలోనే జరుగుతుంది. ప్రజలందరూ దీని కోసం కలిసి రావాలి' అని పిలుపిచ్చారు.

### ప్రతి ఇంటికీ తాగునీరు.. పంచాయతీలకు నేరుగా నిధులు

స్థానిక సంస్థల వ్యవస్థ పట్ల బీజేపీ-జనసేన ఆలోచన విధానాన్ని విజన్ డాక్యుమెంట్‌లో పొందుపరిచారు. 'గ్రామీణ, పట్టణ నగర ప్రాంతాల్లో ప్రతి ఇంటికి సురక్షిత జలాలు ఇచ్చేందుకు హర్ ఘర్ జల్ కార్యక్రమాన్ని కేంద్రం చేపట్టింది. దీనిని రాష్ట్రంలో సమర్థంగా అమలు చేస్తాం. స్థానిక సంస్థలకు వచ్చే నిధులకు పూర్తి జవాబుదారీగా వ్యవహరిస్తాం. పంచాయతీలకు నేరుగా నిధులు అందిస్తాం. గ్రామీణ గృహకల్పన, ఉపాధి హామీ పథకం అమలు, స్వచ్ఛ భారత్ నిధుల కింద మరుగుదొడ్ల నిర్మాణం, గ్రామీణ రహదారులు నిర్మాణం, సర్వశిక్ష అభియాన్ పథకం ద్వారా ప్రాథమిక, మాధ్యమిక విద్య, గ్రామ పంచాయతీల్లో విద్యుత్ ఆదాకు ఎల్‌ఈడీ బల్బుల ఏర్పాటు, గర్భిణులకు పౌష్టికాహారం సరఫరా, బాలింతలకు, శిశువులకు ఆరోగ్య ఆహార పథకం లాంటివి అమలు చేస్తాం. గ్రామ సభల నిర్వహణను కచ్చితంగా అమలు చేస్తాం. ప్రతి వార్డులో ప్రజాభద్రత కమిటీలు ఏర్పాటు చేస్తాం. విద్యార్థినులకు ఆత్మరక్షణ విద్యల్లో తర్ఫీదు ఇప్పిస్తాం' అని అందులో హామీలిచ్చారు.

### ప్రజాస్వామ్యం ఖూనీ: కన్నా

స్థానిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని కన్నా ఆరోపించారు. సొసైటీలు నామినేట్ చేసుకున్నట్లు ఆర్డినెన్సు తీసుకొచ్చి స్థానిక సంస్థల్లో అభ్యర్థులను నామినేట్ చేసుకుంటే సరిపోతుంది కదా అని ఎద్దేవా చేశారు. 'మీ ప్రాంతాల్లో గెలిపించుకుని రాకపోతే మీ ఉద్యోగాలు పీకేస్తామని స్వయంగా సీఎం జగన్ మంత్రులకు, ఎమ్మెల్యేలకు చెప్పడం దారుణం. రాష్ట్రంలో నియంతృత్వానికి ఫ్యాక్షనిజం తోడైంది. గతంలో టెండర్లు వేయకుండా, టెండర్ ఫాంలు లాక్కున్నట్లు, ఇప్పుడు ఎన్నికల నామినేషన్ పత్రాలను లాక్కుంటున్నారు. నా రాజకీయ జీవితంలో ఇటువంటి సంఘటనలు చూడలేదు' అని అన్నారు. ఏపీలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ దేవధర్ అన్నారు.

# ఏలూరు వైసీపీలో 'మేయర్' చిచ్చు

- టికెట్ ఇవ్వలేదని సిటీ అధ్యక్షుడి కన్నీరు
- ఉపముఖ్యమంత్రి నాని ఇంటి వద్ద ధర్నా
- అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకెళ్లిన పోలీసులు





ఆళ్ల నాని నివాసం వద్ద బైఠాయించిన బొద్దాని శ్రీనివాస్

ఏలూరు రూరల్, మార్చి 12: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పశ్చిమ గోదావరి జిల్లా వైసీపీలో అంతర్గత విభేదాలు ఒక్కసారిగా బహిర్గతమయ్యాయి. నగర మేయర్ సీటు కేటాయింపు పార్టీలో అగ్గిరాజేసింది. పార్టీ సీనియర్ నేత, నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని ఇంటి వద్దే ఆందోళనకు దిగడం సంచలనం సృష్టించింది. బొద్దానికి మేయర్ సీటు ఇస్తామని గతంలోనే పార్టీ ఆయనకు హామీ ఇచ్చినట్లు సమాచారం. ప్రస్తుత ఎన్నికల్లో జనరల్ మహిళకు మేయరు సీటు రిజర్వు అవ్వడంతో తన భార్యకు ఆ సీటు కేటాయిస్తారని ఆయన భావించారు. కానీ దానిని మాజీ మేయర్ షేక్ నూర్జహాన్‌కు కేటాయించారని.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హామీ ఇచ్చారని ప్రచారం ఊపందుకోవడంతో ఆయన హతాశుడయ్యారు. గురువారం వందల మంది అనుచరులతో ఉప ముఖ్యమంత్రి నివాసం వద్ద ధర్నాకు దిగారు. దశాబ్దకాలంగా పార్టీకి సేవలు చేసిన తమ నేతను పక్కన పెట్టడంపై అనుయాయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. దీంతో క్యాంపు కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వైసీపీ నేతలు బొద్దానిని బుజ్జగించే ప్రయత్నం చేశారు. ఆయన పట్టు వీడలేదు. చైర్మన్ సీటు తనకే ఇస్తామని చెప్పి మోసం చేశారని కన్నీరు మున్నీరయ్యారు. మేయర్ పదవిని నూర్జహాన్‌కు, తన భార్యకు చెరో రెండున్నరేళ్లయినా కేటాయించాలని కోరారు. దానికీ నాయకత్వం అంగీకరించలేదని సమాచారం. కాగా.. ధర్నా చేస్తున్న శ్రీనివాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీంతో అగ్నికి ఆజ్యం పోసినట్లయింది. ఉప ముఖ్యమంత్రి ఇంట్లోనే ఉండి బొద్దానిని అరెస్టు చేయించారని కార్యకర్తలు, మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఫలితాలపై ప్రభావం చూపవచ్చని వైసీపీ నేతలు చెబుతున్నారు.

# కరోనా కల్లోలం ఆటలు ఆగమాగం



యూఈఎఫ్ఏ చాంపియన్స్ లీగ్‌లో పారిస్ సెయింట్-జెర్మయిన్ (పీఎస్‌జీ) 2-1 తేడాతో బొరూసియా డార్ట్‌మండ్‌పై గెలిచి క్వార్టర్స్‌కు చేరింది. అయితే, ఈ మ్యాచ్ ఖాళీ స్టేడియంలో జరగ్గా బయట పీఎస్‌జీ అభిమానులు బాణసంచా కాలుస్తూ హంగామా చేశారు.

**న్యూఢిల్లీ:** 'కొవిడ్-19' మహమ్మారి క్రీడలపై పెను ప్రభావం చూపుతోంది. ఈ వైరస్‌తో రద్దవుతున్న, వాయిదా పడుతున్న టోర్నీల సంఖ్య వేగంగా పెరుగుతోంది. భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరగాల్సిన మిగిలిన రెండు వన్డేలు ప్రేక్షకుల్లేకుండానే జరిగే అవకాశాలున్నాయి. ఇక వేసవి మెగా టోర్నీ ఐపీఎల్ జరుగుతుందా? లేదా? అనే చర్చ ఊపందుకుంది. వేల కోట్ల రూపాయల వ్యాపారంతో ముడిపడివున్న ఈ టోర్నమెంట్‌పై నిర్ణయం తీసుకొనే విషయంలో క్రీడామంత్రిత్వ శాఖ, బీసీసీఐ ఆచితూచి వ్యవహరిస్తున్నట్టు కన్పిస్తోంది. ఈ 13వ సీజన్ ఐపీఎల్‌ను కొనసాగించాలనే కేంద్ర క్రీడా మంత్రిత్వ భావిస్తోంది. అయితే ఖాళీ స్టేడియాలకే పరిమితం చేయాలని అనుకుంటోంది. ఈమేరకు బీసీసీఐకి సంకేతాలిచ్చింది.

## ఐపీఎల్‌పై ఉత్కంఠ



### పాలకమండలి భేటీ రేపు

ఐపీఎల్ పాలక మండలి శనివారం సమావేశం కానుంది. టోర్నీ విషయమై ఈ భేటీలో కీలక నిర్ణయం తీసుకోనున్నట్టు తెలుస్తోంది. ఈనెల 29న ముంబై ఇండియన్స్-చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్ ద్వారా ఐపీఎల్‌కు తెరలేవనుంది. ఐపీఎల్‌లో కీలకమైన విదేశీ క్రికెటర్లు ఏప్రిల్ 15వరకు అందుబాటులో ఉండబోరు. కరోనా వ్యాప్తిని నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం వీసాలను సస్పెండ్ చేసింది. దాంతో వచ్చేనెల 15 తర్వాతే వారు భారత్‌కు వచ్చే అవకాశముంది. కాగా ఫ్యాన్స్ లేకుండా ఐపీఎల్ నిర్వహించాలని యోచిస్తున్నా..దేశంలో కరోనా పాజిటివ్ కేసులు పెరుగుతుండడంతో టోర్నమెంట్‌ను వాయిదా వేసే అవకాశాలనూ కొట్టిపారేయలేమని బీసీసీఐ వర్గాలు అంటున్నాయి.

### ఆపడమే ఉత్తమం..

ఐపీఎల్ నిర్వహణపై విదేశీ వ్యవహారాల శాఖ కూడా ఆందోళన వ్యక్తంజేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో టోర్నమెంట్‌ను జరపకపోవడమే ఉత్తమమని పాలక మండలికి సూచించింది.



### రోడ్ సేఫ్టీ వరల్డ్ సిరీస్ వాయిదా..

దిగ్గజ ఆటగాళ్లు సచిన్, లారా, సెహ్వాగ్ లాంటి వారు బరిలోకి దిగిన రోడ్ సేఫ్టీ వరల్డ్ సిరీస్‌పై కరోనా కాటుపడింది. మహారాష్ట్రలో రోజురోజుకూ వైరస్ బాధిత కేసులు పెరుగుతుండడంతో ఈ సిరీస్‌ను అర్ధంతరంగా వాయిదావేశారు.

### కేంద్రానికి నోటీసులు

**చెన్నై (ఆంధ్రజ్యోతి):** క్రికెట్ ఫ్యాన్స్‌కు కరోనా వైరస్ సోకకుండా ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోనున్నారో ఈనెల 23లోగా తెలపాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి, బీసీసీఐకి మద్రాసు హైకోర్టు గురువారం నోటీసులు జారీ చేసింది. ఐపీఎల్‌ను రద్దు చేయాలంటూ న్యాయవాది ఒకరు పిల్ దాఖలు చేశారు. న్యాయమూర్తులు ఎంఎం సుందరేశ్, కృష్ణన్‌రామస్వామితో కూడిన ధర్మాసనం ఎదుట ఈ పిల్ విచారణకు వచ్చింది. ఇదిలావుండగా ఐపీఎల్‌ను వాయిదా వేయాలంటూ దాఖలైన మరో పిటిషన్‌పై అత్యవసర విచారణ చేపట్టేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది.

### ఆరోగ్య శాఖ సూచనలు పాటించాలి

**దే**శంలో కరోనా బాధితుల సంఖ్య 73 దాటింది. దాంతో ఆరోగ్య శాఖ పలు జాగ్రత్తలు చేపట్టింది. ఆరోగ్య శాఖ సూచనలు, సలహాలను కచ్చితంగా పాటించాలని బీసీసీఐ సహా దేశంలోని అన్ని క్రీడా సమాఖ్య (ఎన్ఎస్ఎఫ్)లను క్రీడా శాఖ ఆదేశించింది.

### ఎన్‌బీఏ ఆటగాళ్లకు కరోనా పాజిటివ్

**బా**స్కెట్‌బాల్ ఎన్‌బీఏపైనా కరోనా పంజా విసిరింది. హుటాన్ జార్జ్ టీమ్‌కు చెందిన డొనో వాల్ మిచెల్, రుఢి గోబర్ట్ అనే ఇద్దరు ఆటగాళ్లకు కరోనా పాజిటివ్‌గా తేలింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఈ సీజన్‌ను ఎన్‌బీఏ సస్పెండ్ చేసింది.

### ఆశ్చర్యంగా ఉంది: హామిల్టన్

**కొ**విడ్-19 మహమ్మారితో ప్రపంచమంతా వణికిపోతుండగా తాను ఇక్కడ ఎఫ్1 రేస్ కోసం రావడం చాలా ఆశ్చర్యంగా ఉందని వరల్డ్ చాంపియన్ లూయిస్ హామిల్టన్ అన్నాడు. 'షెడ్యూల్ ప్రకారం జరుగుతున్న ఈ రేసులో పాల్గొనడం నాకు గొప్పగా ఏమీ అనిపించడం లేదు. అసలు మనమంతా ఈ గదిలో ఉండడమే షాకింగ్‌గా ఉంది. ఎన్‌బీఏ తమ మ్యాచ్‌లను సస్పెండ్ చేసింది కానీ ఎఫ్1 మాత్రం కొనసాగుతోంది' అని అన్నాడు.



### చివరి రెండు వన్డేలు ఖాళీ స్టేడియాల్లో...

భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య మూడు వన్డేల సిరీస్‌లో మిగిలిన రెండు మ్యాచ్‌లను ఫ్యాన్స్ లేకుండా నిర్వహించనున్నారు. లఖ్‌నవ్ (మార్చి 15), కోల్‌కతా (18)లో ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి.

### టీ20 వరల్డ్‌కప్ ఫైనల్ ప్రేక్షకుడికి కరోనా

ఈ నెల 8న భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య మెల్‌బోర్న్‌లో జరిగిన మహిళల టీ20 వరల్డ్‌కప్ ఫైనల్‌కు హాజరైన అభిమాని ఒకరికి కరోనా సోకిందన్న వార్త రెండు దేశాల్లో భయాందోళనలు రేకెత్తిస్తోంది. ఆ మ్యాచ్‌ను 86 వేలమందికిపైగా తిలకించిన విషయం విదితమే. 'ఆ మ్యాచ్‌కు హాజరైన ఓ ప్రేక్షకుడికి కరోనా ఉన్నట్టు నిర్ధారణ అయిందని ఆరోగ్య, మానవ సేవల శాఖ మాకు తెలిపింది. ఉత్తర స్టాండ్ రెండో వరుస ఎన్ 42 సీటులో ఆ అభిమాని కూర్చున్నాడ'ని మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ) యాజమాన్యం గురువారం తెలిపింది.

**ఇటలీ ఫుట్‌బాలర్‌కు కరోనా:** యువెంటస్, ఇటలీ ఫుట్‌బాలర్ డేనియెల్ రుగానీ కరోనా బారినపడ్డాడు. పరీక్షల్లో రుగానీకి కరోనా పాజిటివ్‌గా తేలిందని యువెంటస్ తెలిపింది. వ్యాధి లక్షణాలు బయటపడడంతో అతడు కలసిన అందరినీ ఐసోలేషన్‌లో ఉంచనున్నట్టు చెప్పింది.

**ఒలింపిక్స్ వాయిదా వేయండి..: ట్రంప్**



టోక్యో ఒలింపిక్స్‌ను ఏడాది పాటు వాయిదా వేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కోరారు. 'ఖాళీ స్టేడియాల్లో నిర్వహించేకంటే వాయిదా వేయడమే మంచిదికదా' అని ట్రంప్ అన్నారు. కాగా కరోనా నేపథ్యంలో 2020 ఒలింపిక్స్ రద్దు ఆలోచనేదీ లేదని టోక్యో గవర్నర్ యురికో కొయికె చెప్పారు.

**ప్రేక్షకులు లేకుండా పీఎస్ఎల్**

పాకిస్థాన్ సూపర్‌లీగ్ లీగ్ (పీఎస్ఎల్)లో మిగిలిన అన్ని మ్యాచ్‌లను ఖాళీ స్టేడియాల్లో నిర్వహించాలని ఆ దేశ క్రికెట్ బోర్డు నిర్ణయించింది. మరోవైపు ఈనెలలో బంగ్లాదేశ్‌తో తమదేశంలో జరగాల్సిన సిరీస్‌పై రాబోయే 24 గంటల్లో నిర్ణయం తీసుకుంటామని బోర్డు తెలిపింది.

**ఫార్ములావన్‌కూ బ్రేక్ ?:** ఫార్ములావన్‌పైనా నీలినీడలు కమ్ముకొంటున్నాయి. ఇప్పటికే చైనాలో జరగాల్సిన సీజన్ ఆరంభ రేస్ రద్దయింది. తాజాగా ఈ ఆదివారం జరగాల్సిన ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రీకి అంతా సిద్ధమవుతుండగా.. తాము వైదొలుగుతున్నట్టు మెక్‌లారెన్ ప్రకటించింది. తమ సిబ్బందిలో ఒకరికి కరోనా పాజిటివ్‌గా తేలడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. మెక్‌లారెన్ నిర్ణయంతో ఇతర జట్లు ఎలా వ్యవహరిస్తాయనే ఆసక్తి వ్యక్తమవుతోంది.

**మియామి ఓపెన్ రద్దు:** కరోనా ఉధృతి నేపథ్యంలో ప్రతిష్ఠాత్మక ఏటీపీ, డబ్ల్యూటీఏ మియామి ఓపెన్‌ను రద్దు చేశారు. ఇప్పటికే ఇండియన్ వెల్స్ టోర్నీ కూడా రద్దు చేసిన విషయం తెలిసిందే. మరోవైపు ఆరు వారాలపాటు ఎలాంటి టెన్నిస్ టోర్నీలు జరగవని ఏటీపీ ప్రకటించింది.

## హారికకు మరో డ్రా

**లుసాన్నే (స్విట్జర్లాండ్):** ఫిడే మహిళల గ్రాండ్ ప్రీలో తెలుగు గ్రాండ్‌మాస్టర్ హారిక టైటిల్ ఆశలు దాదాపుగా గల్లంతయ్యాయి. గురువారం జరిగిన 10వ రౌండ్లో ఉక్రెయిన్ జీఎం ముజిచెక్‌తో ఆడిన హారిక 31 ఎత్తుల తర్వాత డ్రాకు అంగీకరించి ఒక పాయింట్‌తో సరిపెట్టుకుంది. పది రౌండ్ల అనంతరం హారిక ఖాతాలో 5 పాయింట్లు చేరాయి.

## ఊహించినట్టే..

● వరుణుడి ఆటంకం
● భారత్-దక్షిణాఫ్రికా తొలి వన్డే రద్దు
● ఆదివారం రెండో మ్యాచ్

ధర్మశాలలో భారత్-దక్షిణాఫ్రికా మధ్య క్రికెట్ మ్యాచ్ అంటే అభిమానులేమో కానీ వరుణుడికే ఎక్కువ ఆసక్తి ఉన్నట్టుంది. ఈసారి కూడా రంచనుగా హాజరై కుంభవృష్టి కురిపించాడు. దీంతో కరోనా భయంతో స్టేడియానికి వచ్చిన కొద్దిపాటి ప్రేక్షకులతో పాటు సొంతగడ్డపై టీమిండియా స్టార్ల దూకుడును వీక్షిద్దామనుకున్న అభిమానులకు కూడా నిరాశే ఎదురైంది. ఇంతకుముందు ఈ జట్ల మధ్య ఇదే వేదికపై జరగాల్సిన టీ20 మ్యాచ్ కూడా ఇలాగే రద్దయింది.

**ధర్మశాల:** అనుకున్నట్టుగానే జరిగింది.. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య జరగాల్సిన తొలి మ్యాచ్‌పై వరుణుడు నీళ్లు కుమ్మరించాడు. ఉదయం నుంచీ కురిసిన వర్షంతో కనీసం టాస్ వేయడానికి కూడా పరిస్థితి అనుకూలించలేదు. మైదానం పూర్తి చిత్తడిగా మారింది. దీంతో ఒక్క బంతి కూడా పడకుండానే మ్యాచ్‌ను రద్దు చేశారు. రెండ్రోజులుగా ఇక్కడ వర్షాలు కురుస్తుండడంతో ఈ మ్యాచ్ జరగడం కష్టమేనని భావించారు. గడిచిన ఆరు నెలల్లో ఈ స్టేడియంలో అంతర్జాతీయ మ్యాచ్ రద్దు కావడం ఇది రెండోసారి. ఇంతకుముందు సెప్టెంబరులో ఈ రెండు జట్ల మధ్య జరగాల్సిన టీ20 మ్యాచ్ కూడా వర్షార్పణమైంది. బుధవారం కురిసిన భారీ వర్షానికి మైదానాన్ని కవర్లతో కప్పి ఉంచారు. అలాగే ఆ



రోజు రాత్రి నుంచి వర్షం పడుతూనే ఉంది. దీంతో మైదానం పరిస్థితి దారుణంగా తయారైంది. అందుకే టాస్ వేయడం కూడా ఆలస్యమైంది. మధ్యాహ్నం 1.15కి పిచ్‌ను పరిశీలించాలని అనుకున్నా వర్షం ఆరంభం కావడంతో సాధ్యం కాలేదు. రెండు గంటలకు కవర్లను తొలగించినా అప్పటికే కవర్లపై నిలిచిన నీటితో ఓ మడుగును తలపించింది. మూడు సూపర్ సాపర్‌లను రంగంలోకి దించినా మైదానం సిద్ధం కాలేదు. తిరిగి మూడు గంటలకు భారీ వర్షం కురవడంతో ఇక ఆశలు వదులుకున్నారు. అటు ప్రతీ నాలుగు నిమిషాలకు ఓ ఓవర్ చొప్పున కోత పడుతుండడంతో కనీసం 'టీ20' మ్యాచ్ అయినా వీలవుతుందేమోనని అభిమానులు భావించారు. కానీ సాయంత్రం 6.30 గంటలకు కటాఫ్ సమయం ఉన్నా 5.20కి మ్యాచ్ రద్దు చేస్తున్నట్టు అంపైర్లు ప్రకటించారు.

### కరోనా భయంతో...

**దే**శంలో విజృంభిస్తున్న కరోనా భయంతో ఈ మ్యాచ్‌ను ప్రత్యక్షంగా చూసేందుకు అభిమానులు ఇష్టపడలేదు. దీంతో 23 వేల సామర్థ్యం కలిగిన ఈ స్టేడియం ముప్పావు వంతు ఖాళీగానే దర్శనమిచ్చింది. దీనికి తోడు వర్షం వస్తూ.. పోతూ ఉండడంతో రద్దు నిర్ణయానికి ముందే చాలా మంది వెళ్లిపోయారు.

## సైనా ఇంటిముఖం

● సాయి ప్రణీత్, కశ్యప్ కూడా
● క్వార్టర్స్‌లో సింధు
● ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్



**బర్మింగ్‌హామ్:** టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించే ప్రయత్నంలో ఉన్న ఏస్ షట్లర్ సైనా నెహ్వాల్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్స్ ఆరంభ రౌండ్‌లోనే ఓడి ఇంటిముఖం పట్టింది. కాగా, వరల్డ్ చాంపియన్ పీవీ సింధు క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. సాయిప్రణీత్, పారుపల్లి కశ్యప్, లక్ష్యసేన్ కూడా ఓటములతో టోర్నీ నుంచి అవుటయ్యారు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సైనా 11-21, 8-21తో మూడో సీడ్ అకానె యమగూచి (జపాన్) చేతిలో పరాజయం పాలైంది. టోక్యోకు అర్హత సాధించాలంటే వచ్చే నెల 28లోపు వరల్డ్ ర్యాంకింగ్స్ టాప్-16లో సైనా స్థానం సంపాదించాలి. గురువారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో సింధు 21-19, 21-15తో సంగ్ జి హున్ (కొరియా)ను ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో సాయి ప్రణీత్ 12-21, 13-21తో జున్ పెంగ్ ఝూ (చైనా) చేతిలో ఓడాడు. కశ్యప్ మ్యాచ్ ఒక్క నిమిషం మాత్రమే జరిగింది. షెసర్ హిరెన్ రుస్తావిడో (ఇండోనేసియా)తో మ్యాచ్‌లో 0-3తో వెనుకబడిన సమయంలో కశ్యప్ రిటైర్డ్ హర్ట్‌గా వైదొలిగాడు. కాగా, రెండో రౌండ్‌కు చేరిన యువ సంచలనం లక్ష్య సేన్ 17-21, 18-21తో విక్టర్ అక్సెల్‌సెన్ (డెన్మార్క్) చేతిలో పోరాడి ఓడాడు. తొలి రౌండ్‌లో లక్ష్య సేన్ 17-21, 21-8, 21-17తో చెక్ యు లి (హాంకాంగ్)పై గెలిచాడు. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-సిక్కిరెడ్డి ద్వయం 5-4తో ఉన్న సమయంలో ఇంగ్లండ్ జోడీ జెన్నీ మూర్-విక్టోరియా విలియమ్స్ జంట రిటైరైంది.

## ప్రభావశీల స్త్రీల జాబితాలో నీతా అంబానీ



**న్యూఢిల్లీ:** క్రీడారంగంలో అత్యంత ప్రభావశీల టాప్ పది మంది మహిళల జాబితాలో ముంబై ఇండియన్స్ అధినేత్రి నీతా అంబానీకి చోటు లభించింది. స్పోర్ట్స్ బిజినెస్ నెట్‌వర్క్, ఐస్పోర్ట్ కనెక్ట్ సంస్థలు ఈ జాబితాను విడుదల చేశాయి. తొలుత 25 మందితో కూడిన జాబితాను రూపొందించగా, వడపోత అనంతరం పదిమంది పేర్లను ప్రకటించారు. టెన్నిస్ సూపర్ స్టార్ సెరెనా విలియమ్స్, జిమ్నాస్ట్ సిమోన్ బైల్స్‌కి కూడా ఈ జాబితాలో చోటు దక్కింది.

## రసపట్టులో రంజీ ఫైనల్

### బెంగాల్ 354/6

**రాజ్‌కోట్:** సుదీప్ ఛటర్జీ (81), వృద్ధిమాన్ సాహా (64) వీరోచిత పోరాటంతో సౌరాష్ట్రతో ఫైనల్లో బెంగాల్ పుంజుకొంది. నాలుగోరోజైన గురువారం ఓవర్‌నైట్ స్కోరు 134/3తో బ్యాటింగ్ కొనసాగించిన బెంగాల్ ఆట ముగిసేసరికి 6 వికెట్ల నష్టానికి 354 పరుగులు చేసింది. క్రీజులో అనుస్తూప్ మజుందార్ (58), అర్నబ్ నంది (28) ఉన్నారు. బెంగాల్ ఇంకా సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్ స్కోరుకు 71 పరుగుల వెనుకంజలో ఉంది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం అందుకునే జట్టుకు టైటిల్ దక్కుతుంది. కాగా, కరోనా కారణంగా ఆఖరిరోజైన శుక్రవారం ప్రేక్షకులను అనుమతించకుండా మ్యాచ్‌ను నిర్వహించనున్నారు.

## మేవెదర్ మాజీ ప్రేయసి మృతి



**లాస్‌ఏంజెల్స్:** బాక్సింగ్ దిగ్గజం ఫ్లాయిడ్ మేవెదర్ మాజీ ప్రియురాలు జోసి హారిస్ (40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. లాస్‌ఏంజెల్స్‌లోని ఆమె ఇంటికి సమీపంలోని ఓ కారులో జోసి విగతజీవిగా పడి ఉందని పోలీసులు తెలిపారు. మేవెదర్, జోసికి ముగ్గురు సంతానం. 2010లో మేవెదర్ చిత్రహింసలు పెడుతున్నాడని జోసి పోలీసులను ఆశ్రయించింది. ఈ కేసులో తప్పు ఒప్పుకొన్న మేవెదర్ 2 నెలల జైలు శిక్ష కూడా అనుభవించాడు.

# అమరావతి పోరు ఆగదు

▸▸ 2900 కేసులు పెట్టారు.. ఇంకెన్ని పెడతారు?

▸▸ 86వ రోజుకు రాజధాని రైతుల ఆందోళనలు

గుంటూరు, మార్చి 12(ఆంధ్రజ్యోతి): 'ఎన్ని కేసులు పెట్టుకుంటారో పెట్టుకోండి.. ఇప్పటికే 3 వేల వరకు కేసులు పెట్టారు. ఒక్కసారి జైలుకు వెళ్లినా అంతే, పది సార్లు వెళ్లినా అంతే. పది నెలల ముందు తుళ్లూరు పోలీసుస్టేషన్‌లో ఎన్ని కేసులు నమోదయ్యాయి.... ఇప్పుడు చూడండి.. ఎన్నో?.. దీనిని బట్టే అర్థమవుతుంది మీ పాలన చక్కదనం... అంటూ వైసీపీ ప్రభుత్వ తీరుపై అమరావతి రైతులు నిప్పులు చెరిగారు. 'ఇప్పటికే 2,900కు పైగా కేసులు పెట్టారు... ఇంకెన్ని పెట్టుకుంటారో పెట్టుకోండ'ంటూ తెగేసి చెప్పారు. అమరావతినే ఏకైక రాజధానిగా ప్రకటించాలని డిమాండ్‌చేస్తూ వరుసగా 86వ రోజు గురువారం రాజధాని ప్రాంతంలో ఆందోళనలు యథావిధిగా కొనసాగాయి. అవ్వ, తాత అంటూ ముద్దులు పెడితే నమ్మి మోసపోయామంటూ రాయపూడికి చెందిన 70 ఏళ్లు పై బడిన ముస్లిం మహిళలు 12 గంటల నిరాహార దీక్షకు కూర్చొన్నారు. రాజధాని నిర్మాణ పనులు ఆగిపోవడంతో పనులు లేక తాము కుటుంబ సభ్యులకు భారమయ్యామని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి విషయంలో మాట తప్పారంటూ మండిపడ్డారు. అమరావతిని రాజధానిగా కొనసాగించాలంటూ డిమాండ్‌చేశారు. పెదపరిమిలో మహిళలు నల్లబెలూన్లు పట్టుకుని ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. వెలగపూడి దీక్షాశిబిరంలో సీఎం మనసు మారాలంటూ లక్ష్మీ, గణపతిపూజ నిర్వహించారు. కాగా మూడు రాజధానులతో రాష్ట్రం నాశనమవుతుందంటూ.. సీఎం జగన్, మంత్రులు, కర్నూలు, విశాఖ వాసుల వేషధారణలతో తుళ్లూరు రైతులు లఘు నాటకం ప్రదర్శించారు. కర్నూలులో హైకోర్టు పెట్టటం వల్ల ఉపయోగం ఏమిటని, అక్కడ జిరాక్స్ సెంటర్లు పెట్టుకోవటం తప్ప ఏమి చేయగలమంటూ కర్నూలు వాసుల వేషధారులు వాపోయారు. మాకు రాజధాని వద్దు... ప్రశాంతంగా ఉన్న మా ప్రాంతంలో పులివెందుల పంచాయితీలూ వద్దంటూ విశాఖ వాసులు గగ్గోలుపెడుతున్నట్లుగా నాటిక ప్రదర్శించారు.



మందడంలో రాజధాని రైతుల నిరసన

### నేడు చిల్లుల గిన్నెలతో నిరసన

జగన్ పాలనతో ఒరిగిందేమీ లేదంటూ శుక్రవారం చిల్లుల గిన్నెలతో నిరసన తెలపనున్నట్లు జేఏసీ నేతలు పేర్కొన్నారు.

### సీఎం మొండివైఖరి వీడాలి

**రై**తులు చేస్తున్న ఆందోళనలకు కృష్ణా జిల్లా నందిగామ మండలం చెరుకుంపాలెం మహిళలు సంఘీభావం తెలిపారు. అలానే విశాఖ, నెల్లూరు నుంచి పలువురు రైతులు అమరావతి రైతుల ఆందోళనలకు మద్దతు పలికారు. అభివృద్ధి వికేంద్రీకరణకు ఓకే అని, పరిపాలన వికేంద్రీకరణ తగదని పెనుమాక దీక్షాశిబిరంలో పలువురు వ్యాఖ్యానించారు. మూడు రాజధానులతో ప్రాంతీయ విభేదాలను వైసీపీ ప్రభుత్వం సృష్టిస్తోందని, ఒక్క రాజధాని మాత్రమే ఉండాలని రైతులు స్పష్టం చేశారు. మూడు రాజధానులు వద్దు.. అమరావతి ముద్దు... ఒకే రాష్ట్రం- ఒకే రాజధాని అంటూ ఉండవల్లిలో నిరసనకారులు నినాదాలు చేసి ముఖ్యమంత్రి మొండివైఖరి విడనాడి రాష్ట్ర ప్రయోజనాలు కోసం పనిచెయ్యాలని జేఏసీ నేతలు కోరారు.

తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములను రాజధాని కోసం ఇచ్చిన రైతులు తీరా ప్రభుత్వం మారడంతో ఇలా రోడ్డున పడటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. 3 రాజధానుల ఏర్పాటును వ్యతిరేకిస్తూ మంగళవారం మండలంలోని నవులూరు, యర్రబాలెం, కృష్ణాయపాలెం, నిడమర్రు గ్రామాల్లో రైతులు, రైతు కూలీలు నిర్వహిస్తోన్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 86వ రోజుకు చేరాయి. దీక్షా శిబిరాలను సందర్శించిన వారిలో జేఏసీ నాయకులు రుద్రు కోటేశ్వరరావు, కొత్త శ్రీనివాస్, వేమూరి మైనర్‌బాబు, ఆకుల ఉమా మహేశ్వరరావు, వంకాయల శ్రీను, అంకారావు, కొల్లి వెంకటరావు, అప్పారావుల తదితరులు వున్నారు. వెలగపూడి, రాయపూడిలో 24 గంటల రిలేదీక్షలు కొనసాగించారు. తుళ్లూరు, మందడం, పెనుమాక, ఉండవల్లి, యర్రబాలెం, కృష్ణాయపాలెం, పెదపరిమి, తాడికొండ అడ్డరోడ్డు తదితర ప్రాంతాల్లో దీక్షలు, ఆందోళనలు కొనసాగాయి.

# ఇంజనీరింగ్ ఫీజుల్లో భారీ కోత

▸▸ 35,000 - 75,000 మధ్యలోనే ఫిక్స్

▸▸ టాప్ కాలేజీలకు సైతం రూ.75 వేలతోనే సరి

▸▸ 35 వేల కనిష్ఠంలో మెజారిటీ కాలేజీలు

▸▸ ఈ ఫీజులు 2019-20 విద్యా సంవత్సరానికే

▸▸ మేనేజ్‌మెంట్ కోటాలోనూ ఇవే ఫీజులు

▸▸ ప్రతిపాదనలకు సీఎం సూత్రప్రాయ ఆమోదం

▸▸ నేడు ప్రభుత్వానికి సమర్పించనున్న కమిషన్

అమరావతి, మార్చి 12(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ ట్యూషన్ ఫీజుల్లో భారీగా కోత పడింది. రాష్ట్రంలో మొత్తం 287 ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలకుగాను సగం కాలేజీలకు రూ.35వేల కనీస ఫీజు ఖరారైంది. రాష్ట్రంలోని టాప్ కాలేజీలకు సైతం గరిష్ఠంగా రూ.75వేల లోపు ఫీజుతోనే సరి. మిగిలిన కాలేజీలకు రూ.35వేల కనిష్ఠ, రూ.75వేల గరిష్ఠ ఫీజుల మధ్యలోనే ఉంటాయి. ఈ ఫీజులు 2019-20 విద్యా సంవత్సరానికే అమల్లో ఉంటాయి. ఈ సారికి మేనేజ్‌మెంట్ కోటాలోనూ ఇవే ఫీజులు వర్తించనున్నాయి. ఈ మేరకు ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ చేసిన తాజా ప్రతిపాదనకు ముఖ్యమంత్రి జగన్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. గురువారం రాత్రి తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం వద్ద ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఇంజనీరింగ్ ఫీజులపై ఇటీవల చేసిన ప్రతిపాదనల పట్ల సీఎం అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో... కమిషన్ ఈ సారి ఫీజులను భారీగా తగ్గిస్తూ సీఎం ముందు ప్రతిపాదనలు ఉంచింది. జగన్ వీటికి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు. ఇటీవల చేసిన సిఫారసుల ప్రకారం 10 ఇంజనీరింగ్ కాలేజీలకు రూ.91వేల నుంచి రూ.99 వేల మధ్యలో ఫీజు ఫిక్స్ చేశారు. అయితే పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తున్న తరుణంలో కన్వీనర్ కోటాలో ఫీజులు పెంచడంతో పాటు మేనేజ్‌మెంట్ కోటాలోనూ డబుల్ ఫీజుకు సిఫారసు చేస్తారా? అని సీఎం అసంతృప్తి వ్యక్తం చేస్తూ రీ వర్క్ చేయాలని ఆదేశించారు. దీంతో ఇప్పుడు ఫీజులను అసాధారణంగా తగ్గించడం గమనార్హం. ట్యూషన్ ఫీజు బకాయిలు ఈ నెల 30 లోపు విడుదల చేయాలని సీఎం ఆదేశించిన నేపథ్యంలో 2019-20 విద్యా సంవత్సరానికే ఈ ఫీజులు వర్తింపజేయాలని నిర్ణయించారు. మిగిలిన 2020-21, 2021-22 విద్యా సంవత్సరాలకు సంబంధించిన ఫీజులను వారం-పది రోజుల్లో సిఫారసు చేయాలని ఈ సందర్భంగా సీఎం ఆదేశించారు. తాజా ఫీజుల ప్రతిపాదనలను శుక్రవారం ఉన్నతవిద్యాశాఖ స్పెషల్ సీఎస్ సతీశ్‌చంద్రకు కమిషన్ సమర్పించనుంది. రెండు రోజుల్లో ఈ ఫీజులకు ఉత్తర్వులు జారీచేస్తారు. ప్రతి మూడు సంవత్సరాల బ్లాక్ పీరియడ్‌కు ఒకసారి ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని ట్యూషన్ ఫీజులను నిర్ధారించాల్సి ఉంది. కానీ కమిషన్ వీటిని పట్టించుకోకుండా, ఆదాయ-వ్యయాలను ప్రాతిపదికగా తీసుకోకుండా ఫీజులను భారీగా తగ్గించడం పట్ల కాలేజీల యాజమాన్యాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.


*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.*



epaper.andhrajyothy.com